# సహజమార్గ సమీక్ష

ఆంగ్లమూలం :

**శ్రీ రాఘవేంద్రరావు**, రాయచూర్

అనువాదం :

**శ్రీ టి.వి. శ్రీనివాసరావు**, కడప

ప్రచురణ :

**శ్రీ రాంచంద్రజీ మహరాజ్ సేవా ట్రస్ట్, కడప**

**వారి సౌజన్యముతో**

ప్రథమ ముద్రణ :

**జనవరి 2001**

ప్రచురణ :

**శ్రీరాంచంద్రజీ మహరాజ్ సేవా ట్రస్ట్, కడప వారి సౌజన్యముతో**


ప్రతుల కొరకు :

**శ్రీ టి.వి. శ్రీనివాసరావు**
అడ్వకేట్,
సహజమార్గ ప్రశిక్షకులు
6/5, గాడిచర్ల రామారావు వీధి,
కడప - 516 001.
ఫోన్ : 41021 (08562)

ముద్రణ :
**వాసవీ గ్రాఫిక్స్,**
7/512-1, జయనగర్ కాలని,
కడప-2.
ఫోన్స్ : 44911, 45025.

# విషయసూచిక


| | | పేజి నెం. |
|---|---|---|
| | ప్రచురణకర్త వివరణ | II |
| | ఉద్దీపన | III |
| | అనువాదకుని తొలిపలుకు | IV |
| | ముందుమాట | V |
| | పరిచయము | IX |
| 1) | మానవ పోరాటం | 1 |
| 2) | భౌతిక శాస్త్రాలు-పరిశోధన | 5 |
| 3) | తత్వశాస్త్రాలు | 9 |
| 4) | మతములు | 14 |
| 5) | ఆధ్యాత్మిక సంస్థలు | 17 |
| 6) | సహజమార్గము యొక్క ఆధారము | 20 |
| 7) | సహజమార్గ లక్ష్యము | 27 |
| 8) | ప్రాణాహుతి-దాని సిద్ధాంతము-అభ్యాసము | 30 |
| 9) | ఆధ్యాత్మికోన్నతి యొక్క స్థితులు | 39 |
| 10) | అభ్యాసి యొక్క జీవితము | 45 |
| 11) | ప్రిసెప్టరు యొక్క జీవితము | 51 |
| 12) | దివ్య జీవన స్వరూపము | 58 |
| 13) | అనుబంధము | 64 |



గ్రంథకర్త : పూజ్యశ్రీ రాఘవేంద్రరావు, రాయచూర్.

సహజమార్గ స్థాపకులు : పరమపూజ్యశ్రీ రామచంద్రజీ మహరాజ్
షాజహాన్‌పూర్, యు.పి.

# ప్రచురణకర్త వివరణ

పుస్తకము లెన్నైననూ ప్రచురింపబడుచుండవచ్చును. కానీ ఒక ఆధ్యాత్మిక గ్రంథము వెలుగుచూచుట విశేషము. అందునా నిశిత పరిశీలనము శాస్త్ర దృక్పధము మెండుగా గల్గిన ఒక జ్ఞాని కలం నుండి వెలువడిన గ్రంథమన్న మరింత విశేషము.

పుజ్యశ్రీ రాఘవేంద్రరావు గారు పరిణతి చెందిన ఇంజనీయరు. సహజమార్గ సాధన ద్వారా ఉన్నతోన్నత స్థితులను బడసిన ఆధ్యాత్మిక వేత్త. ఆయనచే రచింప బడిన "A Panoramic View of Sahaj Marg" అను అంగ్లగ్రంథము తొలుత పరమపూజ్య శ్రీ రామచంద్రజీ మహరాజ్ షాజహాన్‌పూర్ వారి 76వ జన్మదిన కానుకగా విడుదల చేయబడినది. అనగా గురుదేవుల ఆశీర్వాదము ఆమోదము ఈ గ్రంథమున కున్నదనుట సుస్పష్టము తద్వారా ఒక సాధికారతను సంతరించు కొన్న గ్రంథమిది.

ఈ గ్రంథమును మిత్రుడు శ్రీ టి.వి.శ్రీనివాసరావు, అడ్వకేట్ మరియు సహజమార్గ ప్రశిక్షకులు "సహజమార్గ సమీక్ష" అను పేర తెనుగుజేసి ఒక మహోప కారమ మొనర్చినారు.

తెలుగు మాత్రమే తెలిసిన సహజమార్గులకు ఒక ఆధ్యాత్మికవేత్త భావ పరం పరను అందుబాటులోనికి దెచ్చినారు. -ఇది ఒక వరమనిన అతిశయోక్తి కాబోదు.

ఈ గ్రంథం శ్రీరామచంద్రజీ మహరాజ్ సేవాట్రస్ట్ కడపవారి సౌజన్యముచే ప్రచురితం కావడం ముదావహం.

**ఆర్.రామచంద్రరెడ్డి**
ఛేర్‌మన్,
శ్రీరామచంద్రజీ మహరాజ్ సేవాట్రస్ట్,
కడప.

కడప
వసంత పంచమి
**2001**

# ఉద్దీపన

మానవుడు బుద్ధిజీవి. ఇతర పశుపక్ష్యాదులట్లు కాదు. ఈ విశ్వమున కాధారమేమి? అని యోచించినాడు మానవుడు. ఆ యోచనల నుండే మతములు పుట్టుకొచ్చినవి. సంతృప్తి మానవనైజము గాదు. అన్వేషణకు అంతము లేదు. శాస్త్రరంగాభివృద్ధికి అది పునాది. శాస్త్రవిశ్లేషణాదృష్టి మతమును ప్రశ్నించినది. నిలదీసినది. జవాబు లేని మతాచారములు మూఢనమ్మకములైనవి. మేధస్సు కందని వన్నియు అవాస్తవములు కావు. నిరూపణకు వీలుకాని వాస్తవము లెన్నియో ఉండవచ్చును. ఆధ్యాత్మిక చింతన వీటిపై సాగును మత బంధనము నుండి విడి వడి ఆధ్యాత్మిక సంస్థలేర్పడుట కిదియే కారణము. ఆలోచనా తీరులోని విభేదములు నాయకత్వపు ఆకాంక్షలు వ్యక్తిపూజలు ఆధ్యాత్మిక సంస్థల చీలికలకు దారి తీసినవి. తద్వారా వాటి ఉద్ధేశ్యవ్యాప్తి కొంత కుంటువడినది.

ఆత్మోద్ధరణ విషయమున వంచన పనికిరాదు. కేవలము బోధనపై ఆధార పడుట సరికాదు. అవగాహన చేసికొనుటకు పరిశోధన అవసరము. అందులకు సహేతుక తర్కమొక మార్గము. ధ్యానము దానికన్న మేలైన మార్గము. అది సాక్షాత్కారమునకు దారితీయును. అప్పుడు కాని అనుమానము శంక సంపూర్ణముగా అంతమొందదు. ఆత్మానుభవము అత్యంతావశ్యకము. అట్టి ఆత్మానుభూతిని కలిగించు విధానము 'సహజమార్గము'. ఇందు వినిచదివి ఆనందించుట గాక అంచలంచలుగా పైరీతిలో అనుభవమున దివ్యత్వము నవగాహన చేసుకొనుట తటస్థించును. ఆధ్యాత్మిక ప్రాంపచిక జీవనములు ఒకదాని కొకటి సహకరించు కొంటూ సమతాస్థితి నెలకొంటుంది. సమతాస్థితి జీవితలక్ష్యమైన భగవత్సాక్షాత్కా రమును సుసాధ్యం చేస్తుంది. అందులకు వలయు ప్రాణాహుతి శక్తి ప్రసార మీ విధానమున జరుగుతుంది. ఇది ఒక

ప్రతిభావంతమైన ఆధ్యాత్మికవిద్య. మహాత్మా శ్రీరామచంద్రజీ వారివల్ల లోక వ్యాప్తమైన ఈ పద్ధతికి సంబంధించిన సంపూర్ణ వివరణమే ఈ గ్రంథము ఆంగ్లమున శ్రీరాఘవేంద్రరావు గారు దీనిని రచించిరి. శ్రీ రామచంద్రజీ వారి సహచర్యంలోను శిష్యరికంలోను ఆధ్యాత్మి కానుభూతులను చవిచూచి ఉన్నత స్థితులొందిన ధన్యులు శ్రీ రాఘవేంద్రరావు గారు. ఒక్కమాటలో చెప్పవలెనన్న గురుదేవుల చేతుల మీదుగా తయారైన ఆణిముత్య మీయన. ఈ తరమున కీయబడిన వరమనినను అతిశయోక్తి కాబోదు. వృత్తిరీత్యా ఇంజనీరు. కర్నాటకదేశమున ఇంజనీరింగ్ కళాశాలాధిపతి. పదవీ విరమణ జేసినారు గాన ప్రస్తుతము వృత్తి ప్రవృత్తి గూడా ఆధ్యాత్మిక శిక్షణయే. వారి దివ్యానుభూతుల సారమైన గ్రంథమునకిది తెనుగు సేత. తెలుగు జేసిన వారు శ్రీ టి.వి. శ్రీనివసరావు గారు. వృత్తిరీత్యా వీరు న్యాయవాది, కడపలో సహజ మార్గ ప్రశిక్షకులు. శ్రీ రాఘవేంద్రరావు గారితోనే గాక సర్వశ్రీ రామచంద్రారెడ్డి, విఠల్‌రావు, శ్రీవాత్సవ వంటి ఆధ్యాత్మికోన్నతులతో సన్నిహిత సంబంధము గలవారు. ఎంతో శ్రద్ధతో ఈ అనువాద గ్రంథమును తెలుగు వారి కందుబాటు లోనికి తెచ్చిన వీరి కృషి బహుదా అభినందనీయము.

**పి. సుబ్బరాయుడు**
అభ్యాసి, కడప.

# అనువాదకుని తొలిపలుకు

భగవత్సాక్షాత్కారమునకై ప్రయత్నము మానవుని ప్రధమ కర్తవ్యము. అందులకు పరమ పూజ్య శ్రీరామచంద్రజీ గారి సహజమార్గము అత్యంత సులువైనది మరియు ఋజువైనది.

శ్రీరామచంద్రజీ మహరాజ్ వారి మార్గదర్శకత్వంలో సాధకుడుగా, ప్రవర్ధమానుడైన పూజ్యులు శ్రీరాఘవేంద్రరావు గారు ఆంగ్లమున "A PANORAMIC VIEW OF SAHAJ MARG" అను గ్రంధము 1974లో వ్రాసినారు. అది సంపూర్ణంగా వారి అనుభవసారము.

ఆంగ్లము తెలియని తెలుగు సాధకుల ఉపయోగార్థము ఈ గ్రంధమును "సహజమార్గ సమీక్ష" అను పేర, దాదాపు 18 సంవత్సరాలకు పూర్వము నాచే తెలుగులోకి అనువదించడము జరిగింది. తదుపరి పూజ్యులు శ్రీ రాఘవేంద్రరావు గారు స్వయంగా పరిశీలించి అక్కడక్కడ సరిదిద్ది, ముద్రణకు అనుమతి నొసంగిరి. అందులకు వారికి నేను ఎల్లవేళలా కృతజ్ఞుడను.

తెలుగు భాషలో నాకు ఏమాత్రం ప్రావీణ్యత లేదు. భాషాంతరీకరణ బహుబరువగు కార్యమయినప్పటికి నా గురువర్యులు పరమపూజ్య శ్రీరామచంద్రజీ మహరాజ్, షాజహనుపూర్, యుపి., గారి అనుగ్రహము వల్ల, ఆధ్యా త్మికప్రయోజన కరమగు ఈ పనికి పూనుకొంటిని.

ఇందు భాషాపరమైన దర్పమునకుగాక, భావమునకే ప్రాధాన్యత నిచ్చితిని. పాఠకులు సహృదయంతో మన్నింతురని తలంతును. ఈ ప్రయత్నము తెలుగు అభ్యాసుల సాధనావసరమున కలిగెడి సందేహముల నివృత్తికి తోడ్పడగలదనీ, తద్వారా ఈ ప్రయత్నము సఫలీకృతమౌనని నావిశ్వాసము.

ఈ తెలుగు సేతకు సహకరించి, సలహాల నొసంగిన సోదరులు సర్వశ్రీ పి.సుబ్బరాయుడు, R&B Dept., జి.కె.వెంకటసుబ్బన్న, Elect. Dept., శ్రీ కె.రామిరెడ్డి, లెక్చరరు ఆఫ్ ఫిలాసఫీ, శ్రీ వి.కుళ్ళాయిరెడ్డి, శ్రీ ఆర్.రామచంద్రారెడ్డి, అడ్వకేటు, ప్రిసెప్టరు, మొదలయిన వారికి నాహృదయపూర్వక నమస్సులు.

వసంత పంచమి.
29-1-2001

**టి. శ్రీనివాసరావు**
అడ్వకేటు, ప్రిసెప్టరు,
6/5, రామారావు వీధి, కడప.

# ముందుమాట

"సహజమార్గ" మను యోగ సాధనా పద్ధతి దాదాపు గత పాతిక సంవత్సరాల కొలది కాలములోనే నిలకడ సాధించి విజయపరంపరలతో పురోగమించినది. సంపూర్ణ మానవుని పరిణామ చరిత్రలో ఒక నవసమాజ నాగరికత ఆరంభమని చాటుతున్నది. అనాదిగవున్న భారతీయ ఋషి సాంప్రదాయక జ్ఞానసారాన్ని శాస్త్రీయంగాను, మరియు సాంకేతికంగాను అభివృద్ధి చెందుతున్న నూతనయుగ, అవసరాలకు అనుగుణంగా ఈ మార్గము సమన్వయపరిచబడింది. తద్వారా విశ్వాసరహితము, విజ్ఞాన భరితమై వర్థిల్లుతున్న యిప్పటి మరియు భావిమేధావులకు ఎడారిలోని నీటిచెలిమివలె ఈ మార్గము సహాయపడుతున్నది. ఈ కార్యము కొరకు దాదాపు పాతిక వత్సరముల అల్పసమయములోనే దీని మూలపురుషుడగు ఒక్క బాబూజీగారి కృషి ఫలితంగా ఈ మార్గము పోషింపబడి తీర్చిదిద్దబడినది. తన ప్రసంగముల ద్వారాను, రచనల ద్వారాను ఈ విధానమును ఆయన వెల్లడించారు. అంతేకాక సృష్టిమూలమగు ఉనికి యొక్క కేంద్రముతో సదా సంబంధముకలిగిన తన మానసహృదయముల కృషి ద్వారా కార్యసాదనకు తగు యోగ్యులను తీర్చిదిద్దినారు. ఆయన చేసట్టిన కార్యక్రమాలు, వాటిని నిర్వహించన తీరు నిజంగా అద్భుతమైనవి, మానవుని సామాన్య అవగాహనా సాధనములకు అందనివి, మరియు వ్యక్తపరచుటకు సాధ్యపడనివి. ప్రధానంగా తన కృషి వెనుకనున్న ఆయన వ్యక్తిత్వము అత్యంత ఆశ్చర్యకరమైనది. అపార ప్రజ్ఞాపాటవాల కంతుపట్టనిది. అట్లయ్యునది ఆయన ప్రతియొక్క అస్పష్ట అమాయక కదలికలోను సునాయాసంగా దొరికి పోగలిగినది.

మానవ మూర్తిమత్వమును రూపొందించుట యందు సర్వ సమర్థుడగు ఆ శిల్పకళా కుశలుని ఒకానొక అత్యుత్తమ సృష్టియే శ్రీ రాఘవేంద్రరావుగారు. ఆ మహాపురుషుని సృజనాత్మక కృషి ఫలితమగు ఈ మహామనీషి యొక్క

అభివ్యంజనయే ఈ ప్రస్తుత గ్రంధము. అందుచేత సహజమార్గ సారాంశమును వివరించుట యందును దాని విశిష్ట విలువను చాటి చెప్పుట యందును ఈ గ్రంధము ఇందుకు సంబంధించిన అత్యుత్తమ రచనలలో నొకటియై యున్నది. విషయము మరియు దాని రచన సంబంధంగా గ్రంధకర్త శైలి బాబూజీ శైలికి చాల దగ్గఅగ నుండి, అవగాహనకే మాత్రము అందని దానిని గ్రహింపజేయగల ఏకైక మార్గమైన ఆత్మ నివేదన ద్వారా 'సహజమార్గ' వ్యవస్థ మూలపురుషునితో ఆయన సాధించిన తాదాత్మ్య స్థాయిని సూచించుచున్నది. సహజమార్గ విధానములో యోగసాధనకు సంబంధించిన ప్రధానాంశముల గురించి ఈ గ్రంధకర్త యొసగిన వివరణలు చాల సూటిగను, సంక్షిప్తముగను ఉన్నవి. అది బాబూజీ నిర్ధేశించిన లక్ష్యముయెడ ఆయనయొక్క సంపూర్ణ విధేయతకు, నిబద్ధతకు అభివ్యంజనములై ఉంటూ పరమార్థాన్వేషులగు ఈ సాధనావిధాన అభ్యాసుల మరియు ఇతరుల హృదయాలను నేరుగాను మరియు గాఢంగాను స్పృశించుచున్నవి.

సత్యాన్వేషణ మానవాళికి చేతనంగాగాని అచేతనంగాగాని నిరంతర కృషియై యున్నది. పరమ సత్యాన్ని దానిని యేపేరుతో పిలిచినప్పటికి - దర్శించుటకొరకై ఏర్పడిన మానవుని ఆంతర తపన పలితమే విజ్ఞానశాస్త్రము, తత్త్వశాస్త్రము మరియు మతముల ఆవిర్భావము, మానవుని అంతరాంతరాల్లోనే సత్యము నిక్షిప్తమైయున్నందున తదన్వేషణము నారంభించుటకు ఎట్టి ప్రత్యేకార్హతలు పరిమితులుఉండ నవసరం లేదు. ఇందుకై ప్రకృతియే మానవుని సిద్ధపరచి అర్హునిచేసినది. కాని అన్ని విద్యా విధానములలో వలెనే ఇచట కూడ కొంతవరకు శిక్షణ, అర్హత అవసరం కావచ్చు. ఇది ఆరంభ దశ యందలి గందరగోళమువల్ల గుడ్డిదారుల్లో చిక్కుకొను ప్రమాదము నుండియు, ప్రయత్నమార్గంలో దొర్లు దొసగులను తిరిగి తిరిగి సరిదిద్దుకుంటూ ముందుకుసాగు విధానంలోని వృథాశ్రమనుండియు అంతర్నిహిత జిజ్ఞాసగల సాధకుని రక్షించగలదు. భారతీయ ద్రష్టల యుగయుగాల జ్ఞానపరంపర

మానవ మానసమందలి ఈ మౌలిక తపన విషయమున అట్టిశిక్షణా క్రమమును కనుగొన్నది. "యోగ"మను పేరున నిది సుప్రసిద్ధము. కాని చరిత్రగమనంలో గందరగోళాన్ని సృష్టించు పండితుల విన్యాసాలవల్లను మరియు స్వప్రయోజన పరులగు కపటుల చేతులలోను ఈ "యోగ"ము అత్యంత మార్మికత క్లిష్టతలకు లోనైనది. ఆధునిక యుగమున మానవ నాగరికతా చరిత్రలో సహజమార్గ సాధన వ్యవస్థాపకుడు ఈ యోగముయొక్క పూర్వపు స్వచ్ఛతను తిరిగి పునరుద్ధరించి ఆధునిక మానవుని అవసరాల కనుగుణంగా దానిని తీర్చిదిద్దినాడు. శ్రీరాఘవేంద్రరావు గారిచే రచించబడిన ఈగ్రంథము మానవుని అతని అస్తిత్వ, పరిణామాల మౌలిక తత్త్వముతో మేళవించుటకు రూపొందించబడిన ఈ శిక్షణావిధానము నవలంబించుటకు అభిలషించు అసంఖ్యాకులగు మానవ వర్గాలకు గురువర్యుల సందేశాన్ని సమర్థవంతంగా అందజేయుటకు విలువైన సాధనంగా ఉపయోగపడగలదని మేము దృఢంగా ఆశిస్తున్నాము.

లఖింపూర్-ఖేరి, యు.పి. **యస్.పి. శ్రీవాత్సవ**

తేది : 28-1-1974 యం.ఎ. పి.హెచ్.డి.,

# పరిచయము

మా "సహజమార్గ" పత్రికలో ప్రచురించుటకు నేను వ్యాసాలను పంపుచుంటిని. నా శ్రేయోభిలాషులలో కొందరు నా వ్యాసము లన్నింటిని సరిచూసి ఒక పుస్తకరూపంలో ప్రచురించమని నాకు సూచించిరి. మరికొందరు సహచరులు సహజమార్గ సిద్ధాంత మును, సాధనను సా సొంతరీతిలో వివరిస్తూ ఒక గ్రంథాన్ని రచించదగునని తమ తీవ్ర అభిలాషను వ్యక్తపరిచిరి. నేను శ్రీరామచంద్రమిషనులో ప్రశిక్షకుడనైయున్నందున ఇందుగురించి నేను తరచుగ వ్రాసిన వ్యాసాలనే ఒకచోట చేర్చి తిరిగి ప్రచురించుట కంటె, విషయాన్ని సంక్షిప్తపంథాలో వివరించడమే వాంఛనీయమని భావించితిని. దాని ఫలితమే ఈ ప్రయత్నము.

సాక్షాత్తు 'శ్రీరామచంద్రమిషను' అధ్యక్షుని నుండియు మరికొందరు ప్రశిక్షకుల నుండియు ఈ విషయముపై కొన్ని గ్రంథము లిదివరకే వెలువడినవి. ఇందుకు సంబంధించిన సాహిత్యము మెల్లమెల్లగా వృద్ధిచెందుచున్నది. సమర్థులగు ప్రశిక్షకులు దీనినింకనూ అభివృద్ధి చేయవలసిన అవసరమున్నది. కర్తవ్యపరమయిన ఈ హృదయ స్పందన కారణంగా నేనీ గ్రంథమును రచించుచున్నాను. ఈ ఔత్సాహిక కార్యమున ఇతర ప్రశిక్షకులు కూడ పాలుపంచుకొందురని ఆశ్వాసింతును.

నా సమర్థగురువర్యులు నావంటి అనర్హుని విషయమున అత్యంతశ్రద్ధ వహించి తానభిలషించిన రూపములోనికి నన్ను పరివర్తన చెందించుటకు తీవ్రముగ శ్రమించిరి. తత్ఫలితమగు నా ఆనందాన్ని ఇతరులతో పంచుకొను తీవ్ర కాంక్షతో నేనీకార్యమును చేపట్టియున్నాను. ఈ గ్రంథపఠనాంతరము నాతోటి మానవులు కొందరు తమనుకూడ దివ్యంగా మార్చుకొనుటకు అభిలషించినచో నేను మరింత అదృష్టవంతునిగా భావింతును.

సహజమార్గ రూపముననున్న తన బోధనలకు సంబంధించిన సిద్ధాంతాన్ని, పద్ధతులను విశదపరచుటకును, తద్వారా ఆయన ఆశయ కార్యమున సేవచేసి కొనుటకును చాలినంత స్థైర్యమును, సాహసాన్ని నాకొసగుటకొరకు గురుదేవులను నేను ప్రార్థింతును.

నా ఆధ్యాత్మిక సహోదరుడు డా॥ యస్.పి. శ్రీవాత్సవ, యమ్.ఎ. పి.హెచ్.డి., తత్వశాస్త్ర శాఖాధిపతి, వై.డి. కాలేజి, లఖింపూర్-ఖేరి (యు.పి.) గారు గ్రంథానికి పీఠికను వ్రాయుటకు దయతో సమ్మతించినందులకు నేను కృతజ్ఞుడను.

**- రాఘవేంద్రరావు**

# 1.మానవ పోరాటం

జీవితమనే దానికి వృద్ధి చెందే స్వభావం వుంది. వృద్ధి చెందాలంటే శ్రమ లేక ప్రయాసతో కూడుకొని వుంటుంది. వృద్ధి చెందడానికిపడే శ్రమ లేక ప్రయాస మానవునిలో మిగతవాటికంటే స్పష్టంగానూ, విశదంగానూ కన్పిస్తుంది. మనస్సులో శ్రమను గురించిన ఆలోచన తీవ్రతరమయినప్పుడు అదే బాధగనూ కష్టంగాను అనిపిస్తుంది. అందువల్ల వృద్ధి చెందడమనే భావన నుండి దృష్టి అనేక మార్లు మరుగున పడిపోయి చివరకు అతనికి శ్రమ మాత్రమే మిగుల్తుంది. వృద్ధి చెందాలనే తలంపుకు బదులు, కోర్కెలు చోటు కలుగ చేసుకొంటాయి.తన ఇంద్రియ విషయ వాంఛలను అప్పుడప్పుడు తాత్కాలికంగా తృప్తిపరచడానికి ఈ కోర్కెలు మానవుడిని దిగజారుస్తూ వుంటాయి ఇట్టి స్థితిలో మానవుడు పశువుకంటే ఏవిధంగాను మేలు, ఉన్నతుడు కాడు. తన ఉన్నత శక్తి సామర్థ్యాలను కేవలము పశుసంబంధమైన కోర్కెలను తీర్చుకోడానికి ఉపయోగించు కొంటాడు గనుక వాస్తవంలో పశువుకంటే మానవుడు ఇంకా అధముడనే చెప్పాలి.

జీవితానికి అవసరమైన ప్రాథమిక అవసరాలు అనగా ఆకలి, నిద్ర, నిర్భయత్వము, లైంగిక వాంఛలు మొదలయినవి సంతృప్తికరంగా తీర్చుకో గల్గినప్పుడు ఇక శ్రమ అనేది వుండకుండా అంతరించిపోతుందని కొంతమంది యొక్క అభిప్రాయంగా కనబడుతున్నది. ఇంకొక విధంగా చెప్పాలంటే, వారికి కేవలము వారి కడుపులను నింపుకోడము, బాగా నిద్రపోవడము, ఏవిధమైన భయము లేకుండా స్వేచ్ఛగా విహరించడము, లైంగికంగా సంతుష్టి జెందడము అనేవే ముఖ్యంగా కనబడవచ్చు. వారి శ్రమ అంతాగూడ ఈ విధమైన జీవితావసరాలు తీర్చుకోడమే. అయితే ఈ విషయం విపులంగా పరీక్షచేస్తే, కొంచెం (బాగా ఆలోచించగల పశువు అనగా) వివేకవంతుడైన మానవుడు, ఇవన్ని పశుసంబంధమైన విషయాలని, ఈ విషయాలను ఎంత అనుభవించి తృప్తిచెందినప్పటికి మానవునిలో ఇంకా వీటికొరకు పోరాటం జరుగుతూ వుంటుందనే నిర్ణయానికి వస్తాడు.

మానవునిలోని ఈ శ్రమను గురించిన నైజమును విపులంగా అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది. మానవునిలో పశులక్షణమనేది వుంది. అంతే గాకుండా అంతకంటే ఉన్నతమైన లక్షణం గూడ వుంది. మానవునికి ఈ విషయం గూడ తెలుసు. దీన్ని విచారణ ద్వారా అంటే ఆలోచన ద్వారా తెలుసుకొంటాడు.

కొన్నిమార్లు తనలోని పశులక్షణమనేది బలవత్తరమౌతుంది. మరికొన్నిమార్లు అందుకు భిన్నంగా వుండే లక్షణం బలవత్తరమౌతుంది. పశులక్షణం బలవత్తరమైనప్పుడు, తన శ్రమ లేక కృషి వల్ల కలుగు బాధలు, కష్టాలు చాల జడంగానూ, మోటుగానూ వుంటాయి. ఆ స్థితిలో అతని తీవ్రకృషియంతాగూడ, తనతోటి వారిని అణచి వారిని జయించాలని గాని లేక, యితరులతో పోటీపడి వారికంటే శక్తివంతుడు కావాలని లేక, తన శారీరక లైంగిక ఇచ్ఛలను తీర్చుకోవాలని గాని పట్టుదలతో వుంటాడు. ఇది ఎడతెగని సమస్యగావుంటూ, అందువల్ల ఎడతెగనికష్టాలకు, బాధలకు కారణమౌతూ వుండడము ప్రతివారికి అనుభవమే. అయితే పై తెల్పిన పశులక్షణానికి భిన్నంగా వుండే ఉన్నతమైన లక్షణాలు మానవునిలో పైచేయి వహించినప్పుడు, అతనికృషి ఉన్నతమైన పరిణామానికి చెందినదై, ఇంకొక విధమైన కష్టము, బాధగా రూపొందుతుంది. అది చాల సూక్ష్మమైన, మనోహరమైన తీయనైన బాధగా వుంటుంది. గనుక మానవుని శ్రమ అంతా గూడ భౌతికంగానో లేక ఆధ్యాత్మికంగానో వుంటుందని చెప్పవచ్చు. ఆధ్యాత్మికమైన శ్రమ పడడానికి ఇష్టపడువాడే గొప్పవాడు, ధన్యుడు.

ఆధ్యాత్మికమైన శ్రమ పడడానికి ఇష్టపడినంతమాత్రాన భౌతికమైన శ్రమ వుండదని అనడానికి వీలులేదు. ఆ విధంగా అనుకొనేటంత సులభంగాదు. గీత గీచి ఇది భౌతికము ఇది ఆధ్యాత్మికమని విడదీసి చెప్పడానికి వీలులేదు. వాస్తవంలో ఆధ్యాత్మికమనేది భౌతిక ఉనికినియావత్తు ఆవరించేవుంటుంది గనుక, మానవుడు తన దృష్టినంతా గూడ పరమాత్మనుండి వేరుగాకుండా దానిని గురించి అభివృద్ధి చేసుకొంటూ వుండాలి. దానినుండి ఎడతెగక సంబంధము పెంపుచేసుకోడానికి గమనిస్తూ వుండాలి. ఒకే సిద్ధాంతాన్ని రూఢి పర్చడానికి మిగిలిన సిద్ధాంతాలను ఆతురతకొద్ది మానవుడు ఖండించడానికి చేసిన ప్రయత్నాలు అనేకములున్నాయి. అయినప్పటికి ద్వంద్వ భావన కన్పిస్తూనే వుంది. గనుక ఏకత్వము, ద్వంద్వమనే వాటినుండి పారిపోవడానికి ప్రయత్నంచేసే కంటే, రెండింటిని ముఖాముఖిన ఎదుర్కోడమే శ్రేయస్కరం. గనుక మొట్టమొదట చేయవలసిన శ్రమ లేక కృషి అంతా గూడ భౌతిక వస్తు విషయాదులకున్నూ, చైతన్య మనబడు దానికిన్నీ వుండే సంబంధాన్ని సమన్వయపరచుకోవడము, రెండవది, భౌతిక కేంద్రస్థానాలను ఆధ్యాత్మికస్థానాలకు లోబడునట్లు చేయడము, మూడవది, ఆత్మను దాని అనంతమగు ఉనికి యందు ఉన్నతపరిధులను చేరుకొనునట్లు చేయడము.

అంతరంగికంగా మానవునికి తాను పూర్ణుడని, చిరంజీవినని, అనంతుడని, క్లుప్తంగా చెప్పాలంటే, తాను దైవజ్ఞుడని తెలుసు. అయితే దీనితో బాటు ఇంకొకవైపు బాధతో తన యొక్క అసంపూర్ణత, అసమర్థత, నిర్వీర్యత్వము అడుగడుగున గోచరిస్తూనే వుంటుంది. తానుపోగొట్టుకొన్న దైవ సామ్రాజ్యం కోసం పోరాటం సాగుతూనే వుంటుంది. బాహ్యంగా తనకు అగుపించే తన అసమర్థత, నిర్వీర్యత్వాన్నే తాను గట్టిగా పట్టుకొని వూసులాడుతున్నందున చివరకు దుఃఖాలపాలవుతున్నాడు. అందువల్ల తనలోని పూర్ణత్వము, దైవత్వమును గురించిన భావనలు బహు సూక్ష్మంగానూ, ఏదో అగోచరంగానూ అయిపోతున్నాయి. తనకు కలిగే సమస్త కోర్కెలను తీర్చుకోలేక పోవడము వల్ల, తాను అసమర్థుడు, నిర్వీర్యుడనే భావనలు ఏర్పడడానికి మూలకారణం. సామాన్యంగా తన కోర్కెలకు మూలకారణమేమని విచారించడు. తన కోర్కెలను ఈడేర్చుకోడానికి చేసే ప్రతి ప్రయత్నం లేక పడే శ్రమవల్ల తనలోని దైవీకము బాహ్యంగా రాకుండా ఒక ఆటంకము లేక అడ్డుగోడ నిర్మించుకొంటున్నాడు. గనుక తాను తన స్వస్థితిని పొందాలనే తలంపు తన హృదయంలో మనఃస్ఫూర్తిగా చొప్పిస్తే, మిగిలిన కోర్కెలన్ని మాసిపోయి తన శ్రమ అంతా భగవంతుని పొందడానికి సరియైన త్రోవలోకి త్రిప్పబడుతుంది.

దశాదేశనియమాలపై శ్రీ రాంచంద్రజి వ్యాఖ్యానిస్తూ, మానవుడు అంత ర్ముఖంగా పడేపాట్లను గురించిన్నీ, అందువల్ల జరిగే పరిణామాలను గురించిన్నీ నాల్గవ ఆదేశమునందు వివరించారు. వివిధ రకములైన శక్తులు బలవత్తర మయినప్పుడు మనిషిని ఇక్కడికి, అక్కడికి ఈడుస్తూవుంటే తాను చేసుకొన్న స్వవిషయాలకు తానే ఆహుతైపోతూ వుంటాడు. మానవుడు తన సహజస్థితిని మరచి తన సంకల్పాల అల్లికచే మాయబడి, వాటిని గురించిన భావనల వల్ల ఇంకా పటిష్ఠంగా బంధింపబడి చివరకు ఆ వలలో గట్టిగా చిక్కుకొని పోతున్నాడు. వాస్తవమనేది సంపూర్ణంగా మరుగునపడిపోయింది. అసలు 'మూలము' అనేది చివరకు పట్టుపురుగు వలె దాని గూటిలో అది బంధింపబడినట్లుగా అయిపోయింది.

గనుక ఆధ్యాత్మిక జీవితము వృద్ధి జెందడానికే చేయవలసినశ్రమయని హృదయానికి బాగా హత్తుకునేవిధంగా నచ్చ జెప్పాలి. వికాసము చెందే శ్రమ లేక పోరాటాన్నే కల్గించాలి. పరిణామౌన్నత్యమంటే, అంతకు ముందు అంటిపెట్టుకొని వుండి, వదలిపోవడానికి ఇష్టపడనట్టి స్వభావంతో గూడిన సంస్కారాలను

పోగొట్టుకోవడమే. మానవుని పరిణామోన్నతి అంటే ఇంకొక రూపాన్ని దాల్చడంగాకుండా, అంతర్ముఖంగా జరిగే పరిణామమే. వాస్తవంలో అది అంతర్గతంగా ఆత్మవికాసం జెందుటయే. తను మానవుడుగా పరిణామంచెందే వున్నాడు గనుక ఇక అంతిమ లక్ష్యాన్ని పొందడానికే తను పోరాడవలెననే దృఢనిశ్చయం కలుగజేసుకోవాలి. ఒక్కమారు ఇది జరిగిందంటే, మానవుని పోరాటము యొక్క తీరు మారినట్లే. దాన్ని నిజంలో పవిత్రమైన పోరాటమని పిలువవచ్చు. ప్రతి ప్రయత్నము గూడ అతన్ని ప్రకాశవంతమైన స్థితులకు చేర్చి, క్రమేణా భగవత్ సామ్రాజ్యమందు ప్రవేశింప జేస్తుంది. వాస్తవంలో అదే మనవుని స్వగృహము. అక్కడ గూడమానవుడు 'తాను' అను "అహం స్ఫూర్తి" వున్నంత వరకు పోరాటాన్ని సాగించాల్సిందే. నిజములో అది అంతములేని అనంతమైన మహాసముద్రము.

"సహజమార్గము ధైర్యవంతులకే గాని పిరికి వారికి కాదు"

- - "బాబూజి"

"పవిత్రమైన ఆలోచనలే ఉత్కృష్టమైన త్యాగము. సదాలోచనే నిరంతర సేవ"

- - "బాబూజి"

"దైవము దైవమే, నిర్వచించిన, అది దైవము కాదు"

- - "బాబూజి"

# 2. భౌతిక శాస్త్రాలు-పరిశోధన

భౌతిక ప్రపంచము వెనుక వుండే కారణాలను మానవుడు తెలుసుకోవాలని అన్వేషణ చేస్తున్నందున అనేక రకాల శాస్త్రాలు ఉత్పన్నమైనాయి. ఇవి ప్రకృతి శాస్త్రమని, వేదశాస్త్రమని, తత్వశాస్త్రమని అనేక తరగతులుగా విభజింపబడ్డాయి ప్రతి ఒక్కశాస్త్రము అపారంగా అభివృద్ధి చెందింది. ఏ ఒక్కరేగాని తన జీవిత కాలంలో ఏఒక్క శాస్త్రాన్ని గురించిన సంపూర్ణ ప్రావీణ్యత పొంద వీలు లేకుండావుంది.

ప్రకృతియందు ప్రత్యక్షంగా తెలియబడు విషయాలు, వాటి ననుసరించి ఏర్పరచబడ్డ సూత్రాలు, విచారణ మొదలయినవే ప్రకృతికి సంబందించిన శాస్త్రాలకు ఆధారంగా వుంటున్నాయి. ఈ సిద్ధాంతాలే జరుగబోవు విషయాలను గురించి చెప్పగల్గి నప్పుడు, ప్రకృతి నియమాలకు సంబంధించినట్టి వివరణలుగా రూపొందుతున్నాయి. ప్రత్యక్షంగా తెలియబడు విషయాలనేవి కాలానుగుణంగా మానవ చరిత్రలో మార్పులు చెందుతూ పాతవాటి స్థానే క్రొత్తవి ఉత్పన్న మవుతున్నాయి.

మానవుని మేధాశక్తి ప్రావీణ్యత వల్ల ఈ శాస్త్రాలు నిర్మింపబడ్డాయి. భౌతికావసరాలకు ఈ శాస్త్రాలు ఏవిధంగా వుపయోగపెట్టుకోవాలనే అంశంపై కృషి చేసి అభివృద్ధి చేసుకొనే అవసరం కూడ ఏర్పడింది. అందు వలన మరల వీటిని రెండు తరగతులుగా విభజించడం జరిగింది. ఒకటి శుద్ధశాస్త్రము(జ్ఞానకాండ), రెండవది ప్రయోగశాస్త్రము(విజ్ఞానకాండ). ఈ ఆధునిక కాలంలో ఈ రెండు శాస్త్రాలకు మధ్యన వుండే బేధము తెలియజేయడం దాదాపు అసంభవమే. ఎందుచేతనంటే ఈ 'శాస్త్ర' మనే దానికి వుండే వ్యవహార స్వభావమే అటువంటిది. భౌతిక శాస్త్రాలుగాని లేక, మరే శాస్త్రమేగాని దాని యొక్క అభివృద్ధి అనేది దాని వల్ల పొందే వుపయోగం మీద ఆధారపడి వుంటుంది. భౌతిక శాస్త్రాలనేవి బహుత్వరితగతిన అభివృద్ధి జెందడము వల్ల అవి మానవుడిని మరింత ప్రాపంచికంగా మార్చడములో దోహదం కలుగజేస్తున్నాయి. దురదృష్టవశాత్తు అసలు శాస్త్రాలకన్నా మానవుని ప్రాపంచిక దృష్టి బహు త్వరగా వృద్ధి పొందుతూ వున్నందున, పై తెల్పిన రెండు రకాల శాస్త్రాలను అభివృద్ధి చేయాలనే ప్రయాస పటిష్ట(దిట్ట)మై పోతున్నది.

ఇంతేగాక, ఊహానిర్మిత సిద్ధాంతాలవల్ల ఇంతకు ముందే కలవరపడ్డ మానవుని మనస్సును ఇంకా గందరగోళం పెడుతున్నాయి. మూఢనమ్మకాలను ఖండించి, శాస్త్రాను గుణంగా విచారించే దృక్పథం ఏర్పడినప్పటికి, ఈ శాస్త్రామనే పేరు క్రింద అపాయకరమగు మరికొన్ని ఇతర మూఢనమ్మకాలు స్థిరపడ్డాయి. మారుపేర్లతో కపటమైన శాస్త్రాలు గూడ యోగ్యమైన శాస్త్రాలని పిలువబడుతూ, చెల్లుబడిఅవుతూ, వీధులవెంట విహారం జేస్తున్నాయి. ఈ విధంగా ఇంతకు ముందు జరిగింది. ఇప్పుడుగూడా జరుగుతూనే వుంది. సరియైన శిక్షణ ద్వారా శాస్త్రాలను అభ్యసించి ప్రావీణ్యం సంపాదించే పద్ధతి గాలికికొట్టు కొని పోయింది. శాస్త్రీయమనేది అశాస్త్రీయమైన విషయాలనే ఆధారం జేసుకొంటూ వున్నది.

శాస్త్రాలకు వుండే పరిమితులను గురించి చాల మంది శాస్త్ర ప్రావీణులు, వేదాంతులు, వారి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి విషయంలోను శాస్త్రీయమైన పద్ధతిలో ఆలోచించినప్పుడు, వారి ఆలోచన ఒక స్థితిలో ఇకముందుకు సాగకుండా నిలబడిపోతుంది. ఆ స్థితిలో తర్కమీమాంసాదులు ఏవిధంగాను వుపయోగబడవు. అప్పుడు కొంత జ్ఞానోదయం కొరకు ప్రార్థన చేయవలసిందే. శాస్త్రాన్ని పరిశోధించే వాడు ఒక దాన్ని అనుసరించుకొని మరొక దానికి గల కారణాన్ని పరిశీలించడమేగాక, మూలకారణాన్ని గూడ కన్గొనడానికి ప్రయత్నంచేస్తాడు. అయితే మూలకారణమనేది బాహ్యంగా అగుపడే స్థూలవిషయాలేగాక, దాని కతీతంగా మరొకటి వుందని ప్రతివారికి వారి అంతర్ జ్ఞానం బోధ జేస్తుంది. యంత్ర పరికర సహాయంతో కన్గొనలేని ఈ అంశం లోనికి ప్రకృతి శాస్త్రాలు జొరబడడానికి వెనుకంజ వేస్తున్నాయి. కపట శాస్త్రవేత్తలు మాత్రం అశాస్త్రీయంగా ఈ విషయాన్ని త్రోసిపుచ్చుతూ, ఈ స్థూలంగా అగుపడే వస్తు విషయాలకుమించి ఏమిలేదని తీర్మానిస్తున్నారు. అంతేగాక, స్థూలంగా వుండే వస్తు విషయాలకు అతీతంగా వుండే చైతన్యము యొక్క ప్రభావము, సూర్య తేజస్సువలె ప్రకాశిస్తూ వున్నప్పటికి, కపట శాస్త్రకారులు ఈ విషయాన్ని అంగీకరించడం లేదు. ఈ నాటి శాస్త్రమనేది అడ్డతలంగా అభివృద్ధి జెందడానికి అవకాశంవుంది. అదిగూడ, ఆ శాస్త్రవేత్త అయినవాడు కొంచెం సూక్ష్మ సంబంధమైన వాటి యందు గమనించగల్గితేనేగాని అంతమాత్రం అభివృద్ధికి గూడ వీలులేని స్థితి ఏర్పడింది. అనిశ్చితత్వముయొక్క సిద్ధాంతాలు, సంఖ్యా సంభావ్యసూత్రాలు, స్థూల విషయాలకు సంబందించిన అభిప్రాయాలు

మొదలయినవే జీవితానికి మూలప్రాణమై, శాస్త్రాలను సర్వతోముఖంగా ఉన్నతస్థాయి వరకు అభివృద్ధి కానీయ కుండా, చాలమటుకు ఆటంకపరుస్తున్నాయి. అనేక రకాలుగా శక్తిని ఉత్పత్తి జేయడానికి తగిన పద్ధతులను కనిపెట్టి, బహుశః విధ్వంసాత్మకమైన వాటికి ఆశక్తులను వుపయోగించడము వల్లనూ, ప్రాపంచిక వస్తు విషయాభిపృద్ధి యనునది, ఈ శక్తులనుపయోగించుటవల్ల జరుగుచున్నదని నామకార్థంగా అనిపించడము వల్లనూ, ఈ శాస్త్రపరిశోధన స్థూలవిషయాలను దాటి, అంతకంటే అతీతంగా వుండే విషయాలను గురించి అభివృద్ధి జరుగకుండా స్థంభించి పోతున్నది.

శాస్త్రానుసారంగా విచారణ చేయాలనే సదభిప్రాయాన్ని ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలనుండి తొలగించాలి. అప్పుడే అది మానవునిలోని ఆధ్యాత్మికతను ఉన్నత పరిధులకు తీసుకొని పోయి మేలు చేకూర్చగలదు. శాస్త్రము, మతము అను ఈ రెండిటికి మధ్య తగాదాలు ఏర్పడే కాలం దాటిపోయింది కాని ప్రకృతి శాస్త్రంలో దేవుడున్నాడని వాదించే స్వభావము, మనుష్యులకు దేవుడు తెలియబడడని వాదించే స్వభావము ఇంకావుంది. వుండవచ్చుగాక, కాని శాస్త్రమనే దాన్ని అంతిమ సత్యాన్ని చేబట్టడానికి ప్రయత్నం చేయమనండి - ఏ శాస్త్రమేగాని అంతిమ సత్యమనేది లేదని ప్రతిఘటించి ముందుకు సాగి, ఆసాంతం పోలేదు. కొన్ని శాస్త్రాలు అంతిమ సత్యమనేదాన్ని సాధించవీలు లేనట్టి ఒక ఆదర్శమేనని అంటూ, వారికి తోచిన మూఢనమ్మకాలను ప్రచారం చేసాయి.

ఆధునిక శాస్త్రానికి ఆధారం అనుభవరీత్యాగమనించినట్టి విషయాలు, మరియు విచారణ అని ఇంతకుముందు చెప్పబడింది. అయితే వాస్తవాన్ని తెలుసుకోవాలంటే, నిష్పాక్షికంగానూ, బేధబుద్ధిరహితంగానూ, దురభిమాన రహితంగానూ గమనించి విచారించాలనేది నొక్కి వక్కాణించారు. ఈ విధంగా నొక్కి వక్కాణించడానికికారణం వున్నది. మతాధికారము, మతరీత్యా అహేతుకమైన పిడివాదము, అను ఈ రెండింటి ప్రాబల్యంవల్ల పై విచారణ సాధ్యపడదు. అది తిరుగుబాటు చేసినట్లవుతుంది గనుక ఆ విధంగా నొక్కి చెప్పాల్సివచ్చింది. అయితే దురదృష్టవశాత్తు ఈ శాస్త్రాలే అవిధమైన పిడివాదము, శాస్త్రాధికారముఅనుసరించాయి. అందువల్లనే, నిష్పక్షపాతము, దురాభిమానము బేధబుద్ధి మొదలయినవన్ని వుండగూడదనే నియామాన్ని త్రోసిపుచ్చాయి. ఈ రంగంలో గూడ, దేవుళ్ళగా పూజింపబడ్డ డార్విన్,

ఐన్‌స్టీన్ మొదలగు శాస్త్రప్రావీణులు, క్రొత్త సిద్ధాంతాలను తెలియజేయప్రయత్నించినప్పుడు, వారిని తూలనాడి చివరకు విడువక హింసించడం గూడా జరిగింది. దయాస్వభావము కల్గిన వారి అధీనతలో పాత పద్ధతులను తూచా తప్పకుండా అనుసరించడము శ్రేయస్కరమని అనుకోడము, ఇటు మతాల్లోనూ, అటు శాస్త్రాల్లోను కన్పిస్తున్నది: ఇప్పుడు పురాతన దేవుళ్ళస్థానే క్రొత్త దేవుళ్ళు నిలదొక్కు కొంటున్నారు. ఏ శాస్త్రకారుడే గాని పురాతన దేవుళ్ళను గురించి మాట్లాడే ధైర్యం లేదు. పాత దేవుళ్ళు ఇప్పుడు మెప్పుపొందాలంటే క్రొత్త వేషాలు వేసుకొని క్రొత్త పేర్లు గూడా పెట్టుకోవాలి. అస్పష్టంగానూ, అపభ్రంశంగానూ, ఆధునిక శాస్త్రపదాలను ధారాళంగా వాడుతూ యోగవిద్యను కడుపు కూటికి లాభసాటిగా అమ్ముకొంటూ వుండే కొంతమంది కపట శాస్త్రవేత్తలను ఈ రచయిత స్వయంగా గమనించాడు. కొంత పరీక్షగా గమనిస్తే వారువాడే ప్రతిమాట శాస్త్ర విరుద్ధంగా వుండి మరొక విధంగా అర్థమిచ్చేట్లుగానే వాడుతున్నారుగాని, అసలు వుండాల్సిన విధంగా వుండడము లేదు.

ఈ విధంగా డొంక తిరుగుడు పెడుతూ శాస్త్రాన్ని పతనం చేయడమనేది ఎట్టిపరిస్థితుల్లోను సహించగూడదు. ఈ విధంగా పదభ్రష్టులైన దేవుళ్ళకు లొంగిసేవ చేసేకంటే, దేవుడు లేడని, నాస్తికుడుగా వుండడము ఎంతోమేలు. సత్యాన్ని కన్గొనడానికి అవసరమైన క్రమ శిక్షణలను అమలుపరచడానికి ఇప్పటి శాస్త్రకారులు ధైర్యసాహసాలతో కూడిన ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

శాస్త్రమనేది విచారణ ద్వారా సత్యాన్ని గుర్తెరగడానికిగాని, వినోదాలకు, శత్రుసంహారానికి కాదనేది ప్రజలకు బోధించాలి. శాస్త్ర సిద్ధాంతాలనేవి మానవుడికి గొప్పదనాన్నిచ్చేవిగా వుండాలేగాని, మానవుని యొక్క దివ్య ప్రకృతిపట్ల ప్రతికూల అభిప్రాయాలను కలుగజేయునట్టివిగా వుండకూడదు. అట్టి ప్రతికూల అభిప్రాయాలను వదలివేయాలి.

**"మాంసాహారము ఆధ్యాత్మికోన్నతికి తీవ్రమైన అవరోధము, గనుక మనసంస్థలో యిది నిషిద్ధము". నా గురుదేవుల ఆదేశం కూడా యిదే".**

-- బాబూజి

# 3. తత్వశాస్త్రాలు

మానవుడు, భగవంతుడు, సృష్టి మొదలైన వాటిని గురించి ఏర్పడిన గొప్ప అభిప్రాయాలను తెలపడానికే తత్వ శాస్త్రాలు మనకు ఏర్పడినవి. జ్ఞానమందు మనకు వుండే ప్రేమ అభిలాషయే ఇందుకు కారణం. అయితే తత్వ శాస్త్రానికి - ముఖ్యంగా పాశ్చాత్య తత్వశాస్త్రానికి-'సందేహము' 'తర్కము' లను రెండూ గూడా రెండు ఆయుధాలుగా వున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ రెండు ఆయుధాల వల్ల ఏర్పడే కష్టమేమంటే, అవి తమకే హానికరంగా వుంటున్నాయి. భారత దేశంలో 'దర్శనము' లని పిలువబడు వేదాంతాలు దాదాపు ఒకే మోస్తరుగా అయి స్థంభించిపోయాయి. అయినప్పటికి, మన వేదాంతము అంతిమ సత్యాన్ని స్వతఃసిద్ధంగా పొందడమనే విషయాన్నే లక్ష్యంగా కల్గి, అనుభవసిద్ధమైన జీవితానికే ప్రాధాన్యత ఇచ్చినందున క్రొత్త విషయాలు బహిర్గతంకావడానికిన్నీ, అభివృద్ధి జెందడానికిన్నీ ఎంతైనా ఆస్పదం కల్గివుంది.

గమనించి తెలుసుకొన్న వాస్తవిక విషయాలనుగూడ, అహేతుకమైన, మూర్ఖ సిద్ధాంతాలకు అనుగుణంగా వుండేట్లు ఊహించడమనేది అన్ని తత్వశాస్త్రాలలోను సర్వసాధారణమైన లక్షణంగా వుంది. కొన్ని వేదాంతాలలో చపలచిత్తంతో తత్వ విచార సంబంధమైన మూలసూత్రాలను ఏర్పఱచినందున, కపట శాస్త్రాలను సృష్టించడానికి ఆస్పదం గల్గి, బూటకపు వ్యక్తులకూ, ప్రజ్ఞలు పలికేవారికి, అందులో నిరాటంకంగా ప్రవేశించడానికి ద్వారాలు తెఱువబడి వున్నాయి. ఈ 'ఊహించడము' అనేదానికంటే 'ప్రత్యక్షానుభవం' పొందడము, తద్వారా శిష్టాచారంగా వుండడమనే విషయాలకు ప్రాధాన్యత ఇచ్చి వుంటే, ఈ ప్రపంచాన్ని తత్వ పరిశీలకులే పరిపాలిస్తూ వుండే వారని 'ప్లాటో' అనునతను కన్న కలల్ని సఫలీకృతంజేసి యుండేవారు.

ఈ విశ్వాన్ని యావత్తు పరిపాలించే సూత్రాలను, సిద్ధాంతాలను కన్గొనడానికి భౌతిక శాస్త్రవేత్త ప్రయత్నం చేస్తే, తత్వవేత్త అయినవాడు, సృష్టికార్యము యొక్క ప్రధానలక్ష్యాన్నేచేబట్టడానికి ప్రయత్నంచేస్తాడు. గనుక శాస్త్రపరిశీలన వల్ల కన్గొనబడిన విషయాలనేవి, తత్వవేత్తలు వూహించడానికి సాధన వస్తువు లుగా వుపకరిస్తాయి. ఈ శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు, యిరువురు ఒకరినొకరు "తెలియనివారు" అని

వాగ్వివాదాలు ఎన్నో విధాలుగా చేసుకొన్నారు. అయినప్పటికి సర్వము తెలుసు కోవాలని, ఉన్నతంగా అధిగమించాలని, మానవకృషి జరుగుతూనే వుంది.

శాశ్వతంగా వుండే సమస్యల పరిష్కారానికే యధార్థమైన తత్వశాస్త్రాలు ప్రయత్నంచేస్తాయి. విశదీకరించడానికి, సమన్వయపరచడానికి అనుసరించే పద్ధతులు పలురకాలుగా రూపొందుతూ వుంటాయి. గొప్పవారిచే చెప్పబడిన ప్రామాణికమైన వివరణలు, మేధా సంపన్నులచే తర్కరీత్యా, ఊహరీత్యా నిశ్చయింపబడినట్టి విషయాలు, నిష్కలంకమైన మహాఋషులచే నిష్పక్షంగా గమనింపబడినట్టి విషయాలే, ఒకదాని తర్వాత మరొకటిగా గాని, లేక ఏకకాల మందేగాని ప్రాముఖ్యం వహిస్తున్నాయి. తత్వశాస్త్రాలు ఒక పాండిత్య వైఖరిలో అభివృద్ధి చెందినందున, వాటిని సామాన్య ప్రజలు చదివి, అవగాహన చేసుకోడానికి విపరీతమైన ప్రతిబంధకంగా ఏర్పడింది. తత్ఫలితంగా ప్రతివ్యక్తి లేక కొద్ది మంది వ్యక్తులు, వారివారి ఆధ్యాత్మిక జిజ్ఞాసననుసరించి, నవీనతత్వ సిద్ధాంతాలను ఏర్పఱచుకొన్నారు. మనదేశంలో ప్రాపంచిక సంబంధమైన చారవాక మనే పేరుతో పిలువబడే తత్వ శాస్త్రం సామాన్య ప్రజలకు (లోకాయత) వేదాంతమై కూర్చొంది. దాన్ని బట్టి, తృణీకరింపతగ్గదని భావించినప్పటికి, దాన్ని గూడ చదివి, విమర్శింపతగ్గ విషయమేనని తీవ్రంగా ఆలోచిస్తున్నారు. వాస్తవంలో భారత వేదాంతాలన్నింటికి పూర్వాపరంగా వుండేతావు నుండి అది ప్రారంభ మవుతుంది. అయినప్పటికి, అది ఇంకా ఏదో ఒక రూపంలో అంటిపెట్టుకొని వుంది.

మానవునికి వుండే 'సమస్య' మరియు, ప్రాపంచికంగా ఆతని స్థితిగతులు అను ఈ రెండు పెద్ద అంశములు ఇంతవరకు అపరిష్కృతంగానే వున్నాయి. అసంఖ్యాకంగా వుండే జీవులు, ఋఱదగుంటవలె నుండు ఈ ప్రాపంచిక వస్తు విషయవాంఛలనుండి విముక్తి పొందడానికి నిరంతర తీవ్రకృషి చేస్తూ, అందుకు స్థూల రూపంలో ఆటంకంగా వుండే పొరలను ఒక్కొక్క దానిని దాట గల్గుగతున్నప్పటికి, వాటిస్థానే సూక్ష్మంగానూ, సున్నితంగానూ వుండేవి, ఆటంకాలుగా ఏర్పడు తున్నాయని అడుగడుగునా తెలుసుకొంటూ, అంతిమమైన ఆటంకం లేక బంధము-అది-ఎట్టిదైననూ దాన్ని తొలగించుకోగలమనే ఆశతో కృషి జరుపుతూనే వున్నారను విషయం మనకు చెప్పబడుతూవుంది. వారికృషి సాహసంలో, ఈ ప్రాపంచిక వస్తు విషయవాంఛలనుండి విముక్తి పొంది తమకు గూడ అట్టి బంధవిముక్తికి సహాయము

చేయకల్గినట్టి సమర్థవంతమైన గొప్ప మహనీయుని ఏర్పఱచుకొన్నారు. బహుశః ఇదంతాగూడ, ఒక దేవుడనేవాడు, వాని వినోదంకోసం తనకు తానే కల్పించు కొన్న భ్రమ లేక భ్రాంతియే కావచ్చు. అవిధంగాకాక పోతే స్థూలమైన అణువులు, మరియు అసంఖ్యాకంగా, అనంతంగా వుండే ప్రాపంచిక వస్తు సముదాయాలు, ఆత్మలు, దేవుళ్ళుఅను వాటికి వుండే వరుస బేధములు, ఒక్కొక్క వరుసలో శాశ్వతమైన వ్యత్యాసాలు, ఆ వరుసకు చెందిన వాటిల్లో గూడ ఒకదానికి మరొక దానికి వుండే విపరీతమైన విభిన్నత్వములు -మనం చూచినప్పుడు, ఫలాని దాని రూపం ఫలానా విధంగా వుందని ఏవిధంగా తెలుసు? పవిత్రగ్రంథాలలో యివన్ని వ్రాయబడివున్నాయని అంటే, ఇక భగవంతుడే మనకు సహాయము చేయుగాక!

దుర్మార్గము, సన్మార్గము, మంచి చెడ్డ, సుఖము, దుఃఖము, అనిశ్చయము, మొదలగు ద్వంద్వములను గుఱించిన సమస్య అనేది మరొకసమస్య. ఎంతగానో వీటిని గురించి తత్వ నిర్ణయంచేసినప్పటికి, ఈ సమస్య పరిష్కరింపబడినట్లు కనబడటం లేదు. వ్యక్తి, సమాజము అను ఈ రెంటికి మధ్య వుండే తారతమ్యాల వల్ల, సాంఘిక, రాజకీయ తత్వశాస్త్రాలనేవి సృష్టింపబడ్డాయి. మానవ దృక్పథం మీద, మతాల ప్రభావం గూడ ముఖ్య పాత్ర వహించింది. అనేకమార్లు, రాజకీయ సంబంధంగా బలవంతులైన వారికి, వారి అవసరాలకు అనుగుణంగా ఈ శాస్త్రాలనేవి వుపయోగపడాల్సివచ్చేవి. శాంతి స్థాపనకు యుద్ధాలు చేయవలసివచ్చింది. ప్రజలలో అసంతృప్తిని తొలగించడానికి అసాధారణ ప్రజ్ఞకల్గిన వ్యక్తులను తయారు చేయవలసి వచ్చింది. ప్రజల ఇచ్ఛ, మోహముల ననుసరించి భగవంతుడనే వాడిని రూపొందించాల్సి వచ్చింది. చనిపోయిన తర్వాత స్వర్గంలో సుఖాలను అను భవించడానికి యజ్ఞయాగాది క్రతువులు మొదలైనవాటిని ప్రవేశపెట్టారు. సత్యాన్ని గుఱించిన మానసిక శాస్త్రాలు, వేదాంత శాస్త్రాలు, ఊహచే నిర్మింపబడ్డ సిద్ధాంతాలు మొదలయిన వన్ని తత్వశాస్త్రానికి ముఖ్యమైన అంశాలుగా వున్నాయి. మానవుని శరీరానికి, జంతువుల శరీరానికి సంబంధించిన విషయాలు ఒకేరీతిగా వుండడంవల్ల, ఏదైనా ఒక పరిశోధన జంతువు మీద చేసినప్పుడు కల్గిన ఫలితాన్నే, మానవుని మీద గూడ కలుగజేయవచ్చని జీవశాస్త్రవేత్త అంటాడు. అదేవిధంగా మానవుడు, కుక్క, వీరిద్దరి ప్రవర్తనలలో కూడ పెద్ద తేడాలు లేవని మనోశాస్త్రవేత్త గట్టిగా చెప్తాడు. కొన్ని కారణాల వల్ల కొంతమంది మానసిక శాస్త్రవేత్తలు 'తాను' లేక 'వ్యక్తిగత' మనేదాన్ని

గూడ వారి శాస్త్రాలలో సాంకేతికపదంగా కలుపుకొన్నారు. కాని, వారి సిద్ధాంతాలు చాల భాగం ఈ 'తాను' అనే దాన్ని గుఱించిన ఎఱుక, లేక తెలివి అనేది, భౌతిక వస్తు కణజాలము ఒక పద్ధతిలో మిళితమైనప్పుడు ఉద్భవించే స్వభావమని వారు ఊహించి, సిద్ధాంతంగా చేసారు గనుక 'ఆత్మ'అనేది ఇప్పటి మానశిక శాస్త్రకారులు నిషేధించారు. భౌతిక విజ్ఞానశాస్త్రమనేది తత్వశాస్త్రానికి కుడి భుజంగా వుంటున్నది. అందువల్ల, ప్రాణమంటే వస్తు సంబంధమైన అణువులు లేక కణముల యొక్క మిశ్రమమేననిన్నీ, జ్ఞానమనేది వుద్భవించే ఒక స్వభావామనిన్నీ మొదలైనవాటిని భౌతిక విజ్ఞాన శాస్త్రం చెప్తుంది కాని, తత్వశాస్త్రం ఈ విషయాలు ఒప్పుకోదు. విజ్ఞాన శాస్త్రానికి అందుప్రవేశం నిషేధించారు కాబట్టి, చోద్యంగా వుండే ఈ విధమైన ఊహలు తత్వ శాస్త్రంలో విచ్చలవిడిగా పని చేయవచ్చు.

అంతిమ సత్యాన్ని కన్గొనడానికి ఏర్పడిన జిజ్ఞాసయే అనేక తత్వశాస్త్రాలు పలురకాలుగా అవతరించాయి. కొంతమంది ఈ సత్యాన్ని గుఱించిన వ్యాఖ్యానాలలోనే తగుల్కొని వుంటే, మరికొందరు వారికి ప్రీతికరమైన ఊహలతో గందరగోళపడుతున్నారు. ఇట్టి కృషి, శ్రమ కొన్ని మార్లు ఏస్థితి వరకు పోయిందటే, వివరించలేనట్టి మాటను మరొక వివరించలేనట్టి మాటలతో వివరించడానికి మొదలు పెట్టారు. సత్యమే భగవంతుడు, లేక భగవంతుడే సత్యము, సత్యమంటే శాశ్వతంగా వుండేది, లేక శాశ్వతంగా వుండేదే భగవంతుడు, సత్యమంటే సౌందర్యం, లేక సౌందర్యమంటేనే భగవంతుడు అని ఈ విధంగా ఎన్నైనా చెప్పుకోండి. సిద్ధాంతరీత్యా, సత్యమును గురించిన ఏకత్వము, భిన్నత్వము, పలువిధాలయిన తరగతులు లేక స్థితులు, ఇక వీటి యొక్క అనుభవాలు, ఈ అనుభవాలను గురించిన వ్యాఖ్యానాలు మొదలయిన తర్క జ్ఞాన మీమాంసాదులన్నీ చాలసమస్యలు తెచ్చిపెట్టాయి. తత్వచింతనలో గొప్ప అభివృద్ధి పొంది నప్పటికి, ఈ వేదాంతాలు మానవులలో జ్ఞానాభివృద్ధికి గాను నిస్సహాయులుగా వున్నాయని తెలుసుకొంటున్నారు. జ్ఞానమనేదే శక్తి అని వారు చెబుతున్నప్పటికి ఇతర మానవుల మాట అటుంచి, వారికి వారే సహాయంచేసుకోడానికి శక్తి హీనులుగా వుంటున్నట్లు భావిస్తూనే వున్నారు. వేదాంతుల కృషి ఇంకా జరుగుతూనే వుంది.

ఈ తత్వవిషయాలలో ఇంకొక లోటు ఏమంటే, చెప్పే సూక్తులకు, ఆచరించే విధానానికి మధ్య వున్నట్టి వత్యాసము, వేదాంతాన్ని గుఱించిన తెలివి ౼ధన,

కోరికలే మూలముగా కల్గిన జీవిత విధానాలు, భావనలు, తీవ్రమైన విచిత్ర స్థితికి చేరుకొన్నాయి. వేదాంతపరమైన సూత్రాలు లేక నియమాలు నిత్యజీవితానికి అసంబద్ధమైనవి అనే వరకు ఎదిగిపోయాయి. అసలు ఈ వేదాంతసూక్తులు లేక నియమాలు, ఆచరణలో పెట్టడమనేది అనవసరమంటారు. బోధించడానికి సూక్తులనిన్నీ, జీవితంలో అనుభవించడానికే మంచి వస్తువులని చెప్పు పూర్వపు హైందవుల మాటలు ఈ నాటికి వేదాంతాలు ఆమోదిస్తూనేవున్నాయి. హృదయంలో వుత్పన్నమయ్యే కోర్కెలు, మనస్సులో వుండే ఆదర్శాలు ఇంతకు ముందు వున్నట్లు పటిష్ఠంగానే వుంటున్నాయి. ఒకవేళ ఈ తత్వాలు వేదాంతభావనలో సమన్వయం చేసుకోదలిస్తే, ఒకటి చెప్పవచ్చు. వ్యక్తి గతంగా వాని కోర్కెలననుసరించి ఏర్పడే అవసరాలు వేదాంతమనే వేషంతో కనబడుతున్నాయేగాని వేరేమి లేదు.

యోగులు చెప్పేవిషయాలు, అభిప్రాయాలు తత్వశాస్త్రము వెంటనే ఆమోదిస్తుంది. అయినప్పటికి, తెలియదనే భయంకొద్దో, లేక దానికి వుండే ఔన్నత్య భావనవల్లనో, యోగపద్ధతినే అనుమానిస్తుంది, ఈ తత్వశాస్త్రం. అయితే 'అనుమానం' 'తర్కం' అనే రెండు ఆయుధాలతో దానికి వుండే అనుమానాన్ని తానే సమర్థించుకొంటుంది. దీన్ని యోగి అయినవాడు మెచ్చుకోడానికి లక్ష్యపెట్టడు. ఇక్కడ గూడ, ఈ యోగ శాస్త్రానికి సంబంధించిన తత్వసిద్ధాంతాలను స్థిరపరచడానికి ప్రయత్నం చేయబడింది. అయితే అది అనుసరించిన పద్ధతివల్ల అట్టి శాస్త్రాలు గొప్ప తత్వవేత్తలవద్దగాని, లేక గొప్ప యోగులవద్దగాని ఏవిదమైన మర్యాదను పొందలేక వున్నాయి. తత్వశాస్త్రకారులు హృదయ పరివర్తన చెందడానికి నిరాకరిస్తే, యోగులు మనోపరివర్తన చెందడానికి నిరాకరిస్తున్నారు.

"జడత్వంతో కూడిన పూజావిధానము అహంకారానికి దారి తీస్తుంది".

-- బాబూజి

# 4. మతములు

మతముల యొక్క పెనుగులాట గురించి విమర్శించడానికి అవసరం లేకుండానే బాగా గోచరిస్తున్నది. ప్రపంచంలో ఏమతమేగాని, దాని పుట్టు పూర్వోత్తరాన్ని గుఱించి విచారిస్తే అది ఒక గొప్ప తత్వవేత్త మరియు యోగి అయిన వ్యక్తి, ప్రజా శ్రేయస్సును కోరినవాడై అందుకు సంబందించినట్టిదై వున్నదని తెలుస్తుంది. అట్టి గొప్పవారు చెప్పిన వాక్యాలను వ్రాయబడి, విభజింపబడి, మూర్ఖసిద్ధాంతాలుగా చేయబడి, చట్టబద్ధంగావింపబడినప్పుడు, ఈ మతాలకు జడత్వమనేది పుంఖానుపుంఖాలుగా పేరుకుపోయింది. అలాంటి సమయాల్లో స్వార్థపరులు ఈ మతమనే కళ్ళెమును వారిచేతుల్లోకి తీసుకొనే ఆస్పదం కల్గింది.

దైవము, ఆరాధన, నీతి, విశ్వాసము మొదలయినవాటిని గుఱించిన భావనలు సర్వసాధారణంగా అన్ని మతాలలో ఒకే రీతిగానే వుంటాయి. అయితే కొన్ని మూర్ఖ దురభిమానాలు వృద్ధిచెందినందున ఒక మతానికి మరొక మతానికి ఎంతో బేధంవుంది. వాస్తవంలో అట్టి దురభిమానాలు ఎంతగా ఈ మతాలను పాడు చేసినవనగా,. అసలు, భగవంతుడు, ఆరాధన మొదలయిన భావాలను మతమనే రంగులతో అలంకరించేవరకు తెచ్చారు. ఒక మతము యొక్క విశిష్ఠమైన, విచిత్రమైన దురభిమానాన్ని బట్టే ఆ మతాన్ని గుర్తింపు చేసే స్థితిలో వుంది. దురాభిమానాన్ని కాపాడు కోవడంలోనే ఈనాడు సాధారణంగా కృషి అంతా జరుగుతున్నదే గాని, ఆ ఆటంకాలు, చిక్కులు తొలగించుకోవడానికి ప్రయత్నం చేయడము లేదు.

ఈ భౌతిక ప్రపంచమే కాక దీనికి అతీతంగా వుండే దాన్ని పొందవలెననే తీవ్రతలంపు మనస్సు నందు గాఢంగా నాటుకొనేట్లు చేయడమే మతము యొక్క వుపయోగము. ఆ విధంగా నాటుకొన్నతర్వాత మతము యొక్క వుపయోగము ఇక అయిపోయినట్లే. తర్వాత వ్యక్తిగతంగా "దాని"కొరకు అన్వేషణ ప్రారంభంచేసి "దాన్ని" పొందడానికి కృషి చేయవలసిన బాధ్యత వ్యక్తి మీదనే వుంది. సాంఘికంగా ఎన్ని మార్పులు కలుగచేసినప్పటికిన్ని, సామూహికంగా ఎన్ని ప్రార్థనలు చేసినప్పటికిన్ని, అనంతమగుదాన్నే పొందాలని ఏర్పడిన వ్యక్తిగత జిజ్ఞాసను తృప్తి పరచలేవు. భగవంతుని పొందడానికి మతమనేది హామీ యివ్వవచ్చు, కాని అన్వేషకుడు

ఆధ్యాత్మికంగా బయలు దేరినప్పుడు, సంస్థగా రూపొందిన మతము అతనికి తీరని ఆటంకమై అడుగడుగునా ఏదో ఒక విధమైన మతదురభిమానము, పక్షపాతము మొదలైనవి గొడ్డలిపెట్టుగా ఎదురవుతాయి. తన మతాన్ని వదలడానికి ధైర్యసాహసాలతో ఎదిరించి, మరొక మతము ఉన్నతమైనదని అనుకొని, దాన్ని చేబట్టి ఉన్నత పరిధులను చేరుకోవాలనే ఇచ్ఛకొద్ది అన్వేషణ ప్రారంభించినప్పుడు, క్రొత్త మతాన్ని గుఱించి కూడా భ్రమ పడ్డానని తెలుసుకోగల్గుతున్నాడు.

అందరూ సోదరులేనన్న భావన ఏర్పడాలనే లక్ష్యమే దాదాపు అన్ని మతాల యొక్క సారాంశమని నిర్ణయించవచ్చు. ఇదే రాజకీయాలలో వుండే లక్ష్యము గూడా. ఒక జట్టుకు ఒకడు సర్వాధికారంకావాలంటే, మరొకజట్టుకు మరొకడు సర్వాధికారం కావాలంటాడు. రాజకీయ వేదాంతాలు బహుత్వరితంగా అభివృద్ధి చెందుతూ, దాని ఫలితాలను వెన్వెంట పొందడము వల్ల మతాలనేవి అరాచకం పట్టిపోయాయి. అందువల్ల పోరాడగల్గిన మతాలే రాజకీయ వుద్దేశ్యాలను చేబట్టినందున, స్వకల్పిత భగవంతుడే సర్వాధికారిగా నెంచుకొన్న రాజ్యవ్యవస్థలకు, మద్దతు యిచ్చే సంఘాలు వుత్పన్నమయినాయి. అట్టి మత సహోదరులలో గూడా అధికారము చేజిక్కించుకోడానికిగాను వారిమధ్య ఏర్పడిన అసూయ, ఈర్ష్య, పోటీ, విరోధము మొదలయినవి అసహ్యము కల్గించేటంత విపరీతంగా పెరిగిపోయినాయి.

ఆలోచనాపరుడగు మానవుడు, మానసికంగా జడత్వమేర్పడి మందగించి పోయేటంతగా ఈ మతాల యొక్క పద్ధతులు దిగజారిపోయినవి. పుణ్య పాపములను గుఱించి ఇవ్వబడిన సలహాలు భగవదారాధన అనేదాన్ని ఒక యాంత్రికమైన చర్యగా దిగజార్చినాయి. అదేవిధంగా భగవంతుడంటే ఒక మనిషి రూపంలో వుండేవాడుగా దిగజార్చినాయి. శాంతి అనే పేరుతో మందత్వం కోరుకోడమైనది. సోదరభావం అన్న పేరుతో పోరాడే జట్లగా తయారయినాయి. వినయ విధేయతలనే పేరుతో అంతర్ముఖంగా జడత్వం ఎక్కువయి చివరకు గర్వము అహంకారరూపంలో ఫలితాన్ని కలుగజేస్తున్నాయి.

ఉన్నత శ్రేణికి చెందిన మహానుభావులు అనేక మతాలలో చెప్పబడిన పద్ధతులను సాధనచేసి, దేవుడు, అల్లా, హరి, హర, రామ, కృష్ణ మొదలయినవన్ని గూడా ఒకే దాన్నే సూచిస్తున్నాయని తీర్మానించారు. అన్ని మతాలలో చెప్పబడిన సర్వసాధారణ అంశాలను, సూక్తులను, సమన్వయపరచి మతవైషమ్యాలను

తొలగించాలనే ప్రయత్నాలను గూడా చేసారు. పరిహాసాస్పందంగా జరిగినదేమనగా, ఈ ప్రయత్నాలన్ని గూడా మరికొన్ని నూతన మతాలను సృష్టిచేసి, అదేవిధమైన పోరాటాలలో మునిగి పోయినాయి. ఈ విధంగా పురాతనమతాల యొక్క ప్రాచీన గ్రంధాలను సమన్వయ పరచడానికిగాని, ఏకంచేయడానికిగాని చేసిన ప్రయత్నాలను ఏవరైనా గమనించినప్పుడు, ఈ మతాల యొక్క ప్రభావము మానవుని సమస్యను పరిష్కరించడానికి ఒక మార్గమేనా అనే సంశయము రేకెత్తుతుంది.

ఎవరైనా సరే, మతాన్ని కాపాడవలెననే వాంఛగల్గినవారు మతమనేదాన్ని అధిగమించి దానిలో వుండే ముఖ్య లక్ష్యాన్ని చేబట్టగల్గిన సామర్థ్యం, సారధ్యం సంపాదించాలి. తర్వాత వారు నిజమైన జీవితాన్ని మతమందు ప్రవేశపెట్టి, లక్ష్యసాధనే ముఖ్యము కాబట్టి, అందుకుగానే కృషి సల్పి, అనుసరించే ఆచారవ్యవహారాలను లక్ష్యానికి పోల్చి చూచినప్పుడు ముఖ్యము కాదని నచ్చజెప్పి, ఆ కారణంవల్ల అట్టి పద్ధతులను దేశకాలాన్ననుసరించి సవరణచేస్తూ వుండాలి. పక్షపాత వైఖరి ఎంత తక్కువగా వుంటుందో, చేసే కృషి అంత సొంపుగా వుంటుంది. అయితే పద్ధతులను మార్చడమనేది మేరుపర్వతాన్ని ఎత్తినంత కష్టమైన పనియే. ఎందుచేతనంటే, ఈనాటి మతాలపై రాజకీయాలు, సాంఘిక మనస్తత్వాలనేవి ఈ నాటి మతాలను మొసలిపట్టువలె విడువకుండా గట్టిగా పట్టుకొని వున్నాయి. మతాధికారులు వారి స్థానాన్ని పోగొట్టుకోవడానికి సమ్మతించరు. ప్రజలు గూడా, చెప్పే బోధలను సామాన్యంగా, స్వతఃసిద్ధంగా గమనించరు. అందుచేత భగవంతుడిని, తన భక్తులకు తన తరపున వుండే వారికి సహాయము చేయమని ప్రార్థించడమనేది ఒక్కటే మార్గము.

**"మతమనునది జన సమూహాలకు, ఆధ్యాత్మికతనునది కొందరికే"**

-- బాబూజి

# 5. ఆధ్యాత్మిక సంస్థలు

మతాల వల్ల ఎడతెగకుండా బాధపడి, మతమంటే అసహ్యము, విసుగుదల, ఆత్మయందు అంతర్ముఖంగా క్షోభ మొదలయినవి ఏర్పడినందున, కొంతమంది యధేచ్ఛగా ప్రార్థన చేసుకోడానికి, ఆధ్యాత్మిక మార్గ పద్ధతులను అనుసరించడానికి, ఈ ఆధ్యాత్మిక సంస్థలను స్థాపించడములో ధైర్యంగా అడుగు ముందుకు వేశారు. మతము నుండి బహిష్కరిస్తారనే భయం వల్ల అట్టి సంస్థలు మొదట్లో రహస్యంగా ప్రారంభింపబడ్డాయి. ఇప్పటికి గూడా ఆ విధంగా రహస్యంగా కార్యకలాపాలు సాగించే సంస్థలు వున్నాయి. చూడడానికి న్యాయంగా కనబడే కారణాలతో వారు ఎందుకు ఆ విధంగా రహస్యంగా వుంటున్నారో నచ్చజెప్పుకొంటారు. మతము యొక్క ఆచార పద్ధతుల నుండి స్వేచ్ఛ, మరియు ప్రార్థన అనే ఈ రెండు అంశాలు వుండబట్టి వాటిని ఆధ్యాత్మిక సంస్థలని పిలుస్తున్నారు. అయినప్పటికి వారుగూడా స్థూలంగా ఆచార పద్ధతులను ఏర్పఱచారు. వారిప్రార్థన గూడా ప్రాపంచిక కోర్కెలను ఈడేర్చుకోవడానికి చేసే ప్రయత్నమే గాని మరేమికాదు.

ఆచారపద్ధతులను కట్టుదిట్టంగా అనుసరింపజేసి, అట్టివి వారి ఆదర్శాలకు భిన్నంగా వున్నప్పటికి, వారి ప్రత్యేకతను కాపాడుకోవడములో ఎక్కువ శ్రమపడ్డారు. వారనుసరించిన రహస్య పద్ధతులు మతము వల్ల కలిగే భయభ్రాంతులకు ప్రత్యామ్నాయంగానే వుంటున్నాయి. ఏ ప్రతిజ్ఞల యొక్క ఆకర్షణలవల్ల క్రొత్త సంస్థలు స్థాపించారో, అట్టి ప్రతిజ్ఞలు అలాగే నిలబడిపోయి, వీటిని గురించిన ఆలోచనల్లో తిరిగి బేధాభిప్రాయము కల్గినందువల్ల అవి మరల పోరాటానికి కారణములైనాయి. ఇందులో గూడా, అధికారాన్ని చేజిక్కించుకొన్నవారు తమ చేతి క్రింద ఇతరులను వుంచుకోవడానికి తగిన పద్ధతులను వెతుకుతూనే వుంటారు. ఎప్పుడయితే కొంతమంది సభ్యులు, ముఖ్యంగా ధనము, కొంత జ్ఞానము కలవారు ఇట్టి సంఘాలనుండి విడిపోతారో, వారు వేరే సంఘాలలో నైనా చేర్తారు. లేదా క్రొత్త వైనా స్థాపిస్తారు. ఈ విధంగా సంస్థలనేవి ఈ విధమైన పోరాటాలు, జగడాలతో నీచస్థితికి దిగజారుతాయి.

ఇట్టి సంస్థలు, వాటిని స్థాపించినవారు గతించిన పిమ్మట, అవి సాంఘిక సంస్థలుగా మారి ఏదో పదిమంది కలవడానికి వీలుగా వుండే సాంఘిక సంస్థలుగా

మారిపోయి అంతటితోనే నిలచిపోతాయి. అంతగా అయితే అప్పుడప్పుడు గురువులచే రచింపబడిన గ్రంధాలు చదవడమో, లేక వల్లించడమో జరుగుతూ, సామూహిక ప్రార్థనలలోని వివిధ వర్ణాలతో అధ్యాత్మికతను ఆనందించుతూ వుంటారు. వారందరు కలిసి కట్టుగా వుండడానికి కృషి చేస్తున్నారేకాని, చెప్పుకోదగ్గ యితర కృషి ఏమిలేదు. కొంత తీవ్రంగా ఆలోచించే సభ్యులు వారి సంస్థల యందు అసంతృప్తిని వెలిబుస్తున్నారంటే, అందులో ఆశ్చర్యమేమిలేదు. అయినప్పటికి, ఈ అధ్యాత్మిక సంస్థలు, వారి సభ్యులకు ఇష్టమైన అధ్యాత్మిక మార్గాన్ని అవలంభించడంలో స్వేచ్ఛను యిస్తాయి గనుక, వాటివల్ల కొంత వుపయోగమే వుంది. కాదంటే వారి సంఘం పేరు క్రింద అట్టి మార్గాన్ని అనుసరించడానికి సభ్యులను ప్రతిజ్ఞ చేయిస్తారు ఈ సంస్థలలో ఏ కొద్దిమందో సభ్యులు వుంటారు. అందువల్ల, స్వకల్పిత భగవంతుడే సర్వాధికారిగా నెంచుకోబడ్డ రాజ్య వ్యవస్థల యొక్క అధికారము ఈ సంస్థలలో పని చేయవు. అయినప్పటికి, ఒక్కొక్క సారి మూర్ఖాభిమానులు, మాటిమాటికి పోట్లాడే మనస్తత్వం కల్గినవారు ఆ సంస్థలలో అప్పుడప్పుడు తలెత్తుతూ వుంటారు. సాధారణంగా వెంటనే తగ్గిపోతూ వుంటారు. నిరాశ నిస్పృహ చెందుటవల్ల అప్పుడప్పుడు అలాంటివి జరుగుతూ వుంటాయి.

ధన సమృద్ధిగల సంస్థలు, అధ్యాత్మిక కార్యకలాపాలనే పేరుతో అప్పుడప్పుడు సాంఘికసేవ చేస్తూ, వారి ఖజానాలను డబ్బుతో నింపుకొంటూ వుంటారు. అట్టి సేవ అనేది డాంబికమైన విందులు మొదలుకొని, గొప్ప వుపన్యాసాలు, వాఖ్యానాల వరకు జరుగుతూ వుంటుంది. కొన్ని సంస్థలు గ్రంధాలయాలు, వైద్యశాలలు, అనాధశరణాలయాలు, అన్నశాలలు మొదలయినవి నడుపుతూ వుంటాయి. మరికొన్ని సంస్థలు సామూహికంగా మోక్షప్రాప్తి కలుగచేస్తామనిన్నీ, అందువల్ల వ్యక్తితో వారికి సంబంధంలేదనిన్నీ చెపుతూ వుంటారు. రాజకీయ సంస్థలవలె, యివిగూడా వ్యక్తిపరంగా శ్రద్ధచూపడ మనేది అంత ముఖ్యంకాదని అంటూవుంటారు. సంస్థకు సంబంధించిన వారైతే వారికి మోక్షప్రాప్తి లభిస్తుందని హామీలు ఇస్తూవుంటారు. అట్టి హామీలు, ప్రతిజ్ఞలు, భగవంతుడే స్వయంగా వారికి యిచ్చినట్లు ఆ సంస్థలను స్థాపించిన వారు ఇస్తూ వుంటారు.

ఇంకా కొన్ని కపటమైన అధ్యాత్మిక సంస్థలు వున్నాయి. వెర్రితనమే అధ్యాత్మికతయని పొరబాటుపడి, అట్టి వెర్రితనం కోసము ఆ సంఘసభ్యులు

మతివిభ్రమంవల్ల పొందే వుల్లాసం కొరకు మందులు తింటూ, వికల్పిత పద్ధతులు అవలంబించుతూ వుంటారు. అయితే అట్టివి రహస్యంగా, ఏకాంతంగా జరుపుకోవాల్సి వస్తుంది. పై యెత్తున వుండే వాళ్ళు కొత్త కొత్త పద్ధతులను సృష్టించి, వారి సభ్యులను ఆశ్చర్యచకితులను చేసి, దిగ్భ్రాంతి చెందేట్లుగా చేస్తూ వుంటారు. అట్టి అధినేతలు చెప్పేవన్ని గూడా ఆ సంఘ సభ్యులు బహు వినయంగా అంగీకరిస్తూ వుంటారు. కొన్ని మార్లు వారు పెట్టే బాధలు, హీనకరమైన చేష్టలు బహిర్గతమయినప్పుడు ప్రభుత్వము జోక్యము కలుగ చేసుకొని వాటిని అణచివేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతున్నది. అట్టి సంస్థల యొక్క అధినేతలు వారి రాచకార్యాలను నెఱవేర్చుకోడానికి, వారి విరోధులను హింసించడానికి, చిత్రహింస చేయడానికి, చివరకు హత్యలు చేయడానికి గూడా సంఘ సభ్యులను వుపయోగ పెట్టుకొన్న సంఘటనలు మామూలు అయిపోయింది. గనుక ఆధ్యాత్మిక సంఘాలలో ఆధ్యాత్మికత అనేదానికొరకు అన్వేషణ చాలా కష్టమైపోయింది. అయినప్పటికి, ఆధ్యాత్మికత కొరకు అన్వేషణ జరగాల్సిందే. ఈ ఆధ్యాత్మిక మార్గమనేది కత్తిసాములాంటిది. శాశ్వతమైన ఈ అనంత మగునట్టి, ప్రశాంతతలేని మహాసముద్రంలో ఈదులాట ప్రారంభించువరకు ఎవరేగాని ఈ పోరాటాన్ని సాగిస్తూ వుండాల్సిందే.

"తన గురువును తానే పొగిడిన అది గురువును అగౌరవపరచినట్లగును".

-- బాబూజి.

# 6. సహజమార్గము యొక్క ఆధారము

భగవంతుడిని పొందడానికి ప్రకృతి సిద్ధంగా వుండే మార్గమే సహజమార్గము. ఈ నిర్విరామమగు సర్వసృష్టికి కారణభూతమైన మహోన్నత క్రియాశక్తికి, స్వతఃసిద్ధము, సూక్ష్మాతి సూక్ష్మము, అతి సులభసాధ్యమగునట్టిదియగు మూల కేంద్రమునే భగవంతుడుగా ఈ సహజ మార్గములో తీసుకొనబడుతుంది. ఇదే మానవ సాధ్యమగు పరిపూర్ణస్థితి. "దాని" యందు ఏర్పడిన ఒక క్షోభ (కదలిక) యే సృష్టికి మొదలు. క్షోభగా ఏర్పడిన ఆ శక్తియే బహిర్గతమయి మానవునిలో చిత్‌శక్తిగా రూపొందింది. గనుక అట్టి ఆలోచన యొక్క శక్తిని దాని సహజస్థితికి తేవడమొక్కటే మానవుడు "దాన్ని" పొందడానికి మార్గము. సామాన్యంగా మానవుడు తన ఆలోచనా శక్తిపై ఆధిపత్యం పొగొట్టుకొన్నాడు గనుక "దాన్ని" పొందినట్టి వ్యక్తి యొక్క సహాయములక్ష్యసిద్ధి కొరకు ఎంతైనా అవసరము వుంది. అది అత్యవసరము గూడ. సమర్థవంతుడైనవాడు ప్రాణాహుతి ద్వారా యోగశక్తిని ప్రసరింపచేసి సహాయాన్ని అందచేయవచ్చు.

భగవంతుడు ఏ విధంగా ఈ సమస్త జగత్తును సృష్టించినాడో అదేవిధంగా మానవుడు తన ఆలోచనా శక్తిని పలువిధాలుగా వుపయోగించి ఒక చిన్న జగత్తును సృష్టించుకొన్నాడు. ఈ చిన్న సృష్టి ఒక గూడువలె వుంది. మానవుడు తన యధార్థ దివ్య తేజస్సుతో ప్రకాశించవలెనంటే, ఈ అల్లికగా వుండే గూడును ఛేదించాలి. ఈ అల్లిక అల్లడములో అనేక ముడులు(గ్రంధులు) ఏర్పడ్డాయి. ఇవి మహోన్నతమైన శక్తిచే, కేంద్రీకృతములైయున్నాయి. అందువలననే మానవుని ఆలోచనాశక్తి ఏదోఒక పద్ధతిగా పరిమితమై వుంటుంది. అత్యున్నతమైన దానిని గుఱించి ఆలోచనచేసినా, తనకుతెలియకనే తాను ఒక పద్ధతికి అలవాటుపడి ఆ పరిమితికిలోనయి వుంటాడు. అదృష్టవశాత్తు ఎవరైనా యిట్టి పరిమితులను దాటి తన సృష్టిని ఛేదించుకొన్నట్టి వానితో అతను సంబంధమేర్పఱచుకోగల్గితే, తను కూడా బంధవిముక్తుడు కాగలడు. ఈ విధమయిన సంబంధము యిద్దరి మధ్య చిత్‌శక్తి(లేక చింతన) ద్వారానే ఏర్పడుతుంది. చిత్ శక్తియే ఆధ్యాత్మికతకు అధారం.

మానవునిలో చింతన అనేదే మూల శక్తి యనియు, స్వగృహం చేరడానికి ఈ శక్తిని వుపయోగించుకోవడమనేది సూర్యవంశజుడైన దశరథమహారాజుకు డెబ్బైరెండు

తరములకు ముందు మన హిందూ దేశములో ఒక మహాఋషిచే కన్గొనబడింది. ఈ మూల సిద్ధాంతమును ఆధారంగా చేసుకొని అనేక యితర పద్ధతులు తదుపరి బయలు దేరినాయి. ఆధ్యాత్మిక శిక్షణకై శ్రీ కృష్ణ భగవానుడు ప్రవేశపెట్టిన పద్ధతి అన్నిటికన్న గమనించ తగ్గది. ఇప్పటి ఆధ్యాత్మిక శిక్షణ పద్ధతులన్ని దాని నాధారంగా చేసుకొని ఏదో రూపంలో వుండేవే. యోగదృష్టిని బాగా అభివృద్ధి చేసుకొన్న మహాత్ములందరికి ఈ విషయం బాగా తెలుసు. ఈ నవీన ఆధ్యాత్మికతకు ఆయన్ను తండ్రియని పిలువవచ్చు. ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిని నూతనంగా తీర్చిదిద్దిన మహనీయుడు, షాజహన్‌పూర్ వాస్తవ్యుడయిన మహాత్మా శ్రీ రాంచంద్రజి (ఉత్తరప్రదేశ్). ఆయన మన సమకాలికుడని సగర్వంగాచెప్పుకోగల మహద్భాగ్యం మనకు సముచితమే. ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిని మహోన్నతంగా మార్పుచేసి మానవ కోటిని ఇంకా అత్యున్నత స్థాయికి తీసుకొని పోగల్గినట్టి వ్యక్తి అతను. అట్టివాడు ఏ కొన్ని వేల సంవత్సరాలకోగాని ఒక్కసారి పుట్టడు.

ఈ విధమయిన ఆధ్యాత్మిక శిక్షణా పద్దతికి "సహజమార్గమని" పేరు పెట్టబడింది. అతీంద్రియజ్ఞానము యొక్క మహోన్నత స్థాయి యందు పై చెప్పబడిన మహాపురుషునికి, ఏర్పడిన స్వానుభవమే ఈ ఆధ్యాత్మిక శిక్షణకు ఆధారము.ఇది ప్రమాణాత్మకమైనది. ఎందుచేతననగా, ప్రమాణాత్మకమైన అన్ని పద్ధతులు, ఆ "అంతిమ మూలము" నుండే అధికారాన్ని పొందుతూ వుంటాయి. సహజమార్గములో ఈ శక్తినే వుపయోగ పెట్టబడుతుంది. ఆధ్యాత్మిక శిక్షణ కొరకు చెప్పబడిన యితర నిష్కళంక మార్గపద్ధతులన్ని గూడా ఈ పద్ధతిలో నిండుదనాన్ని పొందడమే గాక, ఈ పద్ధతితో సంబంధము కల్గినందున అవి ఉన్నత స్థాయిని పొందినట్లు గుర్తిస్తాయి. వెలుతురు వచ్చినప్పుడు అంధకారము ఏవిధంగా అంతర్థాన మగునో, అదే రీతిగా ఈ సహజ మార్గముతో సంబంధము కల్గినప్పుడు జడసంబంధ మైన పద్ధతులు, స్థూల సంబంధమైన అలవాట్లు అన్నియూ అంతర్థానమయి పోతాయి. ఈ పద్ధతికి విచారణతో మిళితమైయున్న ఆలోచనా శక్తియే బునాది. గనుక సహజమార్గ పద్ధతులు ఎంతవరకు సబబనే ప్రశ్నకు ఆస్పదం లేదు. ఉహతో ఫలానిదని నిర్ణయించినట్టి విషయాన్ని, సూటిగా అనుభవ యోగ్యమగు స్థాయికి ఈ పద్ధతి తీసుకొని పోతుంది. అందుచేత ఎక్కడేగాని అనుమానమనేది తొంగిచూడ

డానికి గూడ ఆస్పదము లేదు. వాస్తవంలో, ప్రతి ఆలోచనాపరుడిని తన ఆలోచనా శక్తిని ధ్యానము ద్వారా అభివృద్ధి చేసుకోవలసిందని ఈ సహజమార్గం ఆహ్వానిస్తుంది. ధ్యాన సాధన తగినంత లేకపోతే లోతుగా విచారించడమనేది సాధ్యపడదు. నిజమైన అన్వేషకుడిని, ఆలోచననూ యాంత్రికమైన పద్ధతులనూ, అధిగమించమని ప్రోత్సహించడమువల్ల ఈ పద్ధతి ఒక విప్లవాత్మకమైన పద్ధతి. మూఢనమ్మకాలకు గాని మూర్ఖమైన, అహేతుకమైన సిద్ధాంతాలకుగాని ఈ సహజమార్గములో ప్రవేశముగాని స్థానము గాని లేదు. పొందగల్గినట్టి ఒక అంతిమస్థాయి వున్నదనే భావన తప్ప, పొందుటకు సాధ్యపడని ఊహాకల్పిత సూత్రాలకు సహజ మార్గమందు తావు లేదు.

సహజమార్గసాధనాపద్ధతులననుసరించు ఆధ్యాత్మిక యాత్రలో, అనుభవ రీత్యాపొందు స్థితి గతులే అన్వేషకునికి ప్రత్యక్ష నిదర్శనలు. సామాన్యంగా, ఇంద్రియ సంబంధమైన అనుభవాలు పొరబాటుతో కూడినవైవుంటాయి. అట్టి వాటికి ఈ మార్గ పద్ధతిలో తావు లేకుండా, గోచరమయ్యే సూటియైన అనుభవము మాత్రమే వుంటుంది. సక్రమంగా గోచరించడానికి కావల్సినవి-ఆరోగ్యంగా వుండే ఇంద్రియావయవములు, బుద్ధి, మంచి వెలుతురు మరియు గోచరింపబడు వస్తు విషయము. సామాన్యంగా గోచరింపబడు వస్తు విషయమనేది గోచరించువానికి అన్యంగా వుంటుందని సామాన్యంగా అనిపిస్తుంది. అయితే సహజమార్గము బోధించునట్లుగా హృదయము నిర్మలము చేసినప్పుడు, ఆధ్యాత్మిక స్థితియనేది అన్వేషకునికి సంబంధించి వుండేది కావున, స్వచ్ఛమైన జ్ఞాన తేజస్సువల్ల, అట్టి స్థితిని నేరుగానూ, సూటిగానూ పొందుతాడు. గనుక ఇచ్చట సంశయానికి గాని చిత్త భ్రమణానికి గాని, అంధత్వానికి గాని వీలులేదు.

ఆలోచనాక్రియ యావత్తు హృదయ ప్రాంతములోనే జరుగుతుంది. వాస్తవంలో యావత్తు ఈ ప్రాంతములోనే గోచరిస్తుంది. ఏవిధంగానయితే అనవసరమయినవి గూడా ఇచ్చట వృద్ధి కావడానికి ఆస్పదమున్నదో, అదే విధంగానే ఈ ప్రాంతాన్ని శుభ్రముచేసి నిర్మలంగాకూడా చేయవచ్చు. అనవసరమయినవి, అనగా, ఆలోచన ద్వారా నాటబడిన మొక్కలు అని అర్థం. వస్తు విషయాదులందు యింద్రియాలను ఇష్టము వచ్చినట్లు పోనిచ్చినందు వల్ల పుట్టినట్టి జారజాలుఈ

మొక్కలు. ఎప్పుడయితే శక్తి వంతమైన విత్తనము అచ్చట యోగ ప్రసారితము వల్ల నాటబడుతుందో, అది దేదీప్యమానమైన వృక్షముగా పెరగడానికి ప్రారంభమవుతుంది. అప్పుడు ఈ మొక్కలు వాటంతటవే ఎండగాలి పోవచ్చు లేదా అవి గూడా దివ్యత్వము పొందడానికి అంతర్ముఖంగా సహాయం పొందవచ్చు. గనుక ఈ సహజమార్గమందు శిక్షణా పద్ధతి అనేది మానవుని మూల స్థానము నుండి వెంటనే మొదలవుతుంది. అందువల్ల బహిర్ముఖంగా తన ఉనికి యావత్తు పరివేష్టించుటకు వ్యాపకం చెందుతూ వుంటుంది. అత్యున్నత స్థితి నందుకొన్న వ్యక్తి యొక్క దైవీకమైన ఇచ్ఛా శక్తిచే, ఈ ప్రసారితము సహజమార్గములో చేయబడుతుంది. ఈ యోగశక్తి ప్రసారితమనేదానిపై సంపూర్ణ ఆధిపత్యం వహించిన ప్రిసెప్టరు యొక్క ఇచ్ఛా క్రియయే ఈ ప్రాణాహుతి. మంచికైపు ఎక్కినప్పుడు చేసే వుత్తుత్త ప్రార్థన కాదు ఇది. ఈ విధమైన ప్రార్థనకూడా ఒక్కొక్క సారి ఫలితాలను యిస్తుంది. సహజమార్గములో యోగశక్తితో ప్రాణాహుతి అనేది ప్రిసెప్టరు (గురువు) యొక్క అధీనమందు వుండే అమోఘమైన శక్తి. అన్వేషకుని హృదయంలోని సంస్కారాలను, జడత్వాన్ని, అంధకారాన్ని, ఆటంకాలను తీసివేసి దివ్యతేజస్సు అనే బీజాన్ని నాటుతాడు. ఈ ప్రాణాహుతి పొందిన అభ్యాసికి త్వరలోనే శుభప్రదమైన ఫలితాల యొక్క అనుభవం ఏర్పడడము మొదలవుతుంది. తను ఏమాత్రం శ్రమపడకుండా తన ఉనికిని, సూక్ష్మస్థితులను పొందుతూ వుండడము అభ్యాసి గమనిస్తాడు.

అంతిమ మూల తత్వమును ప్రసరింప చేసినప్పుడు, మాయాపూరితమగు ప్రపంచము యొక్క ఆకర్షణలకు గాని, దానికి సంబంధించిన సంస్కార బంధములకు గాని తావు వుండదు. సంపూర్ణ బంధరహితమనేదే ఏకైక లక్ష్యము తప్ప మరి ఏవిగూడ దృష్టియందు వుండవు. అంతరంగంలో బంధములుగా ఉండే పశులక్షణాలనుండి విడివడే దాకా మానవుడు నిజమైన మానవుడుగా కాదనేదే దీని ముఖ్యవుద్దేశ్యము. ఈ బంధ విముక్తి అనేది పొందడము అత్యంతకష్టమనిన్నీ, అనేక జన్మలెత్తి ఎంతగానో ధార్మిక కార్యాలు చేసినవేగాని సాధ్యపడదనిన్నీ, అదికూడా ఈ మానవశరీరము వున్నంతవరకు వీలుపడదనిన్నీ మొదలైన సామాన్యమగు నమ్మకాలను ఈ సహజమార్గము అంగీకరించదు. బంధవిముక్తి అనేది మానవుని జన్మహక్కు. ఒక వేళ అదొక్కటే కాకపోయినా- ఇది అన్నింటికన్న ముందుగా

కావలసినంత అత్యంత అవసరమైన ముఖ్య విషయము. అడిగిన తక్షణమే పొందగల్గినట్టిదని ఈ సహజ మార్గము యొక్క ముఖ్య ప్రాతిపదిక. ప్రాణాహుతి వల్ల యోగశక్తి ప్రసారితము చేయబడి తద్వారా అభ్యాసి పొందు అంతిమ స్థాయి యొక్క అత్యున్నత సూక్ష్మ స్థితితో, జ్ఞానము వల్ల కలిగే ఆహ్లాదములు శాంతి అనే వాటిని పోల్చి చూచినప్పుడు ఇవి ఎంతో భారంగా వుంటాయి. తేజస్సు అనే దాని యొక్క మూలమును అన్వేషించిన వానికి, తేజస్సును గుఱించిన ఆహ్లాదము వుండదు. తేజస్సనేది, ఒకజడమైన లక్షణముతో కూడుకొని వున్నట్టిదే. ఈ తేజోవృత్తములకు అతీతంగా వుండే ప్రాంతములు వున్నాయి. అవి మానవ సాధ్యములు కావని ఇప్పటివరకు అనుకోబడుచున్నవి. అయితే సహజమార్గము నకున్నూ, ప్రాణాహుతి పద్ధతికిని ధన్యవాదములు. దీనివల్ల తేజోమండలము యొక్క కేంద్రములోనికి ప్రవేశించడమేగాక తేజస్సు యొక్క అన్ని వృత్తములు అధిగమించి అనంత కేంద్రమను మహాసముద్రములో మానవుడు ఈదులాడుటకు సాధ్యము గావించబడింది.

మానవునికి, దివ్య ప్రకృతికి మధ్య సన్నిహిత సంబంధమును, స్థిరపరచినప్పుడు అదే బునాది. సహజమార్గములో ఆధ్యాత్మిక శిక్షణ ఈ బునాది పైన ఆధారపడి వుంటుంది. ఒక్కసారి ఈ సంబంధము కలుగజేస్తే అభ్యాసి యొక్క పురోభివృద్ధి పుంఖాను పుంఖాలుగా జరుగుతూ వుంటుంది. ఆధ్యాత్మికాన్ని గుఱించిన అపోహలు, మర్మములు మొదలయినవి మానవునికి, దివ్యప్రకృతికి మధ్య సన్నిహిత సంబందము ఏర్పఱచ లేక పోయినవి. బోధకులు, గురువులు అనబడేవారు, వారిని వారిశిష్యులను, వారి సంస్థలను తృప్తి పరచడానికి పలువిధాలయిన జీవితాలను బలవంతంగా గడపాల్సివచ్చింది. గనుక, తాము చేసినట్లు చేయకుండా చెప్పినట్లు నడుచుకొమ్మని అత్యున్నత స్థాయినందుకొన్న మహర్షులు కూడా వారి శిష్యులకు చెప్పడములో ఆశ్చర్యమేమి లేదు. పేరుకు తగినవిధంగా ఈ సహజమార్గ పద్ధతిలో ఏ విధమయిన నిబంధనలు లేవు. ప్రతి విషయము బాహాటంగా వుంటుంది. మర్మంగా వుంచడానికి ఏమి లేదు. గురువు వద్ద కూడా ఏవిధమయిన రహస్యము లేదు. అభ్యాసికి, గురువుకు మధ్య అంతరమే లేదని అభ్యాసి భావిస్తాడు. వాస్తవంలో తానూ, గురువు అనన్యులని కన్గొంటాడు. యోగశక్తిని గురువు ప్రాణాహుతి ద్వారా ప్రసరింపచేయుట వల్ల, అట్టి సన్నిహిత సంబంధము ఏర్పడుతుంది.

మతమనేదాన్నీ అధిగమించడము, అంటే ఆధ్యాత్మిక రంగములోనికి ప్రవేశించినట్లే గనుక మతము యొక్క ఆచార వ్యవహారములు సంఘానికి సంబంధించిన ఒక సాంఘిక విషయంగా ఈ సహజమార్గము పరిగణిస్తుంది. ఈ ఆచారవ్యవహారములే, అంతర్ముఖంగా జడమై బంధకారణమైనప్పుడు, సహజ మార్గము వాటిని పెకలించి వేస్తుంది. "మతము యొక్క అంత్యమే ఆధ్యాత్మికతకు మొదలని" సహజమార్గ స్థాపకులు అంటారు. దేవాలయాలకు, ఇతర పూజాస్థలాలకు వెళ్ళడమనేది సహజమార్గము నిషేధించదు. మానసికంగా స్థూలమైన పద్ధతులను అలవాటు చేసుకొని అనేక దేవుళ్ళు, దేవతల యొక్క విగ్రహాలను పూజించడమనేది ఆధ్యాత్మిక అభివృద్ధికి తీరని గొడ్డలిపెట్టని ఈ మార్గం చెబుతుంది. దేవాలయంలోనే దేవుడిని వదలకుండా, హృదయంలో అన్వేషించాలని సహజమార్గం బోధిస్తుంది. ఏమతములో గూడా ముఖ్య భాగమైన ప్రార్థన అనేది ఒక మానసిక స్థితి. దీనిని ప్రతి అన్వేషకుడు ఆధ్యాత్మికోన్నతికి అభివృద్ధి చేసుకోవాలి. అయితే దేవుళ్ళ ముఖస్తుతి చేయుట కొరకు ప్రార్థనను దిగజార్చకూడదు. ఆధ్యాత్మికోన్నతి కొరకు మాత్రమే భగవంతుడిని ప్రార్థన చేయాలి. ప్రాపంచికమైన చిల్లర వాటికొరకు భగవంతుడిని ప్రార్థించడమనేది, పిల్ల చేష్టలేగాక దూషించినట్లుగూడా అవుతుంది. ఆధ్యాత్మిక పరంగా చూస్తే, ప్రాపంచికమైన ఫలితాలకొరకు చేసే అట్టి ప్రార్థనలు, అంతర్ముఖంగా జడత్వాన్ని, సాంఘికంగా సోమరితనాన్ని, మూర్ఖవిశ్వాసాన్ని కలుగచేస్తాయి.

ముఖ్యంగా సహజమార్గపద్ధతి, యోగపద్ధతి-రాజయోగపద్ధతి. అయితే ప్రతి మానవునికి అందుబాటుగా వుండే విధంగా కొన్ని మార్పులు చేయబడింది. వేదాంతము ననుసరించి చెప్పబడిన సాధన చతుష్టయ సంపత్తికి అనుగుణంగా వుండే పద్ధతినే ఈ సహజమార్గంలో చెప్పబడింది. అయితే వివేకము వైరాగ్యము లనే వాటిని సాధనగా చేయుటవల్ల, వృథాకాలయాపన జరుగుతుంది కావున, ఈ వివేకము వైరాగ్యములనేవి, సరియైన ధ్యానసాధనవల్ల అంతరంగంలో పొందగల్గు స్థితులని, ఈ సహజమార్గం బోధిస్తూ ప్రత్యక్షంగా అనుభవ పూర్వకంగా రుజువు చేస్తుంది. అత్యున్నతమయిన దాని కొరకు మనము తీవ్ర ఇచ్ఛ బంధము కలుగ చేసుకొన్నప్పుడు సూక్ష్మోన్నతమైన స్థితులను మనస్సు, స్వతఃపొందుతూ వుంటుంది. అంతిమ స్థాయి వున్నదనే తలంపు, దానిని 'దాని' సహాయముతోనే పొంద శక్యమవుతుందనిన్నీ, అందువలన ప్రతి కోరిక గూడా మన పురోగమనానికి ఒక ఆటంకమనిన్నీ, సహజమార్గములోని మూల సిద్ధాంతము. దైవీకముతో పటిష్టమైన

సంబంధము ఏర్పాటు కాగలందులకు, దైవీకములోనే జీవించడానికి సహజ మార్గమందు, దశాదేశనియమాలను మనకు యివ్వబడినాయి. ఒక్కసారి "దాని"తో సంబంధము స్థిరపడినదంటే మనము చేయవలసిన పని చాలా భాగం పూర్తిఅయినట్లే.

దాదాపు నూరు సంవత్సరాల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని ఫతేఘర్ నందు కాయస్త కుంటుంబంలో ఒక గొప్ప వ్యక్తి జన్మించారు. ఆయనను సమర్ధగురు మహాత్మారాంచంద్రజీ మహరాజ్ అని పిలుస్తారు. లాలాజి అని ఆయన పహచరులు పిలుస్తారు. చాలా చిన్నవయస్సులోనే ఆయన దృష్టి ఆధ్యాత్మికంగా లాగబడింది. ఏడుమాసముల కాలంలోనే పరిపూర్ణతను పొందారు. మానవసేవ చేసి, ఆయన యాభైఆరవయేట భౌతిక దేహాన్ని వదిలారు. పంౖడెండు సంవత్సరాల తర్వాత ఆయన అనుచరుడు, షాజహాన్ పుర నివాసియగు మహాత్మా శ్రీ రాంచంద్రజి (దగ్గర సహచరులు ఆయన్ను బాబుజీ అని పిలుస్తారు) తన గురువు పేర 'శ్రీరాంచంద్ర మిషన్' అను సంస్థను మానవ సేవ కొరకు 1945 లో క్రమ పద్దతిన స్థాపించారు. "సహజమార్గ" మనే పేరు, మార్గ పద్ధతిని సూచించడానికి, బాబూజీ మనస్సు నందు ఉత్పన్నమయింది. లాలాజీకి, ఆయనకు ముందు వుండిన ఋషులకు ఈ మార్గమునే 'సంత్‌మట్'లనే పేరుతో వున్నదని తెలుసు. అయితే, ఆధ్యాత్మిక రంగములో బాబూజీచే క్రొత్తగా కొన్ని కనిపెట్టబడి, కొన్ని కన్గొన బడినందున, క్రొత్తగా 'సహజమార్గ'మని పేరు ప్రవేశ పెట్టబడింది.

ఈ క్రొత్తగా కన్గొనబడిన వాటివల్ల ఆధ్యాత్మిక శిక్షణ యనేది బాగా విప్లవాత్మకంకావింపబడింది. శ్రీరాంచంద్రమిషన్ లోని సమర్థుడైన ఒక ప్రిసెప్టరు గారు దీనిని "కన్నీరు లేని యోగము" అని అన్నారు. ధారావాహంగా కన్నీరు కార్చవలసినప్పటికి దీనిని కన్నీరు రాని యోగమని అన్నారు. అనగా, గురువు యొక్క ప్రాణాహుతి సహాయము వల్ల, ఎంతో కష్టపడి చేయవలసిన, పయనమంతా కష్టపడకుండా జరిగిపోతుందని అర్థం.

క్లుప్తంగా చెప్పాలంటే, సమర్థవంతుడైన గురువు యొక్క సహాయముతో మానవ ఉనికి యొక్క అంతిమ స్థితిని పొందడానికి, చింతనాశక్తిని సక్రమమైన పద్ధతిలో వుపయోగపెట్టడమే సహజమార్గముయొక్క సిద్ధాంతము.

# 7. సహజమార్గలక్ష్యము

సూక్ష్మమైన, పవిత్రమైన, పూర్ణమైన మానవుని అంతిమ స్థితియనునది ఒకటి వున్నదని ముందు పుటలలో చెప్పబడింది. మానవుని కృషి యంతా గూడా తెలియకనే ఆ స్వతః సిద్ధమైన స్థితిని తిరిగి పొందుట కొరకే. అయితే చెప్పినట్లు వినక, ఆహ్లాదములనేకోరు స్వభావమువల్ల మానవుడు తన ఇంద్రియాలను సంతృప్తిపఱచుచూ, జడత్వమును, సంస్కారాలను సృష్టించు కొంటూ వుంటున్నాడు. సంపూర్ణమైన సమత్వస్థితిని మరల చేకూర్చు కొనుటకు మనస్సును క్రమబద్ధము చేయుట సహజ మార్గము యొక్క లక్ష్యము. అట్టి సంపూర్ణ సమత్వస్థితినే సహజసమాధియని పిలువబడుచున్నది.

కేంద్రము, లేక మూలము వైపు పురోగమించునప్పుడు, మానవుడు అనేక స్థితులు, స్థాయిల గుండా పోతూ వుంటాడు. మొట్టమొదట అతను తన యొక్క స్థూలమైన జడత్వస్థితిని గుఱించి తెలుసుకొని, తదుపరి, బంధరహితమైన ఉన్నత స్థితిని గుఱించి ఆలోచిస్తాడు. ఎప్పుడయితే అతను దైవ సామ్రాజ్యంలోనికి ప్రవేశించాలనే నిర్ణయం, మనస్సులో చేసుకొని పటిష్టమైన ఇచ్ఛాశక్తిని కలుగజేసుకొనునో అప్పుడు అతను, ఆధ్యాత్మికత యొక్క మొదటి వృత్తము, లేక అన్నింటికన్న, బాహ్యంగా వుండే వృత్త పరిధిలోనికి ప్రవేశిస్తాడు. సక్రమమైన మార్గము ద్వారా పురోగమిస్తూవుంటే, ఈ జన్మలోను, అనేక తదుపరి జన్మలలోను, ఎంత తీవ్రకృషి చేసినప్పటికి అధిగమించలేని అవరోధాలనుండి ప్రాపంచిక బంధములనుండి ఈ జన్మలోనే విముక్తుడు కాగలడు. నిస్సందేహంగా శ్లాఘనీయమైనట్టి ఈ మోక్షప్రాప్తి అనునది రెండవ, మూడవ వృత్తముల మధ్య వుంటున్నది. సహజమార్గ పద్ధతిలోని ప్రాణాహుతి ద్వారా సమర్థుడైన గురు సహాయము వల్ల ఇట్టి స్థితి బహుసులభముగా పొందనగును.

మాయాపూరితమగు స్థూలతర స్థితులను, ఐదు వృత్తములలో సహజ మార్గ స్థాపకులచే సూచించబడినవి. ప్రకృతి అవసరముల ననుసరించి, ప్రపంచములో తగు రీతిన మార్పులను తెచ్చుటకు దిగివచ్చిన అవతారపురుషులు ఈ ప్రాంతము నుండియే. ప్రకృతి యొక్క శక్తుల నన్నింటిని అధీనమందు వుంచుకొని వారి జీవిత

కాలములో మహత్తరమైన మార్పులను తెచ్చినట్టి శ్రీరామ, శ్రీకృష్ణ భగవానులు అట్టి విశిష్ట అవతారాలకు సరియైన దృష్టాంతరములు.

మానవుడు చేరవలసిన స్థాయి, ఈ అయిదు వృత్తములకు చాలా అతీతముగా వుంటున్నది. కేంద్రము, లేక శూన్యతా స్థితిని చేరుటకు మానవుడు అనేక అహంకార స్థితుల గుండా దాటి పోవలసి యున్నది. అహంకార దశలను పదకొండు వృత్తముల ద్వారా గురువుగారు "సత్యోదయ" మను గ్రంథములో సూచించి "సహజమార్గదృష్ట్యా రాజయోగప్రభావ"మను గ్రంథములో ఈ అహంకారమనుదానిని చక్కగా వివరించారు.

ఒక స్థాయిలో కాకున్నను, మరొక స్థాయిలోనైన అవరోధము కలిగించే మనోలక్షణంతో కూడి వుండేదే ఈ అహంకారం. గర్వము, పొగరు అనేవి దాని యొక్క స్థూలరూపాలు. అరాధనలలో కూడా ఈ అహంకారమనేది చాల ముఖ్యమైన పాత్ర ధరించి, పలుమారు అది ఆత్మవంచన చేస్తూ వుంటుంది. వాస్తవంలో వారివారి ఆరాధనలలో ఈ అహంకారమనేది దైవత్వమునకు ప్రత్యామ్నాయంగా చేస్తారు. ఒక వేళ వారు భగవంతుడిని ఆరాధించినప్పటికి, ఆయన్ను కేవలము తమవలెనే అను కొంటారు. యోగశక్తి ప్రసారితము ద్వారా పరిపూర్ణుడైన గురువు యొక్క సహాయము లేనిదే ఈ అహంకారం వివిద స్థితులను దాటడమనేది అసంభవము. ప్రపంచఖ్యాతి చెందిన కొంతమంది మహా పురుషులు, అహంకారమనేదే భగవంతుడని తికమకపడ్డారు. "నేనే సత్యము", "అహంబ్రహ్మాస్మి" మొదలగు మహావాక్యములు, గొప్పవేదాంతులను, సత్పు రుషులను గూడా గందరగోళము పట్టించాయి. సహజమార్గ ప్రవేశమునకు పూర్వము, అహంకారము యొక్క అతిసూక్ష్మస్థాయి నందుకొనుటయే మానవుడు పొందదగు అంతిమ స్థితియని, పరిగణింపబడు చుండెడిది. ఈ నిర్మలమైన, సత్వ అహంకార స్థితి తదుపరి, మానవుడు పొందదగినదేదియు లేదని ముగింపు చేసినట్లు కనబడుతుంది. కబీరు మహనీయుడు పదునైదవ వృత్తము వరకు చేరినట్లు చెప్పబడింది. ఆ స్థితి నందు కొన్న పిదప మానవుడు అడ్డతలముగా మాత్రమే వ్యాపకము చెందవలసి యున్నది. కొంత మంది మహనీయులు, యింకా కొంచెము లోతునకు చూచి, అంతకన్న ఉన్నత స్థితిలోనికి దూకుటకు ఎవరైనా ప్రయత్నము చేసిన యెడల, వారి భౌతిక దేహము భిన్నములై పోవునని గూడా హెచ్చరించినారు.

సహజమార్గ అంతిమ లక్ష్యము, అహంకార దశల కన్నింటికి చాలా అతీతంగా వుంది. కేంద్రము, దాని చుట్టూ ఏడు ప్రకాశవృత్తములతో కూడినదై యుండు కేంద్రప్రాంతమను దానిని మహర్షిచే కనిపెట్టబడినది, లేక పునః కనిపెట్టబడినది. ఈ ఏడు ప్రకాశవృత్తములను దాటి కేంద్రము యొక్క అనంతమగు మహాసముద్రములో యిప్పుడే, ఈ భౌతిక శరీరముతో నున్నప్పుడే ఈదులాడుటకు సాధ్యము కావింపబడ్డది.

సహజమార్గ పద్ధతి ద్వారా చేయబడిన మార్పులతో, రాజయోగ సాధన ద్వారా ఈ అత్యున్నతమైన స్థితులను ఎవడేని వాని జీవితకాలములోనే పొందనగును.

సాధారణంగా ప్రజలు జీవిత సమస్య విషయంగా తగినంత శ్రద్ధ తీసుకోవడము లేదు. అంతగా అయితే, జీవితంలో వారి కోర్కెలు ఈ డేర్చుకొన్నంత మాత్రముననో, లేక వారి ప్రాపంచిక అవసరాలను తీర్చుకొన్నంత మాత్రముననో వారు విజయము సాధించినట్లుగా అను కొంటారు. అయితే వెంటనే వారు నిరాశ, బాధ, కష్టము మొదలయినవి గూడా అనుభవిస్తూ, వారి కోర్కెలకు అంత్యమనేది లేదని కన్గొనుచున్నారు. క్లుప్తంగా, జీవితాన్ని గుఱించి వారికి పరిమితమైన, లేక సంకుచితమైన దృష్టి కలిగియున్నారు. వీటికన్నింటికి వెనక పని చేస్తూ వుండే వాస్తవిక కారణాలు వారికి పూర్తిగా తెలియవు.

ఒక వేళ కొంత మందికి ఈ కారణాలు చూచాయగా తెలిసినప్పటికి, వాటి యొక్క ఉనికికి గల "మూలకారణము"ను గుఱించి తెలుసు కోడానికి ప్రయత్నం వారు చేయరు. ఇందుకుగల కారణమేమనగా, వారి ఉనికిని గుఱించిన సూక్ష్మమైన, సున్నితమైన స్థితులలోనికి పోవుటకు చేత కానంతగా జడత్వమును అంతరంగంలో వారు పెంపు జేసుకొనుటయే. ఈ సంస్కారాలు, జడత్వము, అంధకారములన్నింటిని తొలగించుకొనుట, అత్యంత అవసరమై వున్నది. చింతనా శక్తిని సక్రమమైన పద్ధతిలో వుపయోగించి, వీటి నన్నింటిని తొలగించుటలో సహాయము చేయుటయే సహజమార్గము యొక్క ధ్యేయము. హృదయమును పవిత్రవంతముగా చేసి, వీలగునంత త్వరితముగా ఆ పరిపూర్ణమైన అంతిమ స్థాయిని పొందుటయే దీని లక్ష్యము.

# 8. ప్రాణాహుతి - దాని సిద్ధాంతము - అభ్యాసము

అంతిమ మూల మనేధి సర్వత్రా వ్యాపించి యుంది. వ్యక్తి గత జీవులు వారి చుట్టూ సూక్ష్మమైన, స్థూలమైన పొరలును వారే ఏర్పఱచుకొన్నారు. అన్యమనే భావన (వేరు అనే భావన) వల్ల అసమర్థత, దౌర్బల్యము, దిగజారడమనేవి ఏర్పడినాయి. పోరాటము పెనగులాట వుద్భవించినాయి. జడత్వము, సాంస్కారాలు, సృష్టికావడమనేది పోరాటానికి స్వభావలక్షణాలు. ఇచ్ఛాశక్తి వల్ల సంస్కారాలను, పొరలను, ఛేదించినవారు ఇతరులకు, వారు పోగొట్టుకొన్న దైవసామ్రాజ్యాన్ని మరల పొందుటలో సహాయము చేస్తారు. అట్టి వాని యొక్క ఇచ్ఛాశక్తి,మూలస్థానము నుండి నేఱుగా శక్తిని పొందుతుంది. ఆ శక్తిని వ్యక్తిగతంగా అతని అంతర్గతమందు ప్రసరింపజేసినప్పుడు అది పని జేస్తుంది.

మూలమందు కల్గిన ఒక కదలికయే సృష్టికి కారణము. సృష్టికి కారణ భూతమైన ఆ శక్తియే మానవునిలో చిత్(చింతన) అనే శక్తి రూపంలో వుండేది. మానవునిలోని అశక్తి, సాధారణంగా అధోముఖంగా మళ్ళింపబడుతుంది. దానిని ఊర్ధ్వముఖంగా కూడా మళ్ళించినప్పుడు, అతను వికసింపబడడము ప్రారంభ మవుతుంది. ఈ ఊర్ధ్వముఖంగా మళ్ళించడమనేది, ప్రాణాహుతి (యోగశక్తి ప్రసారితము) ద్వారా చాల సులభంగా వీలవుతుంది. అది క్షోభ లేక కదలిక యొక్క స్వచ్ఛమైనరూపము. ప్రాణాహుతి ప్రసారిత మనేది, మూల స్పందన యొక్క స్వచ్ఛమైన స్థితిని పునః పొందిన పటిష్ట ఇచ్ఛాశక్తి వల్లనే జరుగుతుంది

దివ్యత్వమును పొందిన వ్యక్తి, ఇచ్ఛ కలిగియున్నట్టి వానికే సహాయము చేస్తాడు. ఎవరైనా సరే తన స్వస్థితిని మరల పొందాలనే వుద్దేశ్యము కలిగినవారు ఈ ప్రాణాహుతి యొక్క వుపయోగాన్ని పొందవచ్చు. ఆ విధమైన కోరిక లేక ఇచ్ఛ అనేది భగవదనుగ్రహమును గ్రహించడానికి సహాయము చేస్తుంది. భగవంతునికి అర్పణ, దివ్యత్వము పొందిన గురువుతో సహకారము, సద్గురువునెడ ప్రేమ మొదలయినవన్ని ఈ గ్రహించే శక్తిని అభివృద్ధి చేసుకోడానికి పద్ధతులు. గ్రహించే అర్హత లేనప్పుడు ఎవరుగూడ ప్రసారితము చేయరు. శూన్యమునకు వుండే ఆకర్షణాశక్తిలాంటిదే ఈ గ్రహించేశక్తి. ఈ ప్రాణాహుతి లేక యోగశక్తి ప్రసారితమనేది భగవదనుగ్రహాన్ని గ్రాహకుని వైపుకు ప్రవహింప జేస్తుంది.

ప్రపంచములోని దాదపు అన్ని మత గ్రంధాలు ఈ భగవదను గ్రహాన్ని గుఱించి బహు విస్తారంగా తెలియజేసినాయి. "అనుగ్రహము"అనే పదములోనే ఏదో ఒక విధమయిన వూహకు అందని వ్యక్తి యొక్క చపలచిత్తము అనే భావనతో మిళితమై వున్నట్లు కనబడుతుంది. అన్వేషకుడైన ప్రతివాడు భగవదనుగ్రహము కొరకు మేరలేనంత కాలము ఇదివరలో కనిపెట్టుకొని యుండవలసివచ్చేది. ఇప్పుడు ఆ శక్తి పై అధీనత కల్గి దానిని స్వాధీనములోకి తెచ్చుకోడానికి మానవునికి సాధ్యము గావించిన సహజమార్గమునకు ధన్యవాదములు. అపేక్షకుడు అది పొందడానికి నిస్పృహాయుడై వేచియుండవలసిన అగత్యములేదు. ఇచ్ఛాశక్తి ద్వారా భగవదనుగ్రహమనే దానిని మళ్లించవచ్చు. ఈ యోగశక్తి ప్రసారితమను దానిని సహజమార్గములో అభ్యసిస్తున్నారు. శ్రీరాంచంద్ర మిషన్ యొక్క అభ్యాసులు, ప్రశిక్షకులు (ప్రిసెప్టర్లు) ప్రతి దినము దానిని అనుభవిస్తున్నారు, పరిశోధిస్తూ కూడా వున్నారు.

అంతర్ముఖంగా జడత్వము, సంస్కారాలు, మరియితర చిక్కులతో కూడిన ముడులన్నీ (గంధులు) ఏర్పడడమనేది తన యొక్క నిజప్రకృతిని గుఱించి తెలియని అజ్ఞానము మీద ఆధారపడి వుంటుందనేది ఒక వాస్తవికమైన సత్యము. నిజప్రకృతివల్ల అంతర్బుద్ధిని వికసింపజేసినప్పుడు తన గ్రంధులు విడివడి, సంస్కారాలు తొలగిపోయి జడత్వము కరిగిపోతుంది. ఒక దీపము మరొకదీపాన్ని వెలిగించినట్లు, ఈ పనిని ప్రాణాహుతి ద్వారా బహుసులభంగా చేయవచ్చు. అన్వేషకుని అంతర్‌బుద్ధిపై అతీంద్రియ జ్ఞానము ద్వారా మూలజ్ఞానము పని చేయ ప్రారంభమవుతుంది. అందువలననే కొంతకొంతమంది ఈ ప్రాణాహుతి సమయంలో దానిని గుఱించిన అనుభవము వారికి కలగడము లేదని అంటారు. అనుభవము లేక స్పర్శ అనేది సామాన్యమైన జ్ఞానానికి సంబంధించినది. ప్రాణాహుతిని గుఱించిన అనుభూతిని తెలుసు కోవలెనంటే సాధారణంగా కొంత కాలము పడుతుంది.

యోగపద్ధతుల ద్వారా ప్రాణాహుతిని అభ్యసించడమనేది కేవలము ఈ నాడు కనిపెట్టబడినది కాకపోయినప్పటికి, ప్రజలందరికి అందుబాటులో నుండునట్లు చేసిన ఖ్యాతి సహజమార్గమును స్థాపించిన వారికి చెందుతుంది. ఆధ్యాత్మికంగా గొప్ప సామర్థ్యముగల వ్యక్తి యొక్క సాన్నిధ్యము చేరిన కొందరు వ్యక్తుల జీవితములలో అఖండమైన మార్పులు కలిగినట్లు మనకు నిదర్శనాలు వున్నాయి.

ఉపనిషత్తులు మొదలయిన ప్రాచీన గ్రంథములలో దైవీక జ్ఞానమును, అన్వేషకుని హృదయమునందు గురువు కొన్ని యోగ పద్ధతుల ద్వారా ప్రసరింపజేసి .నట్లు తెలియజేయబడినాయి. ఈ ప్రాణాహుతి ప్రసారితమను దానికి ప్రసిద్ధమైన భగవద్గీత మనకు నిదర్శనము. శ్రీరామకృష్ణ పరమహంస గారి పాద సన్నిధి వద్ద స్వామి వివేకానందుల వారు చెందిన మార్పు, ప్రాణాహుతికి చరిత్రాత్మకమైన నిదర్శనము. సహజమార్గ స్థాపకులు, అధ్యక్షులు శ్రీరాంచంద్రజి మహరాజ్ తన సమర్థ గురువు యొక్క ప్రాణాహుతిని గ్రహించుకొన్నారు. ఈనాడు ప్రాణాహుతిని అభ్యాసము చేస్తూ వుండే సహజమార్గ శిష్యులందరూ దీనికి నిదర్శనములే.

ఈ ప్రాణాహుతి ఏవిధంగా కావింప బడుతుందనేది దురవగాహనము, మరియు మాటల ద్వారా మాటలతో వివరించడానికి వీలు లేనట్టిది. కొన్ని సూచనలను మాత్రము యివ్వవచ్చుగాని బహుశః అవన్ని ఉపమానాలు అలంకారాలుగా వుంటాయి. అ న్వేషకులకు, లేక అపేక్షకులకు, లేక యోగ సంబంధమయిన శిష్యులకు సహజమార్గ పద్ధతిన శిక్షణయివ్వడానికి గాను ప్రిసెప్టర్లకు, వారి గురువు కొన్ని పద్ధతులను బోధిస్తారు. ఎక్కువగా ఈ పద్ధతులు శిష్యునిలో కొన్ని మార్పులు లేక సర్దుబాట్లు చేయుటకు ఇచ్ఛాశక్తిని రూపొందించు నట్టివిగా వుంటాయి. ఈ ఇచ్ఛాశక్తి యనేది సూటిగా గ్రాహకుని కారణ శరీరమును స్పర్శించి దానిని మార్పు కావిస్తుంది. ఆ విధంగా తేజో బీజాన్ని మంచి సత్తాకల్గిన ప్రాంతమందు నాటబడుతుంది. చింతన యొక్క క్రియా విశేషము చేత దానికి నీరు పోయబడి క్రమేణా సౌందర్య వంతమైన తెల్లని పుష్పము వికసిస్తుంది. ముందు చెప్పినట్లు, గ్రాహకుని యొక్క సహకారము, లేక గ్రాహక శక్తి యనేది ఈ బీజాన్ని ఫలింపజేస్తుంది.

సహజమార్గము రాక ముందు, భగవదనుగ్రహము పొందు అర్హత కొరకు, చాలా దీర్ఘ కాలికమైన కష్టతరమైన, పద్ధతులను ఆచరించవలెనని సత్యాన్వేషకునికి బోధింపబడేది. ఆ పద్ధతులు చాల వరకు భౌతికానికి సంబంధించినవి. ఉదాహరణకు, దేహశుద్ధి, ప్రాణాయామ అభ్యాసము, దాన ధర్మములు, గ్రంధపఠన, భగవన్నామోచ్ఛారణ, విగ్రహారాధన మొదలయినవి. ప్రతి యొక్క దానిని అభ్యసించి దానిని ఒక అలవాటుగా చేసుకోడానికి దీర్ఘకాలము పడుతుంది. ఈ సద్గుణాలన్నింటిని వశము చేసుకొని ప్రావీణ్యత సంపాదించేప్పటికి వృద్ధాప్యము వచ్చి,

దైవకార్యము నెఱవేర్చడానికి ప్రాణాహుతిని సంపూర్ణంగా స్వీకరించలేదు. చాలా మార్లు, దీర్ఘకాలము భౌతికమైన సాధనలు యాంత్రికమైన పద్ధతిలో చేయుటవల్ల అంతరంగంలో జడత్వము, మందత్వము అభివృద్ధి చెంది భగవదనుగ్రహము ప్రసరించడానికి వసతి లేని విధంగా మార్గము మూయబడి, దేని కొరకు సాధనలన్నీ చేస్తున్నాడో అది విఫలము అవుతుంది. ప్రాచీన పద్ధతులను గుడ్డిగా ఆచరిస్తే ఉన్మాదము, మంకుపట్లు మొదలయినవి తప్ప వేరేమి పొందడు. సద్గుణములనేవి నిస్సందేహంగా మంచి విషయాలే, అయితే వాటిని గుఱించి తనలో విపరీతంగా పట్టించుకో కూడదు. ఆవిధంగా వుంటే అది విషంగా పని చేస్తుంది వాస్తవంలో వెఱ్ఱిభ్రమ, మంకుపట్టుదలయ్యే, గొప్ప సద్గుణములని ఎంతవరకు అనుకొంటూ వుంటాడో అంతమటుకు వక్రపద్ధతిలో వున్నట్లే అవుతుంది.

సహజమార్గ సాధనలో ప్రాణాహుతి సమర్థవంతముగా పనిచేయడానికి గాను అవసరమైన వైఖరులను మన ఎఱుకలేకనే అభివృద్ధి కావింపబడుతాయి. ఆధ్యాత్మికంగా అత్యుత్తమ స్థాయిలను ప్రాణాహుతివల్ల పొందుతున్నప్పటికి, అతనికి తన శక్తులను గుఱించి తెలియదు. మనఃస్ఫూర్తిగా దైవానికి అర్పణ చేసుకొన్నందున, కేవలము ఆయన ఆదేశానుసారము నడచువానిగ చేస్తుంది. భౌతికమైన ఏ సాధనలు గూడా అవసరము లేదు. సద్గుణాలను అబివృద్ధి చేసుకొనుటకు సహజమార్గము అటువంటివేమీ నిర్దేశించలేదు. సహజమార్గ పద్ధతిన ధ్యానసాధనవల్ల సరియైన వైఖరులు వాటంతటవే అభ్యాసిలో అభివృద్ధి కావింపబడుతాయి. ప్రాణాహుతివల్ల అంతరంలోని మాలిన్యాన్ని తొలగించి నిర్మలత్వం కావింప బడుతుంది. బహుస్వల్పకాలంలో, చాలా సహజ పద్ధతిన, లొంగనట్టి మనోవృత్తులను సక్రమమైన రీతిన, పద్ధతికి తీసుకొని రాబడుతాయి. చాల మందికి ఇవన్నీ నమ్మరానివిగ కనబడినప్పటికి, నిస్సందేహంగా ఇదంతా వాస్తవమే. అనుమానంగల వారు ఎవరైనా సరే, ఈ సాధనను త్రికరణ శుద్ధిగా చేసి పరీక్షించుకోవచ్చు.

ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి కావలెనన్న, వివేకము వైరాగ్యమనే రెండూ అవసరమైన నియమాలు. వివేక వైరాగ్యములను వాటిని ఆచరణలో పెట్టడానికి పద్ధతులు నిర్దేశింపబడినాయి. సహజమార్గపద్ధతి ననుసరించి వివేక వైరాగ్యముల కొరకు ప్రత్యేక సాధనలు అనవసరము. ఈ రెండు మనస్సు యొక్క స్థితులు.

ప్రాణాహుతి సహాయము వల్ల అభ్యాసిలో వాటంతటవే అభివృద్ధి చెందుతాయి. ఏది సత్యము ఏది అసత్యము అను ఈ రెండింటిని గుఱించిన విచక్షణ జీవిత పర్యంతము చేసిననూ వివేకమనబడు స్థితికి మనస్సును తీసుకొనిరాలేదు. అదేవిధంగా ప్రపంచముతో బంధరహితము కొరకు ఎంతగా సాధన చేసినప్పటికిని, నిజమైన వైరాగ్యమనబడు స్థితికి తీసుకొని రాలేదు. నిజములో వివేకము వైరాగ్యములనేవి సాధనా పద్ధతులు కావు. ప్రాణాహుతి ద్వారా అభ్యాసియైనవాడు "అంతిమ సత్యము"ను గుఱించిన గాఢమైన తలంపు తన మనస్సునందు కలుగజేసుకొన్నప్పుడు, వివేకము యొక్క తొలిస్థాయి నందు కొన్న వాడైనాడు. ఉత్సాహముతోను, శ్రద్ధతోను, లక్ష్యమును, వీలైనంతశీఘ్రముగ పొందవలెనని, మిగిలినవన్నింటిని నిర్లక్ష్యము చేయుచూ ప్రయత్నము చేస్తూ వున్నప్పుడు అతను వైరాగ్యము యొక్క తొలిస్థాయినందుకొన్న వాడైనాడు.

శరీరము నందు కొన్ని స్థానాలు వున్నాయి. ప్రాణాహుతి ద్వారా వాటిని నొక్కినప్పుడు అత్యద్భుతమైన ఆధ్యాత్మిక స్థితులు, మానవునిలో ఏర్పడుతాయి. ప్రాణాహుతి ద్వారా కాకుండా యితర పద్ధతుల ద్వారా ఈ విధమైన స్థితులను పొందవలెనన్న అనేక సంవత్సరముల కాలము అభ్యాసము చేయాలి. సహజమార్గ అభ్యాసకుల యొక్క అనుభవాలే పై తెలియజేసిన దానిని రుజువుచేస్తాయి. వ్యక్తిగతంగా అభ్యాసికి త్వరితంగా అభివృద్ధి జరగడానికి అవరోధములు, జాప్యము కల్గించునట్టి కొన్ని నిర్థిష్టమైన మనోవృత్తులు వుంటాయి. ప్రాణాహుతి ద్వారా ఈ విధమైన వృత్తులను ఒక్కక్షణంలో సరిదిద్దవచ్చు. ఈ మనోవృత్తులన్ని గూడా చింతన వల్ల అభివృద్ధి చెందుతాయి గనుక వాటిని సరిదిద్దడము గూడా ఈ చింతనా శక్తి వల్ల చేయబడుతుంది. ప్రాణాహుతి చేయువాని ఇచ్ఛతో అభ్యాసి యొక్క హృదయాన్ని జత చేర్చినప్పుడు ఈ విధంగా సరిదిద్దడమనే శక్తి ప్రాణాహుతి ద్వారా పొందనగును.

"అడిగిన తోడనే నీవు దానిని పొందనగును" లేక "నీవు తలుపు తట్టిన వెంటనే తెఱవబడును"అను మహనీయుల వాక్యములు అవివేకముతో కూడినవి కావు. వాస్తవములో అది ఎంత సులభమైయున్నదో, ప్రాణాహుతి యొక్క పద్ధతి ఆచరణలో కూడా అంత సులభమైయున్నది. శ్రీరాంచంద్రమిషన్ లోని ఏ ప్రిసెప్టరు వద్దకైనా పొండి. మీకు మీరే పరీక్షచేసుకొనండి. ప్రాణాహుతి యొక్క

పద్ధతి ఇంతవరకు సాధారణంగా అందుబాటులో లేనందున ఈ అనుమానము ప్రజలమనస్సులలోనికి జొరబడింది. భగవంతుడు అన్నిటికన్న సూక్ష్మము పవిత్రమైనవాడు. ఈ సిద్ధాంతముపైన సహజమార్గపద్ధతి ఆధారపడివుంది. సహజమార్గము యొక్క యోగశక్తి ప్రసారితములో బుద్ధిమాంద్యము, లేక స్థూల సంబంధమైన పరిణామాలకు తావు లేదు. ప్రాణాహుతి యొక్క తోడ్పాటుతో సులభమైన పద్ధతిలో ధ్యానము, అన్వేషకుడిని ఆధ్యాత్మికంగా వున్నత స్థాయిలకు బహు శీఘ్రగతిన బహుసులభంగా తీసుకొని పోతుంది. "కన్నీరు లేని యోగమ"ని శ్రీరాంచంద్రమిషన్ యొక్క ఒక మహనీయుడు గంభీరహాస్యధోరణిలో దానిని అన్నాడు.

ప్రాణహుతి శక్తి యనేది వాస్తవములో అత్యున్నతమైన యోగప్రాప్తి. స్వయం కృషివల్ల దానిని పొందడము అసలు అసంభవము కాక పోయినప్పటికి బహుకష్టమైనది. అయితే ఎవరైతే పొంది యున్నారో వారి వద్ద నుండి పొందవచ్చు. దానిని పొందడానికి మరల ప్రాణాహుతి ద్వారా మాత్రమే వీలున్నది. తక్కువ శ్రేణికి చెందిన శక్తులను పట్టుకొని పూసులాడే వారికిన్ని, గురువులమవుదామనే వుత్సాహముండే వారికిన్ని, అహంకార పూరితులగు వారికిన్ని దీనిని పొందుట అసాధ్యము. దీనిని కానుకగా పొందడానికి గురువు గారికి సంపూర్ణమైన అర్పణ గావించు కావడమనే దొక్కటే మార్గం. గురువుతో వాస్తవికమైన ఏకత్వము స్థిరపరచుకొనుటకుగాను అర్పణ కావించుకొన్నామనే ఎఱుక గూడా తొలగించుకోవాలి. అప్పుడు స్వాభావికంగా దానంతటదే గురువుగారిదంతయూ కూడ తనదే అవుతుంది. ఆధ్యాత్మిక రంగములో నిజమైన గురువు తన సహచరులను తనంత వానిగ చేయడానికి ఎల్లప్పుడు ఆతురతతో వుంటాడు. అభ్యాసి ఎప్పుడయితే తగిన అర్హత సంపాదించు కొంటాడో, సమర్థవంతుడైన గురువు ప్రాణాహుతి యొక్క శక్తిని ప్రసారితము చేసి యితరులకు గూడా ప్రాణాహుతి ద్వారా ఆధ్యాత్మిక శిక్షణ యిచ్చుటకు అనుమతి యిస్తాడు.

గురు శిష్యుల మధ్య వుండే సంబంధమనే వాస్తవిక సత్యముపైన ఈ ప్రాణాహుతి యొక్క సిద్ధాంతము, ఆచరణలనేవి ఆధారపడివుంటాయి. దైవీకమైన ప్రేరణలను అభ్యాసికి కలుగజేయుటలో గురువు తన ధ్యాసను కేంద్రీకరిస్తాడు. సాధారణంగా, మానవుడు భగవంతునితో సూటిగా సంబంధము కలుగ జేసుకొను స్థాయి నందుకొన్నప్పుడు, యిక అతను ఇటుఅటు చూడడు. గురువస్థానం

పొందాలనిగాని, మామూలుగా అనుకొనునట్లు యితరులకు సహాయము చేయవలెననే తలంపుగాని, లేక తాను యితరుల కన్న శ్రేష్ఠమైన వాడనిగాని అనుకోవడము, నిజమైన గురువుకు అసాధ్యమైన పనిగా వుంటుంది. అలాంటప్పుడు అభ్యాసికి ఏవిధంగా ప్రసారితము చేయగలడు? ఇచ్చట మరల ఒకమర్మముంది. మానవకోటికి సేవచేయవలసిందిగా అట్టి మహావ్యక్తికి "పై" నుండి ఆదేశాలు వస్తాయి. ఆ విధంగా వచ్చే ఆదేశాలతో పాటు, కార్యమును నెఱవేర్చడానికి తగిన శక్తులన్ని, వాటంతట అవే అతనికి వస్తాయి. ఆవిధంగా ఆదేశింపబడినవాడే యోగశక్తిని ప్రసారితము చేయగలడు గాని, మరొకని వల్ల వీలుకాదు. దైవనిర్ణయము ప్రకారము ఎవరికయితే అట్టిపనిని అప్పగించబడినదో, అట్టివాడు తనకు ఉచితమని తోచిన రీతిగా కార్యమును నెరవేర్చడానికి స్వేచ్ఛగలిగి యుంటాడు. అనగా చేయవలసిన కార్యమును గుఱించి తగిన పద్ధతులను అవలంబించడానికి స్వేచ్ఛ గలిగి యుంటాడు. కార్యము నెఱవేర్చడానికి వినాశము, నిర్మాణము అను రెండిటితో కూడి వుంది. గనుక ప్రకృతి యొక్క వినాశకరమగు శక్తులు, నిర్మాణాత్మకమైన శక్తులు అట్టి సమర్థుని స్వాధీనమందు వుండి, అప్పగించబడిన కార్యమును నెఱవేర్చడానికి వాటిని వుపయోగించుట యందు స్వేచ్ఛ గల్గియుంటాడు. మన మధ్యలో అట్టి విశిష్ఠ వ్యక్తి ఒకడు వుండి, ప్రకృతికి కావలసిన విధముగా కార్యములను నెఱవేరుస్తున్నాడని బాబూజీ కొన్ని రచనల ద్వారా సూచించాడు. ఆ ప్రత్యేక వ్యక్తి తనకు వుచిత మనితోచిన రీతిగ ప్రకృతి యొక్క సర్వ శక్తులను వుపయోగించడానికి పరిపూర్ణ స్వాతంత్ర్యము కలిగి యున్నాడు.

ప్రకృతి యనేది ఒక ఆశ్చర్యమును గొలిపే కర్మాగారము. ఈ భౌతిక ప్రపంచానికి అతీతంగా పనిచేస్తూ వుండే తత్వ ప్రపంచము వుంది.ఆ ప్రపంచాన్ని, ఈ ప్రపంచధోరణి రీత్యా వివరించడమనేది దాదాపు అసంభవము. అయినప్పటికి, దానికి దీనికి మధ్య సామ్యమనేది వుంది. ఇంతవరకు ఈ సామ్యమనేదానిని, ఈ ప్రపంచమును నిర్మలము చేసి, తద్వారా పవిత్రమైన, దివ్యమైన ప్రపంచాలను పొందడానికి ఉపయోగింపబడుతూ వుండేది. ప్రాణాహుతి ద్వారా దివ్య ప్రపంచాన్ని యిప్పుడు నేరుగా అందుబాటులో నుండునట్లు సహజమార్గముచే కన్గొనబడినందుకు ధన్యవాదములు. ఆధ్యాత్మిక యాత్రలో దీర్ఘతరమైన, కష్టతరమైన, విసుగు పుట్టించునట్టివి, కొన్ని మార్లు ఆత్మవంచనగాఏర్పడు పద్ధతులు ఇప్పుడు యేమాత్రము

అవసరము లేదు. ప్రాణాహుతి సహాయము ద్వారా నేఱుగా, ఈ యాత్రను చేబట్టి, కావలెనన్న బహుశీఘ్రగతిన సులభముగను, నిరపాయముగను పూర్తి చేయవచ్చును. ఏవిధమయిన బాధగాని, అపాయముగాని లేకుండా, మార్గమధ్య మందు వుండే సుడులను, గుండములను బహుచమత్కారంగా తొలగించుకొని దాటిపోవచ్చు.

ఆధ్యాత్మికత యొక్క ఉన్నత స్థితులలో ప్రాణాహుతి యొక్క సహాయము తప్పనిసరియైయుంటున్నది. ఉన్నతమైన స్థితులనేవి, స్వయంకృషి వల్ల మానవుడిని అనుమతించనంత బహు సున్నితము, సూక్ష్మముగను వుంటాయి. అవి నిలకడలేని జాఱువాలుగా కూడా వుంటాయి. అచ్చట ప్రతిక్షణము క్రిందికి దిగజారడానికి ఆస్పదమువుంది. అట్టి స్థితియందు ప్రాణాహుతి యొక్క సహాయము చేతనే నిలబడగల్గి, పై ఉన్నత స్థితుల నందు కోడానికి వీలవుతుంది. ఆ స్థాయిలలో ప్రాణాహుతి యొక్క పద్ధతి గూడా చాలా నాజూకుగా వుంటుంది. వాస్తవంలో, అంతర్ముఖంగా మూలమునుండి నేరుగా ప్రాణాహుతిని స్వీకరింపబడుతుంది. ప్రాణాహుతిని ప్రసరింపచేయువాని యొక్క అంతిమ స్థితిని తన హృదయములోనే అనుభవిస్తూ, ప్రాణాహుతిని నేఱుగా మూలస్థానము నుండి అంతర్ముఖంగా పొందుతూ వుంటాడు. ఈ విషయాన్ని గుఱించి యింకా విపులంగా చెప్పిన యెడల గందరగోళము పెట్టే అవకాశము వుంది. భక్తుడు, బోధకుడు, భగవంతుడు అను వాటి మధ్య వుండే బేధములను గుఱించిన తలంపులన్ని, అంతర్ధానమవునని చెప్పిన చాలు. ప్రాణాహుతి చేతనే, తన ఉనికికి ఆధారమగు కేంద్రప్రాంతమందు ప్రవేశిస్తాడు. అచ్చట పూజ, ఆరాధన, లేక ఏ పద్ధతేగాని ఉపయోగపడవు. సమస్తమురాలిపోతుంది. నిర్మాణమంతా కూలిపోతుంది. ప్రాణాహుతి యనేది లేకపోతే, అట్టి ఉన్నత స్థితులలో తాను, తుత్తునకలుగా ఛేదింపబడు ఆస్పదము గూడ వుంది.

అందువల్లనే మానవుని యొక్క ఉన్నత స్థితియనేది యింతవరకు అహంకారము యొక్క బహుసూక్ష్మాతి సూక్ష్మమైన స్థితి వరకే పరిమితియైవున్నది. మానవుడు పొందవలసిన అతీతస్థితులు, యింకా ఎన్నో ఉన్నప్పటికి, అహంకారము యొక్క ఆ కొంచెము పేలిక ముక్కను గూడా, ఈ శరీరముతో జీవించియున్నప్పుడే కరిగిపోయేట్లు చేసుకోవలెనంటే, ప్రాణాహుతి అనేది లేనిదే అసంభవము. ప్రాణాహుతి

ఆచరణవల్ల ఉనికి యొక్క ఉన్నతస్థితులను పొందుటకు చాల సులభతరము చేయబడింది. సురక్షితముగా, తేజోమండలము నందు ప్రవేశించి, ఇంకనూ ఏడు ప్రకాశవృత్తములను దాటి, కేంద్రము యొక్క అనంతమగు మహాసముద్రములో, ప్రాణాహుతి ద్వారా, ఈ భౌతిక దేహమందు జీవించి యున్నప్పుడే ఈదులాడుట మొదలు పెట్టవచ్చు.

"మానవుని పరివర్తనకు దైవశక్తిని వినియోగించడమే ప్రాణాహుతి"

-- బాబూజి

"బాధలు కష్టాలు మానవుల కొరకు నిర్ధేవింప బడినవేగాని జంతువులకు కావు"

-- బాబూజి

"దైవచింతనతో వుండు వానిని ఎవరో ఒకరు కాపాడుతారు.
ఇంద్రియాలకులోనై వున్నప్పడు, ఇంద్రియాలు తప్ప మరెవ్వరు కాపాడరు"

-- బాబూజి

# 9. ఆధ్యాత్మికోన్నతి యొక్క స్థితులు

మూలమందు గల్గిన ఒక క్షోభయే ఈ సృషికి కారణము. సృష్టి సమయ మందు మానవుడు ఏ స్థితిని కలిగి యుండెనో, ఆ స్థితిని పొందుటయే మానవ సాధ్యమగు మహోన్నత స్థితి. ఆ విధమైన క్షోభ, లేక విజృంభణ, లేక ఒక విధమైన గొప్ప ప్రేరణ కలిగిన వెంటనే, దైవీకమైన శక్తులు లేక కంపనములు ప్రవహించడము ప్రాంభమయినాయి. ఈ ప్రవహించిన శక్తులు అసంఖ్యాకములైన ఆకృతులు, రూపాలు దాల్చినాయి. అపసవ్యములు, సంస్కారములు, గ్రంధులు ఏర్పడడమనేవి శక్తులు ప్రవహించడము వల్ల కల్గిన సహజ ఫలితాలు. ప్రవాహమనేది అధోముఖంగా వుండడమనేది ప్రకృతి లక్షణము, అనగా ఎత్తునుండి పల్లమునకు ప్రవహించడము, లేదా, సూక్ష్మస్థితి నుండి స్థూలస్థితికి ప్రవహించడము.

ఆదిలో కలిగిన ఆకదలిక యొక్క శక్తిని, సృష్టింపబడినవన్ని పంచుకొన్నాయి. మానవుడు, కేంద్రము లేక మూలము అను దానితో ఎక్కువగా సంబంధము కలిగి వున్నాడు గాన, అతనికి అన్నింటికన్న పెద్ద భాగము వచ్చింది. అతని లో గూడ ఆ సృష్టిచేయు శక్తి పని చేసి, గ్రంధులు, సంస్కారాలు, జడత్వము రూపొందినాయి. అయితే, మానవుని యొక్క అంతర్ నిర్మాణము భగవంతుని సృష్టికి వ్యతిరేకమైన ధోరణిలో వుంది. తత్ఫలితమైన పోరాటము తనలోని సంస్కారాలను విపరీతమైన నడవడికను హెచ్చుచేయడానికి సహాయపడింది. ఆదిలో కల్గిన క్షోభ యొక్క శక్తి ప్రవాహము సంపూర్ణంగా తఱిగిపోయినప్పుడు, భగవంతుని యొక్క ఈ సృష్టి నాటకమంతా గూడా అంతరిస్తుంది. ఈ స్థితిని అంతిమలయ, లేక మహాప్రళయమంటారు. అదేవిధంగా మానవుడు తన చింతనాశక్తిని తన చిన్న సృష్టి నుండి తొలగించుట ద్వారా ఈ చిన్న సృష్టిని, లయింప చేయవచ్చు. దీనిని వ్యక్తి గత ప్రళయమని లేక వ్యక్తి యొక్క ప్రళయమని అంటారు. అటు తర్వాత ఏమి మిగిలి వుంటుంది? ఏదైతే స్వతః సిద్ధమై వున్నదో అదే వుండేది.

మానవుని యొక్క చింతనను తన చిన్న సృష్టి నుండి పారద్రోలడమనేది కొన్ని నిర్ణీత యోగ పద్ధతుల ద్వారా చేయవచ్చు. దీనిఫలితమేమంటే అతని యాత్ర అతని యొక్క "మూలము" వైపుకు మళ్ళి, కొనసాగడము ప్రారంభమవుతుంది. ఉన్నత స్థితులనేవి అన్నియూ తన యొక్క ప్రస్తుత జడత్వ స్థితికిని, తన యొక్క 'మూల'

స్థితికిని మధ్యన వుండునట్టివియే. తీవ్ర ఇచ్ఛను కలుగజేసుకొని మానవజీవన లక్ష్యమును పొందవలెనని, నమ్మకముతోను విశ్వాసముతోను తీర్మానించుకొన్నప్పుడు, అతను అప్పుడే ఒక ఉన్నత స్థితిలోనికి వచ్చిన వాడవు తాడు.

జీవన నాటకానికి యావత్తు హృదయ ప్రాంతమనేది రంగస్థళం. హృదయ మనే దాన్ని రెండు భాగాలుగా విభజింపవచ్చు. ఒకటి పైభాగము లేక తేజోమయ మైన బాగము, మరొకటి క్రిందిభాగము లేక తేజోరహితమైన భాగము. ఆధ్యాత్మిక మార్గాన్ని చేబట్టిన వ్యక్తి యొక్క యాత్ర హృదయములోని పైభాగములో మొదలవుతుంది. విశ్వవ్యాప్తంగా "దివ్యతేజస్సు" సంచరిస్తున్నదని గాని లేక ప్రతి అణువులో నుండి దివ్య తేజస్సు వెలువడుతున్నదనే అనుభవము అతనికి ఏర్పడుతుంది. హృదయ ప్రాంతము యొక్క అతీంద్రియ జ్ఞానము గూడా చైతన్యవంతము గావింపబడుతుంది. హృదయ ప్రాంతములోని మొదటి స్థానములో యాత్ర పూర్తి అగుటకు అనేక సంవత్సరాల కాలము పట్టవచ్చు. అయితే ప్రాణాహుతి యొక్క సహాయము చేత కోరినంత త్వరిత గతిన యాత్ర పూర్తి చేసుకోవచ్చు. ఆ స్థానము యొక్క స్థితిలో లయించినప్పుడు, లేక దానితో ఏకత్వము పొందినప్పుడు అభ్యాసి, హృదయ ప్రాంతములోని మరొక స్థానము యొక్క కుడివైపున, ఆత్మ పీఠమని పిలువబడుదాని యొద్దకు పురోగమించవచ్చు. "పరమశాంతి" లేక నిశ్శబ్దము లేక బ్రహ్మానందమనునవి ఈ స్థానానికి లక్షణాలు. శ్రీరాంచంద్రమిషన్ వారు ప్రచురించిన "అనంత యాత్ర"(అనంతాభిముఖము), (To wards Infinity) తదితర ప్రచురణలు, వేదాంత గ్రంధములలో ఇంకా మిగిలిన కేంద్ర స్థానాలను గురించి విపులంగా తెలియజేయబడినాయి.

ఒక స్థాయినుండి మరొక ఉన్నత మైన స్థాయిని పొందుస్థితిలో అత్యంత అశాంతి, బాధతో నిండివుంటుంది. అయినప్పటికిని, ఈ బాధ అనేది చాలా మధురంగాను, స్వీకరింపదగినట్టి దిగను వుంటుంది. ఈ అశాంతి దాటిన తర్వాత, పోల్చుకో దగిన శాంతి, పరమానంద స్థితి కలుగు తుంది. దివ్య వ్యాపకము, పరమ శాంతి, అభిన్నత్వము, అద్వైత స్థితి అనే కొన్ని దైవీక స్థితులన్నియు, సూక్ష్మాతి సూక్ష్మ రూపాలలో మరల మరల పొందుతూ వుంటాడు. వీటితోపాటు ఈ ప్రపంచాన్ని గురించిన అనుభవాలు క్రమేణా మరుగున పడిపోతూవుంటాయి. అనగా, ప్రపంచవాసనల యొక్క సంస్కారములను హృదయము గ్రహించదని అర్థము.

ఉన్నత స్థాయిలలో మానవుడు ప్రాపంచిక కార్యకలాపాలతో కూడా వుంటాడనేది సందేహం లేదు. వాస్తవంలో అతను చాలా సామాన్యంగానే వుంటాడు. అయితే అతనికి ప్రపంచముతో బంధములు సడలిపోయి, ఇంకా ఉన్నత స్థాయిలలో దానితో బంధము తెగిపోయినట్లు భావిస్తాడు. ప్రపంచములోని కార్యకలాపాలన్ని చేస్తూ వున్నప్పటికి, ఏవిధంగా యివన్ని తాను చేయగలుగుతున్నానే ఆశ్చర్యంతో కూడిన స్థితిలో వుంటాడు. మరెవరో ఇంకొకరు వాటిని చేస్తున్నాడనే భావనతో వుంటాడు.

దేహభ్రాంతి అతీతస్థితి నందు కొన్నప్పుడు, తన దేహమే మరొకని దేహమనే భావన గల్గి వుంటాడు. స్వాత్మ జ్ఞానము కన్న అతీత స్థితి నందుకొన్నప్పుడు, తనను తాను పోగొట్టు కొన్నట్లుగా బావిస్తాడు. అసలు ఈ జ్ఞానమనే దానికే అతీతమైనప్పుడు, యిక తాను అనేవాడే లేకుండా అయిపోయి, అతని మూల స్థానమగు "అదే" యిక మిగిలియుండేది. ఇప్పుడు అతను కేంద్ర ప్రాంతములో ఈదులాడుతూ వున్నాడు.

యోగమందు స్థిరపడిన వానికి, అతను దేనిలోనైతే ఐక్యమయివుంటాడో దాని యొక్క సంపూర్ణ సారమంతా దానంతట అదే అతనికి ప్రాప్తిస్తుంది. ఈ ఐక్యత లేక సంబంధమనేది చింతన ద్వారా అభివృద్ధి చెందుతుంది. మొట్టమొదటి సారిగా చూచినప్పుడు, బాహ్యరూపమేదృష్టికి అందుతుందనేది ప్రతిరోజు అనుభవములో వుండే విషయమే. కొంచెము లోతుగా పరిశీలించినప్పుడు, దాని యొక్క లక్షణాలు ఎఱుకలోనికి వస్తాయి. ఈ పరిశీలన ఇంకా చేసినప్పుడు, దాని యొక్క సూక్ష్మరూపమే దృష్టిలో నిలబడి, యింకా పరిశీలన జరిపి నప్పుడు కేవలము భావన మాత్రము మిగిలియుంటుంది. అనగా పరిశీలకుని జ్ఞానము యొక్క లోపలి పొరలను మార్పుగావించబడి, చైతన్యవంతము చేయబడి, చివరకు ఐక్యత అనేది గావించబడుతుందని అర్థము. ఈ పద్ధతినే స్పష్టంగా మానవ రూపంలో కనబడే దివ్యపురుషునికి గూడ అన్వయింపజేస్తే, 'దానితో' ఐక్యత పొందడానికిపురోగమిస్తూ వుంటాడు. సహజమార్గములో ప్రాణాహుతి ద్వారా ఈ పద్ధతినే చాల శీఘ్రతరము చేయబడుతుంది.

ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయిలనేవి ఉనికి యొక్క సూక్ష్మాతి సూక్ష్మమైన స్థితియే తప్ప మరేమి కాదు. పొందినట్టి ఉన్నత స్థితి ననుసరించి వాని యొక్క ఆలోచన, పటిష్టమవుతూ వుంటుంది. సమర్థవంతుడైన గురువు, ఈ పటిష్టమవుతూ

వుండే శక్తిని యింకా ఉన్నతమైన ఉనికిలోనికి అభ్యాసిని నెట్టుటకు గాను మళ్లిస్తాడు. ఉన్నతమైన స్థాయిలలో అచ్చటి స్థితి చాల జారుడుగవుండి, ప్రతిక్షణము దిగజారి పోయేట్లుగా వుండడము వల్ల, ఉన్నత స్థాయిలలో సమర్థవంతుడైన గురువు యొక్క సహాయము అత్యంత అవసరమై వుంటుంది. చింతనకు వుండే శక్తి అపారమైనది గనుక, ఏవో కొన్ని అవివేకమైన కోర్కెలను తీర్చుకొనే నిమిత్తము ఆశక్తిని ఉపయోగించాలనే ఆకాంక్షను నిగ్రహింపలేనట్టిదిగా వుంటుంది. అట్టి శక్తులు కేవలము భగవంతుని కొరకు, లేక దైవీక కార్యములకు మాత్రమే వుద్దేశింపబడినవి గనుక, సమర్థవంతుడైన గురువు మాత్రమే వాటిని నైపుణ్యంతో వుపయోగించగలడు. గనుక భగవంతుని ఇచ్ఛకు సంపూర్ణంగా అర్పణ గావించుకొని, ఆ శక్తులను గుఱించిన ఎఱుక లేకుండా, వాటి విషయం తాను పట్టించుకోకుండా వుండడమనేది అన్వేషకునికి ఎల్లప్పుడు ఉపయోగంగా వుంటుంది.

మానవుని చిత్‌శక్తి వాస్తవంలో చాల గొప్పది. భౌతిక ప్రపంచాన్ని మానవుడు గమనించడము మొదలు పెట్టినప్పుడు, ఈ భౌతిక ప్రపంచమే సర్వస్వమని అనిపించేటంత పటిష్ఠంగా అతని జ్ఞానము వ్యాపకం చెందుతుంది. ఎప్పుడయితే అతను తన చిత్‌శక్తిని గమనించినప్పుడు, ఈ సర్వ ప్రకృతి తన "చిత్" మాత్రమేననే నిర్ణయానికి వస్తాడు. తన చింతన యొక్క ప్రతి అంశము గూడా బహువిస్తారంగా వ్యాపకం చెందుతూ వుంటుంది. సహజమార్గములో తన "చిత్" ఆ "మూలము'’తో సంబంధము కలిగి వుండేట్లు చేయబడుతుంది. గనుక అంతిమ "గమ్యము'’ను చేరేవరకు ఏ స్థితిలో గూడా పురోభివృద్ధి జరుగకుండా నిలబడిపోవడము గాని లేక పురోభి వృద్ధి జరగకుండానే వ్యాపకము చెందడముగాని అనుమతింపబడదు. అయినప్పటికి, ఎప్పుడయినా ఒకసారి దృష్టిపాటించినప్పుడు, ఇక ఉన్నత స్థాయికి పోవడానికి గూడ ఇచ్ఛ పడనంత ఆకర్షణీయమైన తేజోమయమండలము యొక్క ప్రకాశము లేక వెలుగును గమనిస్తాడు. అట్టి సమయాలలో అతని చింతనను అవసరమైన మార్గము వైపుకు మళ్ళించడానికి, సమర్థవంతుడైన గురు సహాయము అత్యంత అవసరమై వుంటుంది. గనుక అంతిమ గమ్యము కొరకు, ఎంతగానో పొగడబడుతూ, అపేక్షించబడే "సచ్చిదానంద"మనే దాన్ని గూడా త్యజించబడుతుంది.

"సచ్చిదానందము"అనే దానికన్న అతీతమైన స్థితిని పొందే వుద్దేశాన్ని ప్రజలు సమ్మతించకపోవచ్చు. సామాన్యంగా వారు సచ్చిదానందము యొక్క గొప్పస్థితితో

తృప్తి పడతారు. అయితే సహజమార్గమును కనిపెట్టిన వారి యొక్క పరిశోధనల వల్ల ఒక క్రొత్త అధ్యాయం తెలుపబడింది. ఎవరికిష్టమున్ననూ లేకున్నను అంతిమస్థాయి యనేది, సచ్చిదానందమనేదానికి చాలా అతీతంగా వుంది. ఏ స్థితియందు, వున్నదనిగాని, లేదనిగాని, జ్ఞానముగాని, అజ్ఞానముగాని, ఆనందముగాని దుఃఖముగాని వుండవో అట్టి స్థితిని, ఏ పద్ధతి ద్వారానైనా సరే ఎవడేగాని పొందినప్పుడు, తన శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోయబడుటకైనా అంగీకరిస్తాడు గాని ఆ స్థితిని వదలు కోవడానికి మాత్రం అంగీకరించడు.

సామాన్యుల జీవితాలలో, తమ భద్రతను గూడా లేఖ చేయకుండా తీవ్రమైన, విచిత్రమైన, పటిష్టమైన భావ ప్రేరణ వల్ల మానవుడు కొన్ని ఘనకార్యాలు చేసిన ఉదాహరణలు తెలియవస్తూవుంటాయి. తన ప్రాణాన్ని కూడా లక్ష్యము చేయక ఇతరుల ప్రాణాలను రక్షించినప్పుడు అతడిని దైవసమానంగా చూడబడి అమరజీవిగా ఎంచబడతాడు. ఆ విధమైన ప్రేరణ ఎక్కడి నుండి వచ్చినది? మానవునిలో కొన్ని నిర్ణీతమైన శక్తి సామర్థ్యాలున్నాయనేది ఈ ఉదాహరణలు స్పష్టంగా తెలియజేస్తాయి. మత ప్రవక్తల యొక్క శ్లాఘనీయమైన పనులు, గొప్పబుద్ధిని కలుగజేయు భగద్భక్తుల పలుకులు, స్వలాభాపేక్షరహితమైన, గొప్పవారి సేవలు మొదలయినవన్ని, మానవునిలో కొంత ఉన్నతమైన శక్తి వున్నదని నిరూపణ చేయడానికి ఉదాహరణలు. సామాన్య మానవునిలో ఆశక్తులన్ని నిద్రావస్థలో వుంటాయి. అతనిలో వుండే శక్తులన్ని తేజోవంతము కావింప బడుతాయి. ఇక జీవితమనే నాటకంలో అతను నిస్సహాయుడైన ప్రేక్షకుడుగనో, లేక నిర్జీవమైన బొమ్మగనో యిక ఏమాత్రము వుండడు. ప్రకృతియనే ఈ గొప్ప కర్మాగారంలో, తగిన స్థానం వహించడానికి నిజమైన స్వేచ్ఛ గల్గియుంటాడు.

సహజమార్గములో పురోగమించేటప్పుడు, వివిద రకాలైన సమాధి స్థితుల గుండా దాటి పోతూ వుంటాడు. ఏదో ఒక పవిత్రమైన ఆలోచనలో మునిగి యున్నట్లు దాదాపు ప్రారంభకుల కందరికి అనుభవము ఏర్పడుతుంది. అంతిమ స్థితియనేది సహజసమాధి, లేక సహజ మనో నిశ్చలతయే. ఈ స్థితిలో మానవుడు ప్రాపంచిక వ్యవహారాలతో పూర్తిగ సంబంధమున్నప్పటికి, అతను మాత్రం భగవంతునిలో సంపూర్ణంగా ఐక్యమయివుంటాడు. బాహ్యానికి అతను సామాన్య మానవుడుగనే కన్పిస్తాడు, అయితే అతని అంతర్ స్థితి మాత్రం దైవీక స్థితియే, లేక పూర్ణత్వమే. దైవలక్షణాలగు సర్వ శక్తిత్వము, సర్వవ్యాపకత్వము, సర్వ జ్ఞత్వము

అతనివిగా వుంటాయి, అయినా అతని లక్షణాలను గుఱించినఎఱుకకు అతను అతీతంగా వుంటాడు. దీనిని పరిపూర్ణ అజ్ఞానస్థితియని అనవచ్చు. అతను చాల చిన్న పిల్లవాని మోస్తరుగ యింపుగా వుంటాడు, తనే అతనని కన్గొంటాడు. అతని ప్రేమకు ఎట్టి హద్దులు లేకుండా సర్వత్రా వ్యాపించి యుంటుంది. క్లుప్తంగా అతను అన్ని విధములైన పరిమితుల నుండి విడివడి అనంతమును పొందినవాడు.

అంతిమ స్థితి యొక్క పరిపూర్ణ నిర్మలత్వమును గుఱించిన తలంపే ప్రజలలో పవిత్రతను అభివృద్ధి చేసుకోడానికి దారి చూపించింది. తత్ఫలితంగా దేహము, మనస్సు మొదలయిన వాటిని పవిత్రము చేసుకొను పద్ధతులను అభివృద్ధి చేసుకొంటారు. ఈ పద్ధతులు చాల విసుగు పుట్టించేవిగను, దీర్ఘకాలయాపనతోను వుంటూ వున్నాయి. చాల మార్లు ఏదో ఒక స్థితిలో స్థంభించి పోతాయి. సహజమార్గంలో ప్రాణాహుతి యొక్క ప్రభావము అతని హృదయాంతర్గతములోనికి, లేక అతని కారణశరీరమునకునేఱుగా తాకుతుంది. కేంద్రభాగములో అవసరమయినట్లు పరిశుద్ధం కావించడము, దివ్యతేజస్సును ప్రవేశపెట్టడము జరుగుతుంది. ధ్యాన సాధనవల్ల ఆ ప్రభావము బహిర్ముఖంగా వృద్ధి చెందడానికి తోడ్పడుతుంది. క్రమేణా స్థూల, సూక్ష్మ కారణ శరీరాలు గూడా ప్రభావితములవుతాయి. చివరకు తనలోని ప్రతి అణువు గూడా శక్తి పూరితమై, దివ్యత్వముగా మారుతుంది. భగవంతుని అనుగ్రహము క్రిందికి తరలి రావడానికి, అన్వేషకుడు ఉన్నత స్థితిని చేరుకోవలసి వచ్చినప్పుడు, అట్టి ఉన్నత స్థితిని సహజమార్గ పద్ధతిలో ప్రాణాహుతి ద్వారా భగవదనుగ్రహాన్ని మొదటి నుండి కలుగజేయబడుతుంది.

అన్వేషకుడు తన అంతిమమునకు పరిణామము చెందడమే మహోన్నత స్థితి కావున, యిదే సహజమార్గములోని లక్ష్యము. ఈ ఉద్దేశము పొందవీలు కానట్టిది కాదు, మరియు ఊహాకల్పితము కాదు. సహజమార్గ గురువు గారి ప్రతిభావంతమైన శిక్షణలో అభ్యాసము చేసిన వారు ప్రత్యక్షంగా పొందినట్టిదే. అపూర్వముగా కన్గొనబడిన, లేక, పునఃకన్గొన బడినట్టిదీ ప్రాణాహుతియను సిద్ధాంతము. మార్గమును సున్నితముగను సహజముగను చేసినట్టి దీనిని, ప్రత్యక్షముగ అనుభవించిననే గాని నమ్మశక్యము కానంత సులభముగా చేసినది.

# 10. అభ్యాసి యొక్క జీవితము

అభ్యాసులుగా వుండడము వల్లనూ, మరియు సహజమార్గంలో వుండడము చేతను, సహజమార్గ అభ్యాసులు రెండు విధాల అనుగ్రహింప బడినవారైనారు. వాస్తవిక స్వాతంత్రపు త్రోవలో వున్నాడనే దానికి సహజమార్గంలోని నిజమైన విద్యార్థి ఒక ఆదర్శంగా వుంటాడు. సహజమార్గంలో అడుగు పెట్టగానే ఒక నూతనమైన స్వేచ్ఛావాయువును, తేలికదనాన్ని అనుభవించడం అతనికి మొదలవుతుంది. అతని చిత్శక్తి, ప్రాణాహుతి ప్రభావం వల్ల అంతిమ లక్ష్యమగు భగవంతునితో లేదా అంతిమ స్థాయితో సంపూర్ణ ఐక్యత పొందడానికే పని చేస్తుంది.

అసంఖ్యాకంగా శారీరక, నైతిక కట్టుబాట్లను ప్రవేశపెట్టినందువలన అంతులేని విమర్శనలకు దారితీసినాయి. మరియు స్వాతంత్ర్యము, విశ్వప్రేమ మఱియు ఏకాంత జీవనము మొదలగు వాటికి, ఈ కట్టుబాట్లను నైపుణ్యంతో వుపయోగించు కొనుచూ అసలు నియమబద్ధంగా వుడడానికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వకపోగా, మరొకరి స్వేచ్ఛపైన ఏదో ఒక విధమైన కట్టు బాట్లను పెడుతుంది. సహజమార్గ అభ్యాసములో పరిపూర్ణనితో సంబంధము కలిగి వుండడానికి పటిష్టమైన ఇచ్ఛను అభ్యాసిలో చొప్పించడము ద్వారా ఈ విధమైన ఘర్షణను నివారింప బడుతుంది. ధార్మిక, నైతిక జీవన పద్ధతులు, కీలు బొమ్మలుగా తయారుచేయడానికి కాదు. నైతిక జీవనములో, అంతిమస్థితి యొక్క ప్రతిబింబాన్ని చూడగల్గుచున్నందున, అట్టి ధార్మిక, నైతిక జీవన పద్ధతులను, అభ్యాసి తనకు తనే స్వాభావికంగా అవలంబించుతూ వుంటాడు.

సహజమార్గ పద్ధతి ప్రకారము ధ్యానమనేది జాతి, మత, కుల, వర్ణ, లింగ, వయో బేధములు లేకుండా ప్రతి యొక్కరి కొరకు వుంది. అభ్యాసి అయినవాడు ధ్యాన సాధన చేయదలచుకొన్నవాడై, అభ్యాసములో క్రమము తప్పకుండుటకు ప్రయత్నము చేస్తాడు. దినములో నిర్ణీత సమయమును,నిర్ణీత ఆసనమును ధ్యానముతో సంబంధము కలుగజేసి, ధ్యానమనేదే ఆరాధన, ప్రార్థన అనే భావన గూడా కలుగ జేసుకొంటాడు. ఆ విధముగా నిరంతరము తాను దైవీకముతో సంబంధము పెట్టుకోడానికి కృషి చేస్తూ వుంటాడు. తన తలంపు అంతా దాని యందే మళ్లి వుండే విధంగా ప్రయత్నం చేస్తాడు. ఈ విధమైన దృక్పథము, తన

జీవనము ఆధ్యాత్మిక పురోభివృద్ధికి అనుకూలంగా వుండేట్లు తోడ్పడుతుంది.

ప్రిసెప్టరు వద్ద, రెండు లేక మూడు మార్లు కూర్చొన్నప్పుడు ఒక క్రొత్తదనంతో కూడిన జీవితసారం, తనలోనికి ప్రవేశించినట్లు సాధారణంగా గమనిస్తాడు. అతని హృదయాంతర్గతములో పటిష్టమైన, అగోచరమైన ఒక కేంద్రము రూపొందుతుంది. మనస్సు యొక్క వృత్తులు ఇక యేమాత్రమే గాని లొంగకుండా, గందరగోళముగా వుండే అసంఖ్యాకములైన ముళ్ళువలె వుండవు. మరొక విధంగా, నిగ్రహించలేని కోర్కెలకు తాను యికదాసుడు కాననే భావన కలిగి వుంటాడు. క్రమేణా తన మనోవికారాల యొక్క తీవ్రత సద్దుమణుగుతూ వుంటుంది. ఉన్నతమైన స్థానాలు అధో స్థానాలను స్వాధీనపరచుకొంటాయి. తన హృదయంపై క్రొత్త వాసనా సంస్కారాలు రాకుండా నిలుపుదల చేస్తాడు. హృదయం యొక్క గ్రంథి సడలుట ప్రారంభమవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, లయించడమనే కార్యము జరగడము తనలో ప్రారంభమవుతుంది.

సహజమార్గ అభ్యాసి యొక్క జీవితము, త్వరిత గతిన పరిణామము చెందునట్టి జీవితముగా వుంటుంది. పాశ్చాత్య శాస్త్రజ్ఞులు మనకు తెలియ జేసినట్లు, ఒక జీవకణము యొక్క ప్రాధమిక రూపము, మానవ రూపముగా ఈ భూమి మీద పరిణామం దాల్చడానికి, లక్షలాది సంవత్సరాలు పట్టింది. సహజమార్గములో, అత్యున్నతమైన ఒకశక్తి ప్రాణాహుతి ద్వారా అభ్యాసి జీవితములోనికి ప్రవేశించి, తద్వారా ఆంతరిక పరిణామాన్ని వేగిర పరస్తుంది. అభ్యాసి రెండు మార్లు పుట్టినట్లు అగును. మొదటి సారి తన భౌతికమైన తల్లి గర్భము నుండి, రెండవసారి ఆధ్యాత్మిక తల్లియైన గురువు మనోగర్భము నుండి. అభ్యాసిలోని జీవశక్తి ఇక యే మాత్రము జన్మముతో బుట్టునదిగా వుండదు. సగం తెలిసి, సగం తెలియక తడవులాడునట్టి వ్యక్తిగా వుండడు. అతని జ్ఞానమంతా మూలము నుండి మార్పుచేయబడుతుంది. జాగ్రత, స్వప్న, సుషుప్తి (నిద్ర) మొదలగు దశలలో కూడా ఎఱుకతో పని చేస్తూ వుంటాడు. అతని యొక్క అంతర్ముఖ చైతన్యము వేయిరెట్లు పటిష్టమవుతుంది. అతని జ్ఞానము ఈ భౌతిక స్థాయికి ఇకయే మాత్రము కట్టుబడి వుండదు. మూల జ్ఞానమును అతనిలో ప్రసరింపజేసి నందున, ఉన్నతము, మరియు మహోన్నతమైన జ్ఞాన పరిధులనుండి పనిని తీసుకోడము ప్రారంభిస్తాడు. అతని పని అనేది తెలుసుకోవడము, మరియు

నిర్వహించడము, అను రెండింటితో కూడి వుంటుంది. ప్రాణాహుతివల్ల, అతనిలోని ఆధ్యాత్మిక స్థితులను గుఱించిన జ్ఞానము, శ్రమలేకుండానే అతనికి వస్తుంది. క్రమేణా విషయాలను గుఱించిన జ్ఞానము మరియు అట్టి జ్ఞానము యొక్క స్థాయి బేధమును తెలుసుకోగల్గుతాడు. ఇంకా పోనుపోను, తన జ్ఞానము సూటిగను, నేఱుగను వుండి మధ్యన ఎంతటి సూక్ష్మమైన పొరలున్నప్పటికి వాటితో ప్రమేయము లేకుండా అతని జ్ఞానము స్వచ్ఛత చెందుతూ వుంటుంది. దాని ఫలితంగా వ్యాకులతనుండి, బలవంతమైన తలంపులనుండిఅతను విముక్తుడవుతాడు. అతని జీవితము ఇక యే మాత్రము భరించడానికి బాధాకరము కానట్టిదై, మానవ జీవనమునకు లక్ష్యమైన దానిని చేరుటకు ఒక తేలికైన, శీఘ్రమైన నౌకగా వుంటుంది.

సహజమార్గము యొక్క విశేష లక్షణమువల్ల, అనగా యోగశక్తి ప్రసారితము వల్ల, మార్గమధ్యమందు పలు విధాలైన ఆధ్యాత్మిక అనుభూతులనేవి అభ్యాసిని ప్రక్కత్రోవకు మళ్లించడము గాని, లేక అతనిని వశపరచుకోవడము గాని చేయలేవు. ఆధ్యాత్మికత యొక్క అంత్యమే సత్యమునకు మొదలని, అతను బాగా తెలిసి వుంటాడు. గనుక మార్గసాధనములే గమ్యమని తాఱుమాఱు చేసుకొనడు. అతని ఆధ్యాత్మిక పురోగమనమనేది, సురక్షితమైన చేతులలో వున్నదనేగాక, సమర్థవంతుడైన వాని చేతులలో గూడా వున్నదని అతను గట్టిగా విశ్వసించినవాడు. గురువు, లేక సహాయకుడు అతని కొరకుఎల్లప్పుడు వుంటాడు. అతను పూర్తిగా కేంద్రము, లేక గమ్యము నందు, అనన్యమగు, ఆ 'ఒక్కటి', లేక పరిపూర్ణుడగు గురువు మీద, సమూలముగ ఆధారపడి యున్న కారణమువల్ల, అభ్యాసి తన యొక్క అహంకారము, గర్వము నశించి పోయి, తనలోని జడత్వము స్థూలత్వము కరగిపోయినట్లు కన్గొంటాడు. క్రొత్త తేజస్సు అతని దృష్టిని ఆకట్టుకొన్నదని తెలుసుకొని, అంతకు ముందు వుంటూవుండే అవివేకమైన కోర్కెలను గుఱించిన మోహతలంపు పైన, ఇక యేమాత్రము మనస్సును కేంద్రీకృతము చేయలేడు. అంతిమ లక్ష్యమగు భగవంతుని ఆకర్షణీయమైన శక్తి తప్ప, ఇక ఏదేగాని అతన్ని బంధించలేవు. సర్వత్రా దైవమున్నాడనే ఒక తెలియని ఎఱుక, అభ్యాసి యొక్క జీవనాన్ని, దానికదే క్రమబద్ధం చేయడము ప్రారంభమవుతుంది.

తన గురువును గుఱించిన నిరంతర స్మరణయనునది, తనకును బగవంతునికి మధ్య సంబంధము స్థిరపరస్తుంది. అన్నిటికి మూలము భగవంతుడేననేది

తెలియబడినందున, తనకును సర్వ ప్రపంచానికి మధ్య ఒక విధమైన దైవీక బాంధవ్యము, లేక సంబంధమున్నదని అభ్యాసి గ్రహించడము మొదలవుతుంది. ఇంకా కొంచెము అభివృద్ధి చెందినప్పుడు. ప్రపంచములోని స్త్రీ పురుషులందరు అతని సోదరీ సోదరులని గ్రహిస్తాడు. ఇతరులతో అతని నడవడిక యావత్తు ప్రేమ యొక్క సంబధమువల్ల క్రమ బద్ధము చేయ బడుతుంది. ప్రకృతికి అనుగుణంగా వుండగలందులకు అతని యొక్క జీవితము చాలా సౌమ్యము కావింపబడుతూ వుంటుంది. ఈర్ష్య, పగ, అసూయ లను గుఱించిన ఉద్దేశ్యములవల్ల కల్గు బాధలు అతని కేమి వుండవు. అతని యొక్క బాధలు, కష్టాలు, భగవంతునిచే అతనికి ప్రసాదించబడిన వరములుగా వుంటాయి. అతని తపస్సు, నిష్టలనేవి తనతోటివారి తప్పులనన్నింటిని సహించడములోనే వుంటుందిగాని, అరణ్యాలలో శరీరాన్ని బాధపెట్టడములో వుండదు. అతని భార్య, పిల్లలు, కుటుంబములోని యితరు లందరు, సక్రమమైన సంరక్షణ కొరకు అతనికి అప్పగించబడిన దేవునిబిడ్డలుగా గుర్తిస్తాడు గాని, రక్తమాంసముల బంధము లచే అతను భ్రమపడడు. ప్రపంచముతో అతని సంబంధము యిప్పుడు క్రొత్త వెలుగుతో వుంటుంది.

ప్రపంచములో, తాను చేసే వాడననే అభ్యాసి యొక్క తలంపు, క్రమేణా సూక్ష్మరూపాలు పొందుతూ వుంటుంది. చేసేది తాను కాదని, చేసేదంతా గురువు గారనే తలంపు అతనికి కలగడము ప్రారంభమవుతుంది. తనకు బదులు తన గురువు గారిని పెట్టుకొన్నప్పుడు, ఒక పెద్ద బరువు అతని నుండి తీసివేయబడుతుంది. ఈ విధమైన తలంపువల్ల, అతని యొక్క దేహభ్రాంతి తొలగిపోతుంది. కొన్ని మార్లు తన దేహము, వేరేమరొకరి దేహమనే భావన గూడా అతనికి ఏర్పడుతుంది. అతను ఆశ్చర్యచకితుడవుతాడు. ఇంకా అభివృద్ధి పొందినప్పుడు, అతనికి జీవభ్రాంతి కూడా తొలగిపోతుంది. క్రియలన్ని గూడా వాటంతటవే జరుగుతున్నాయనేది అతను తెలుసుకొంటాడు. అతను ముగ్ధుడై ఆశ్చర్యము చెందు స్థితిలో వుంటాడు. ఇదంతా గురువును గుఱించిన నిరంతర స్మరణ వల్ల జరుగుతుంది. అతని తలంపు, మాట, చేష్టలన్ని గూడా దైవీకశక్తి అధీనము చేసుకొన్నది. గనుక, ఇక అతని దంటూ ఏమి లేవు. అతను భగవంతుడిని పొంది, భగవంతుడనే మైకంలో వుంటాడు. అయినప్పటికిని సహజమార్గము యొక్క అభ్యాసి నడవడి ఏ మాత్రము అస్వాభావికంగా వుండదు. అన్ని విషయాల యందు చాలా స్వాభావికంగా వుంటాడు. అయితే ఒక్క వైశిష్ట్యము మాత్రము వుంటుంది. సామాన్యుని యొక్క

జీవితము ప్రాపంచికముగను, అహం పూరితముగను వుంటే, అభ్యాసి యొక్క జీవితము ఆధ్యాత్మికముగను, దైవపూరితముగను వుంటుంది. గృహస్థ జీవితము ఆధ్యాత్మకోన్నతికి అనుకూలమైనది కాదనే దానిని సహజమార్గము యొక్క అభ్యాసి విశ్వసించడు. ధర్మార్థకామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములతో, పరిపూర్ణమానవ జీవితాన్ని పొందడానికి అతను ప్రయత్నము చేస్తాడు. దివ్యతేజస్సు నాధారంగా సద్గుణాలను అలవాటు చేసుకోడానికి బ్రహ్మచర్యమనేది ఒక సాధన ధశ. అదే భగవంతునిలో జీవించడము మరియు సంచరించడము. అందరు అను కొనునట్లు లైంగిక లక్షణాన్ని నిరోధించడము లేక ప్రతిరోధించడమనేది కాకుండా, భగవంతునిలో సంచరించడమనేదే దాని సారాంశము. తన మీద ఆధారపడిన వారిని పోషించడానికి, సంఘానికి సహాయము చేయడానికి తన యొక్క న్యాయమైన వృత్తిని తప్పనిసరిగ చేసి తీరవలె. తన పొట్టనింపుకోడానికి, భగవంతుని పేరు మీద అడక్కదిను జీవితము నవలంబించడమనేది, తను చేయవలసిన విధ్యుక్త ధర్మమునుండి, మరియు బాధ్యత నుండి పారిపోవడమే అవుతుంది. భగవంతుని కొరకు తీరని కోరికతో వుండేవాడు, కోరికలేనట్టి స్థితిని పొందుతాడు. కామమనేది అతనిని మోక్షానికి తీసుకొనిపోతుంది.

సహజమార్గ అభ్యాసి తన సాధనను, గురువుగారి యందు ప్రేమ, విశ్వాసములతో ప్రారంభిస్తాడు. అటు తర్వాత సమస్త/మానవకోటిని ప్రేమిస్తూ, తన గురువు యందు విశ్వాసము అంతకంతకు పటిష్టమవుతున్నదని గుర్తిస్తాడు. గురువుగారితోటి పరిచయము, లేక సంబంధము ఏలాటి బలవంతమైన పద్ధతుల యొక్క అవసరము లేకనే వృద్ధి చెంది, చివరకు అది సహజమైన సంబంధముగా అయిపోతుంది. గురువుగారి యందు ప్రేమ పటిష్టమవుతూ వుండే కొద్ది, దానితో బాటు విశ్వవ్యాప్తమైన ప్రేమను గూడా గుర్తించడము మొదలవుతుంది. సమస్త సృష్టితోటి నిజమైన సంబంధము కల్గిన రంగమందు, అతను యిప్పుడు జీవిస్తూవున్నాడు. అనగా భగవంతుని సృష్టితో అతనొకడైయున్నాడు. సహజమార్గ అభ్యాసి ఈ విధమైన అభిన్నత్వమును బహుసులభంగా పొందుతాడు.

గురువు యందుగల తన ప్రేమను గుఱించిన ఎఱుక గూడా చివరకు పోవునట్టి సూక్ష్మాతి సూక్ష్మమైన అభిన్నత్వస్థితుల వైపు అభ్యాసి క్రమేణా పురోగమిస్తాడు. అంత్యములో ఈ ప్రేమ సంబంధమనేది దాని "మూల" స్థితిగా మారుతుంది. ఈ స్థితిలో అభ్యాసి యొక్క హృదయము నందు ప్రేమను గుఱించిన భావన గూడా

మాసిపోతుంది. పూర్ణత్వమనేది యిప్పుడు పూర్తి అయింది. సౌమ్యత్వము, శాంతము పవిత్రత అన్ని గూడా వెనుక బడిపోయినాయి. ఇప్పుడు అతను "సహజమార్గ దృష్ట్యా రాజయోగ ప్రభావము" అను గ్రంథములో బాబూజీచే వివరించబడిన కేంద్రప్రాంతములో ఈదులాడుతూ వున్నాడు.

సహజమార్గ అభ్యాసి యొక్క జీవితమనేది నిజములో ఉభయలోకాలలోని నిండు జీవితము. అతను, ప్రాపంచిక సౌఖ్యాలు కూడదనే సన్యాసియూ కాదు, లేదా ఆధ్యాత్మికపరమానందమనేది లేదను నాస్తికుడు కాదు. ఇహము, పరములను రెండింటిని నెఱవేర్చడములోనే అతను వుండేది. ఆకాశాన్ని తాకుతూ వుండే బంగారు గోపురంలో వుండడానికి అతను అహంకారుడు కాదు. అతని పరిమితులు అతనికి బాగా తెలుసు. పరిమితులనుండి స్వాతంత్ర్యము పొదిన వానితో అతను సంబంధము కలిగియుండడముతో అతనికి పూర్ణ విశ్వాసము వుండి, ఆ విధంగా సర్వ ఉనికిని ఆకళించుకొని యుండు ఆ ఏకైక పరి పూర్ణుని గుఱించిన, ఎఱుకతో సర్వదా వుంటూ, ఇతరులకు ఏమి అందించవలెనో దానిపట్ల ఏలోపము చేయకుండా అందిస్తూ వుంటాడు. పరిపూర్ణమానవుని యొక్క పూర్ణ జీవితాన్ని అతను గడుపుతూ, తన హృదయాన్ని బంధకారణమగు కోర్కెలతో కలుషితమగుటకు ఎప్పుడేగాని ఆస్పదము యివ్వడు. అట్టి ప్రశస్తమైన దివ్య జీవనము యొక్క వాస్తవిక రుచిని చూడడానికి ఈ రంగమందు అడుగు పెట్టడమే కావలసింది.

సహజమార్గముననుసరించి, ప్రాణాహుతి పద్ధతి ద్వారా యితర అభ్యాసులకు సహయము చేయుటకుగాను, గురువుగారు అభ్యాసిని ప్రిసెప్టరుగా పని చేయమని ఆజ్ఞాపిస్తారు. ప్రిసెప్టరు యొక్క జీవితమును గుఱించి వేరే అధ్యాయములో ప్రత్యేకంగా వివరించబడుతుంది. ప్రిసెప్టరుగా విధులను స్వీకరించినప్పటికినీ, అతను అభ్యాసిగా జీవితము గడుపుతూ వుంటాడని చెప్పడము ప్రస్తుతము చాలు. అభ్యాసిగా వున్నప్పుడు మాత్రమే దైవీక సామ్రాజ్యమందు మానవుడు పొందదగిన అత్యున్నత స్థితిని పొందగలడు. గురువు గారి ఆజ్ఞల వల్ల ప్రిసెప్టరు పనిచేయడము, మరియు యితర దైవీక కార్యములను చేయడము, యివన్ని గూడా సాధారణంగా మానవుల శ్రేయస్సు కొరకు మాత్రమే. ఈ సంబంధముగా అభ్యాసి అనుభవానికి గూడా కొంత సహాయము కలుగవచ్చు.

# 11. ప్రిసెప్టరు యొక్క జీవితము

సహజమార్గ పద్దతుల ననుసరించి శ్రీరాంచంద్రమిషన్ లోని ప్రిసెప్టరు యొక్క జీవితము ప్రప్రధమంగా అభ్యాసి యొక్క జీవితముగనే వుంటూ, అదనంగా దివ్య ప్రకృతికి సంబంధించిన విధులు, బాధ్యతలతో కలసి యుండి, గురువుగారి అనుమతితో అతను సహచరులకు ఆధ్యాత్మిక మార్గములో సహాయము చేసే విధిని స్వీకరిస్తాడు. అనుమతి యిచ్చునప్పుడు, గురువుగారు అతనిలో తగినంత యోగశక్తిని ప్రవేశపెట్టడమేగాక, కొన్ని మార్లు దైవానుగ్రహమనే నిధితో అతనికి సంబంధము కలుగజేస్తాడు. ఆ విధంగా ప్రిసెప్టరు తాను ఏది పోగొట్టు కొనకుండా, అభ్యాసికి దైవీక శక్తి, లేక దైవీక ప్రేరణను ప్రసరింప చేయగలడు. గురువు అనుమతి లేకుండ ఎవరైనా అభ్యాసి, యితరులకు ప్రాణాహుతి ఇచ్చుట ప్రారంభిస్తే, అపవిత్రములైన వాటితో తాను కలుషితమయి, తాను ఉన్నత స్థితినందుకోడానికి వుపయోగపడు తన యందలి శక్తిని పోగొట్టుకొనే ఆస్పదము వుంది.

సహజమార్గ ప్రిసెప్టరు, తన ఆధ్యాత్మికతను ప్రాపంచిక సుఖాల కొరకు వినియోగించుకొనే స్వభావముతో వుండడు. ఆధ్యాత్మిక మనేది అతని వృత్తి కాదు. అతను చేయు ఆధ్యాత్మిక సేవయనేది తనను గుఱించి గొప్పగా చెప్పుకోడానికి గాని, లేక యితరుల అజ్ఞానాన్ని తన స్వలాభము కొరకు వుపయోగించుకోడానికిగాని కాదు. గురువువలె చేస్తూ, గురువు మీద ఆధారపడి ఆయనకు జవాబుదారిగా వుంటాడు. ప్రాపంచిక అవసరాలకొరకు అతను గృహస్థుడుగా సమాజములో ఆమోదము పొందిన గౌరవనీయమైన వృత్తిని చేసుకొంటూ వుంటాడు. అతను గూడా ఒక అభ్యాసియనే అనుకొంటాడు, లేదా కొన్ని మార్లు అంతగా అయితే తను ఒక తరగతిలోని విద్యార్థులకు పెద్ద (మానిటర్) అని అనుకోవచ్చు. తాను గురువునని గాని, యితర సోదరుల నుండి గౌరవ మర్యాదలను ఆశించడముగాని, లేదా వారి నుండి సేవలు పొందాలనిగాని తన మనస్సులో ఎప్పుడే గాని ఉత్పన్నముగాదు. మరొక విధంగా గురువు గారిని గుఱించిన తలంపుతో నిండిన తన సోదరుల హృదయాలను ఆరాధిస్తాడు.

సహజమార్గ ప్రిసెప్టరు తన ప్రిసెప్టరు పదవి అనేది గురువుగారి ఇచ్ఛపై ఆధారపడివున్నదేగాని, అభ్యాసకుల కోర్కెలపై ఎప్పుడే గాని ఆధారపడి యుండలేదనే విషయము పూర్తిగా ఎఱిగి యుంటాడు. గనుక బూటకమైన వాగ్దానాలతోగాని, లేక బూటకమైన ఆడంబరాలతోగాని అభ్యాసులను తృప్తి పరచేందుకుగాని, లేక సమాధానపరచేందుకుగాని లక్ష్యపెట్టడు. తన సోదరుల వాస్తవిక ఆధ్యాత్మిక పురోభివృద్ధికి గురువుగారిచే అనుమతింప బడిన శిక్షణా పద్ధతులను మాత్రమే అవలంబిస్తాడు. తన వద్దకు ఎవరైనా ఆధ్యాత్మిక శిక్షణ కొరకు బూటకమైన తలంపుతో వచ్చే అభ్యాసులతో అతను ఎప్పుడేగాని సమాధానపడడు. అభ్యాసుల ద్వారా తన ఉద్దేశ్యములు నెరవేర్చుకొనే వేమి లేవు గనుక, వారి యిష్టా ఇష్టములను లెక్క చేయకుండా తన పద్ధతి నను సరించియే వారికి ఆధ్యాత్మిక శిక్షణ యిస్తాడు. ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చేప్పుడు, ప్రిసెప్టరు యొక్క హృదయములో అభ్యాసి మేలును గుఱించిన భావన మాత్రమే ప్రధానంగా వుంటుంది. మేలు ఏదో, లేక తాత్కాలిక ఆహ్లాదమేదో వాటిని గుఱించి గందరగోళపడడు.

ప్రిసెప్టరు యొక్క జీవితము పరిపూర్ణమానవుని జీవితమును వర్ణించే వుద్దేశ్యము కాదు. అయినప్పటికి ప్రిసెప్టరు యొక్క జీవితము మానవ జీవనము యొక్క "ఉద్దేశ్యము"లేక "లక్ష్యము"ను గుఱించి సూచిస్తుంది. ప్రిసెప్టరు మానవ మర్యాదల వృత్త పరిధిలోనే వుంటాడు. మహానుభావుడైన గురువు యొక్క స్థానాన్ని ఆక్రమించుకొనడుగాని, ఆయన ఆదేశాల మేరకు ఆయనవలెనే పని చేస్తూ వుంటాడు. సహజమార్గము యొక్క విశిష్టత ఇక్కడనే వుంది. ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చేప్పుడు గురువు యొక్క శక్తితో, అయన వుత్తరువు మేరకు ప్రిసెప్టరు పని చేస్తాడు. గనుక ఆధ్యాత్మికంగా ఎంతటి పురోభివృద్ధి పొందినప్పటికి, ఇంకాముందుకు పోవడానికి ఎవరికేగాని సహజమార్గము యొక్క ప్రిసెప్టరు సహాయము చేయగలడు. వాస్తవములో సహజమార్గము యొక్క ప్రిసెప్టరు తన సోదరులకు అట్టి సహాయము చేయడానికి ఎంతో సంతోషపడతాడు.

అభ్యాసులకు ఆధ్యాత్మికంగా యోగసాధనా పద్ధతులను శ్రీరాంచంద్రమిషన్ యొక్క ప్రిసెప్టరు నిర్ణయిస్తాడు. ఆయన నిర్ణయించే పద్ధతులు అధికారయుక్తమైనవి, చాల మంచివి కూడ. గురువుగారు ఈ అధికారాన్ని వ్యక్తిలోకి ప్రవేశింపజేసి, అటు తర్వాత సహజమార్గపద్ధతుల ప్రకారము ప్రాణాహుతి, లేక యోగశక్తి ప్రసారితము

ద్వారా అపేక్షకులకు, ఆధ్యాత్మిక శిక్షణ యివ్వడానికి అనుమతి ఇస్తారు. ప్రిసెప్టరు తనకు తానుగా క్రొత్త పద్ధతుల నేమి సృష్టించడు. ఈ విధంగా ప్రిసెప్టరు యొక్క పని పరిమితమైనది. గురువు గారి ఉద్దేశ్యమును కేవలము అనువదిస్తాడు. ఎప్పుడు గూడా అతని పద్ధతి ప్రాణాహుతి శక్తి వల్ల ప్రత్యక్ష ప్రమాణంగా వుంటుంది. అతని పద్ధతులు పవిత్ర గ్రంధాల మీద గాని, లేక చిత్ర విచిత్రమైన సిద్ధాంతీకరణముల మీద గాని, ఆధారపడక పరిపూర్ణుడైన గురువు యొక్క అనుభవాల మీద, అంతర్ జ్ఞానము పైన మాత్రమే ఆధారపడి వుంటుంది.

సూక్ష్మంగా చెప్పాలంటే, శ్రీరాంచంద్రమిషన్ యొక్క ప్రిసెప్టరు, గురువుగారి యొక్క ప్రతినిధి గనుక సహజమార్గములోనిఅభ్యాసుల మధ్య, అతను వుండడము వల్ల వారు ఎంతో మేలును పొందుతారు. గురువుగారిచే అనుగ్రహింప బడడానికి అభ్యాసులకు ఎల్లప్పుడు భౌతికంగా వీలుండదు. ప్రిసెప్టరు ఈ సమస్యను తొలగిస్తాడు. అతను తరగతిలోని విద్యార్థులకు పెద్ద. గురువుగారిని గుఱించిన ఎఱుకను తన సహచరులకు కలుగజేస్తాడు. కొన్ని మార్లు అభ్యాసికి నేఱుగా గురువు నుండి సహాయము పొందడము క్లిష్టతరముకావచ్చు. అలాంటి పరిస్థితులలో అతను సులభంగా ప్రిసెప్టరును సమీపించవచ్చును.

కొంతమంది అభ్యాసులు వినయ విధేయతల వల్ల ప్రేమతో గురువుగారి యొక్క సంబంధము కలుగజేసుకొంటారు. అలాంటప్పుడు ఇంకా హృదయము పరిపక్వము చెందడానికి, అభ్యాసులకు ప్రిసెప్టరు ఎంతో చేయూతగా వుంటాడు. దీనివల్ల తన సహచరులలో జడత్వము మొదలయినవి శీఘ్రంగా తొలగించుకోడానికి ఎంతో సహాయకారిగ వుంటుంది. సభ్యులకు, సంస్థ అధ్యక్షునకు మధ్య ప్రిసెప్టరు నామకార్థముగా సంధాన కర్తగా వుంటాడు. క్రొత్త సభ్యులను గురువుగారికి పరిచయము చేసి, సంఘ ఆధ్యక్షుని నుండి నేఱుగా ఆదేశాలను పొందుతూ శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తూ వుంటాడు. సంస్థ అధ్యక్షులు ఈ సంస్థకు అధిపతి అయితే, శిక్షణా కేంద్రానికి ప్రిసెప్టరు అధిపతి గనుక, అభ్యాసులు ప్రిసెప్టరును తమ యొక్క సహజమార్గ దర్శకుడుగా గుర్తిస్తారు. తనే గురువను భావన సహజమార్గ ప్రిసెప్టరు హృదయములో ఎప్పుడేగని రాదు. ఎందుచేతనంటే, వాస్తవమైన గురువేవరో అతనికి బాగా విపులంగా తెలుసు. సాధారణంగా మత గురువులు తామే సర్వజ్ఞులమని అనుకోడమువల్ల వారు తమను గుఱించిన గొప్పదనము కొరకు

అహంకారానికి వారు ఆహుతిగా అయిపోతున్నారు. వారి శిష్యుల నుండి వినయ విధేయతలతో సేవలను కోరుతూ, శపించడానికి, అను గ్రహించడానికి వారు శక్తి కల్గినవారని నటిస్తూ వుంటారు. ఆవిధంగా వారు వుండడానికి కారణమేమంటే, వారికి కావలసిన కనీసపు తిండి బట్టలకు గూడా వారి శిష్యుల మీద ఆధారపడివుండడమే. అంతేగాక, వస్తుదః వారు సోమరిపోతులు, బద్ధకస్తులు మరియు అహంకారులు. సహజమార్గము యొక్క ప్రిసెప్టరు తన సహచరులకు సేవ చేస్తూ, గురువుగారికి అర్పణ అయి వుండే దృక్పథంతో వుంటాడు. గురుస్థాన ఆధిపత్యంలోని చెడుగుల నుండి అతను కాపాడబడుతాడు. సహజమార్గ ప్రిసెప్టరు, ప్రాణాహుతి శక్తి ప్రభావము వల్ల తన సహచరులకు నిజమైన ఆధ్యాత్మిక సహాయకుడుగను, సేవకుడుగను వుంటాడు. క్లుప్తంగా చెప్పాలంటే, సాంప్రదాయకమైన గురువులకు, సహజమార్గ ప్రిసెప్టరుకు ముఖ్యమైన బేధమేమంటే మొదట చెప్పబడినవాడు తమ శిష్యులపైన పెత్తనం సాగించేందుకు గాను భగవంతుని స్థానాన్ని అపహరిస్తే, తరువాత చెప్పబడినవాడు తన సహచరుల ఆధ్యాత్మిక అవసరాల కొరకు సేవకుడుగా స్థానంవహించి యుంటాడు.

ప్రిసెప్టరు అనేవాడు శ్రీరాంచంద్ర మిషన్‌కు అవిభక్తమైన భాగంగా వుంటాడు. అతను దానితో ఒకడు. సంస్థతో అతని సంబంధ మెట్టిదనగా, తన జీవనము యావత్తు గూడా శ్రీరాంచంద్రమిషన్ యొక్క కార్యముగానే భావించుకొంటాడు. సహజమార్గము యొక్క ఒక విశిష్టత ఏమంటే గురువుగారిచే ఎన్నుకొనబడిన ఎవరైనాసరే వారికి తెలియకనే, లేక వారి ఎఱుక లేకయే, సంస్థ యొక్క అవిభక్త భాగంగా పని చేయడము ప్రారంభించేటంత త్వరితగానూగాను పూర్ణంగాను గురువుగారు అతన్ని మారుస్తారు. క్రమేణా ఈ మార్పు అతని ఎఱుకకు వస్తుంది గనుక ప్రిసెప్టరు తన యొక్క జీవితములోని మార్పును బాగా గమనించుతాడు. అయినప్పటికి, గురువు గారి యొక్క ప్రాణాహుతి శక్తి ప్రభావము వల్ల ఈ మార్పు నమ్మడానికి శక్యము కానంత ఆకస్మికంగా జరుగుతుంది. ప్రిసెప్టరుకు ఏలాటి గర్వము, అహంకారమును గుఱించిన భావనగూడా, వుండదని ఇక్కడ గట్టిగ చెప్పవలసియుంది. సంస్థతో ఒకడుగా వుండగలందులకు అతను తన వ్యక్తిత్వాన్ని పోగొట్టుకొంటాడు. వాస్తవంలో గురువుగారి చేతుల్లో ఒక పని ముట్టుగా తాను ఉండడానికి అంగీకరించిన క్షణం నుంచి "తాను" అనేది కరిగిపోవడం ప్రారంభమయి,

గురువు గారు అతని నుండి పనిని తీసుకోవడము మొదలు కాగానే, ఈ కరిగిపోవడమనేది పూర్తి అవుతుంది. తన ఎఱుక తోను, ఎఱుక లేకుండాను గురువు యొక్క ఇచ్ఛకు పూర్తి అనుగుణంగా పనిచేయడము ప్రారంభిస్తాడు. ప్రిసెప్టరు త్యాగము చేసే దంతా గూడా తన యొక్క స్వార్థపరత్వము మరియు తాను వేరు అను ఈ రెండింటిని మాత్రమే. వాస్తవంలో ఇదిత్యాగము కాదుగాని ఆధ్యాత్మిక పురోభివృద్ధికి మార్గమందువుడే అటంకాలను తొలగించుకోవడమే. మరొక విధంగా, ప్రిసెప్టరును చేయడానికి గాను ప్రాణశక్తిని గురువుగారే త్యాగము చేస్తారు.

శ్రీరాంచంద్రమిషన్‌లో తాత్కాలిక మగు ప్రిసెప్టర్లు, పూర్ణమగు ప్రిసెప్టర్లు అను రెండు తరగతుల ప్రిసెప్టర్లు వున్నారు. ఈ తరగతులు అనే మాటలోనే ప్రిసెప్టర్లను పరిపూర్ణ వ్యక్తులుగా భావించరాదనేది తెలియజేస్తుంది. ఈ అధ్యాయం ప్రారంభములో ప్రిసెప్టరు అనువాడు అభ్యాసియనిన్ని, తనతోటి అభ్యాసులకు ప్రాణాహుతి ద్వారా సహాయము చేయు అదనపు బాధ్యత కల్గిన వాడనిన్ని తెలియజేయబడింది. చాలమార్లు ప్రిసెప్టరును అతని సహచరులు తమసోదరునిగానే భావిస్తారు. అతనితో సన్నిహిత సంబంధము కల్గియుండుట వల్ల, గురువుగారి నుండి పొందునంత పరిపూర్ణ సహాయమును అతని నుండి వారు అపేక్షించరు. కాని వాస్తవములో గురువు గారి నుండి ఎంత సహాయము పొందుతారో అదే మాదిరి సహాయము ప్రిసెప్టరు నుండి కూడా పొందుతారు.

అయినప్పటికి, సహచరుల ఆలోచనా సామర్థ్యమునను సరించి వివిధ స్థితులలో అభ్యాసుల యొక్క ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కావలసిన స్థాయిలను మాత్రమే సహజమార్గ ప్రిసెప్టరు స్వతః పొందుతూ వుంటాడు. ప్రాపంచికమైన వుపయోగాల కొరకు తాను ఎట్టి మహిమలు చేయడానికి అశక్తుడనని గట్టిగా నొక్కి చెప్పడమువల్ల తన సహచరుల యొక్క దృక్పధాని సరియైన మార్గములో, బహునైపుణ్యంతో సరిదిద్దుతాడు. తన సహచరుల వలె కేవలము సాధారణమైన గృహస్థ జీవితము గడుపుతూ, వారిలో ఆత్మసాక్షాత్కారము కొరకు తీవ్రమైన మనోస్థైర్యాన్ని, పటిష్టమైన నిశ్చయాన్ని బహుచక్కగా కలుగజేస్తాడు. తఱచు గురువు గారినుద్దేశించి పలుకుటవల్ల అభ్యాసులలో వివేకము, వైరాగ్యము లనే సద్గుణాలను వారిలో చొప్పిస్తాడు. సత్సంఘాలను నిర్వహించుట ద్వారా అభ్యాసులను సూక్ష్మమైన, సున్నితమైన ఆధ్యాత్మిక జీవనములోనికి తీసుకొని పోతాడు.

శ్రీరాంచంద్రమిషన్‌లోని ప్రిసెప్టరు యొక్క కనీసపు ఆధ్యాత్మిక స్థాయి అనేది బ్రహ్మాండ మండలము. ఇతరులకు ఆధ్యాత్మిక శిక్షణ యివ్వడమనేది ఈ స్థాయి వరకు తీసుకొని పోబడినవారికి మాత్రమే అనుమతి యివ్వబడుతుంది. అప్పుడే యితరులకు ఆధ్యాత్మిక మార్గములో అతను సరియైన విధంగా సహాయము చేయగలడు. బ్రహ్మాండమండలమనేది కేవలము ఆధ్యాత్మికతకు సంబంధించిన ప్రాంతము. మరియు, మన దైనందిన, ప్రాపంచికము యొక్క కారణ ప్రాంతము. ఈ ప్రపంచములో స్థూలంగా జరుగుతూ వుండి, మనకు గోచరమవుతూ వుండే విషయాలన్ని గూడా, బ్రహ్మాండ మండలములో అంతకుమునుపే జరిగి యుండినట్టివే. గనుక, ఆ ప్రపంచము వరకు పోయినవానికి, ఈ ప్రపంచములోని పరిస్థితులపైన అధిపత్యము కలిగి యుండవచ్చు. అయితే ఫలానాకాలానికి ఫలానా విశిష్ఠవ్యక్తియని, ఒక్కరినే నిర్ణయించడం జరుగుతుంది. బ్రహ్మాండ మండలములోని సూచనలను తన ఎఱుక లేకయే ప్రిసెప్టరు గ్రహించి, తనను, తన సహచరులను అనివార్యముగ జరుగు సంఘటనలకు సిద్ధము చేస్తాడు. స్థూలమగు వాటిని గమనించి చూచాయగ పరస్పర సంబంధాన్ని ఆధారం చేసుకొని చెప్పే జ్యోతిష ఫల శాస్త్రమనే దానితో, ప్రిసెప్టరు యొక్క ఈ శక్తిని పోల్చి, తారు మారు చేసుకో కూడదు. ప్రిసెప్టరు యొక్క ఈ శక్తి అనేది, నేరుగా విశ్వ శక్తులయొక్క సంబంధమును, ఆధారమును, చేసుకొని వుండేదే. తనకు ఆ విశిష్ఠ వ్యక్తితో వుండే సంబంధము వల్ల, ప్రిసెప్టరు తన ఇచ్ఛాశక్తిచే ఆ పరిస్థితులను మార్పు చేయడానికి, లేక సార్థకము చేయడానికి వుపయోగించ గలడుగాని, తాను గురువుకు సంపూర్ణముగ అంకితమయి యున్నందున, గురువునుండి అదేశాల కొరకు మాత్రమే వేచి యుంటాడుకాని, తనకు తానుగా ఇచ్ఛాశక్తిని వుపయోగించడు. తాను పొంది వుండే శక్తిని తన సహచరుల ఆధ్యాత్మికోన్నతి కొరకు ఏ విధముగా ఉచితమని తోచిన ఆ ప్రకారము ఉపయోగించడానికి పూర్తి స్వేచ్ఛను ప్రిసెప్టరు కలిగియుంటాడు. ప్రకృతి యొక్క గొప్ప కర్మాగారములో తన దైవీక కార్యాలను తక్షణము నెఱవేర్చ గలందులకుగాను ప్రిసెప్టరుకు ఈ స్వాతంత్ర్యము గురువు గారిచే యివ్వబడింది.

ఆధ్యాత్మిక రంగములో ఈ శక్తులను వుపయోగించడములో తగిన అనుభవము, ప్రావీణ్యత ప్రిసెప్టరు పొందినప్పుడు అతని కార్య నిర్వహణా రంగము ఇంకా విస్తారమవుతుంది. దానితో బాటు అతని బాధ్యతలు విధులు గూడా

ద్విగుణీకృతమవుతాయి. ఇంకాకొన్ని ఆదేశాలను గురువు నుండి పొందుతూ వుంటాడు. మామూలుగా తన సహచరులకు ఆధ్యాత్మిక శిక్షణ యిచ్చుపనియేగాక, ప్రకృతి యొక్క సర్వతో ముఖమైన పథకములోని ఏదో ఒక కార్యములో, ఆ మహాపురుషుని ఇచ్ఛననుసరించి ప్రిసెప్టరు పాల్గొనవచ్చు. ప్రకృతి యొక్క కర్మాగారంలో ఆవిధంగా కార్యములను నెఱవేర్చడానికి గాను కొన్ని మార్లు అనంతమైన శక్తి కావల్సి వుంటుంది, గనుక, ప్రకృతి అతనికి ప్రసాదిస్తుంది. తన శక్తులు ఎక్కువవుతూ వుండే కొద్దీ, తన విధులు గూడా ఎక్కువవుతూ వుంటాయి. అట్టి స్థితులలో ప్రిసెప్టరు యొక్క జీవితమంతా గూడా దివ్యత్వము చెందిన జీవితమేఅవుతుంది. దైవీక కార్యమునకు మాత్రమే పనిచేస్తూ వుంటాడు. ప్రాపంచికమైన బంధాలకు అతను ఏమాత్రములోను కాడు. ఈ సర్వ ఉనికికి ఏదైతే కారణభూతమై వున్నదో అట్టి దానితో ఒకటిగా అయిపోతాడు. అతని సంకల్పము సత్యమందుద్భవించినట్టిదే. ఈ సమయానికి తన అభ్యాసము దాదాపు పూర్తి అయినట్లే, ఆరాధన అనేది రాలిపోతుంది. తన చిన్న సృష్టి అనేది అంతర్ధానమై పోయింది. అతను పొందడానికి మిగిలిఏమి లేదు. క్లుప్తంగా చెప్పాలంటే అతను మానవ జీవన లక్ష్యాన్ని పొందినాడు.

**"సమత్వ స్థితిని పొందని ఎంతటి గొప్ప వారైనా ఆధ్యాత్మికరంగ మందు అడుగిడినట్లు కాదు"**

--బాబూజి

# 12. దివ్య జీవన స్వరూపము

కొంత మంది గొప్ప మేధావంతుల యొక్క సాహసవంతమైన ఆలోచనలవల్ల, రాబోవు విషయ పరిణామములను గుఱించిన సాహిత్యము బ్రహ్మాండంగా వెలువడింది. మత సంబంధ తత్వ శాస్త్రము మరియు, రాజకీయ, సాంఘిక తత్వ శాస్త్రాలు అన్ని కూడా, భవిష్యత్తులో రాబోవు ఆశ్చర్యకరమైన స్వప్న ప్రపంచాలను గుఱించి వివరించినాయి. దాదాపు ఈ మనోకల్పితమైన విచారణలన్ని గూడా ఒకని జీవిత కాలములో పొందడానికి వీలులేనివి, లేక పొందడానికి అసాధ్యమని తెలియజేయడమే ఒక తీరని లోపముగా వుంటున్నది. గనుక అట్టి సాహిత్యాలలోని విశ్వాసము మరియు ఉత్సాహము అనునవి కేవలము "పలాయన సూత్రము" అని చమత్కారంగా పరిహాసము చేసినారని అన్నప్పుడు అందులో ఆశ్చర్యము ఏమిలేదు. గనుక, ప్రతి నిజమైన సాధకునికి మానవ జీవనము యొక్క మహోన్నతమైన అంతిమ లక్ష్యమును, ఈ జన్మలోనే పొందడానికి వీలున్నదని సహజమార్గము గట్టిగా చెబుతుంది. సహజమార్గము తెలియజేసిన పద్ధతులలోని ఈ సాధనను చేబట్టడానికి అన్వేషకులను సహజంగానే ఈ విషయం ప్రోత్సాహపరచాలి.

ఇట్టి స్థితిలో గమ్యమును చేరుకొన్న వానిని గమనించాల్సిన అవసరము ఏర్పడుతుంది. ఒక వ్యక్తి అట్టి స్థితిని పొదగల్గినప్పుడు సహజంగా మరి కొంతమంది గూడా అట్టి స్థితిని, లేదా దాదాపు ఆ స్థితిని పొందినవారు కూడా వుండి తీరవలె. గనుక, అట్టి వ్యక్తులలో ఒక విధమైన దైవీక జీవనాన్ని గమనించవచ్చు. ఇచ్చట ఒక హెచ్చరిక అవసరమై యుంటున్నది. కేవలము విగ్రహమునే దేవుడని సాధారణంగా అనుకొనే స్వభావము, అవివేకులయిన ప్రజలలో వున్నందున, సాక్షాత్కారము పొందిన వాడెడడు తన యోగ్యతను సూచించడానికి ఒక చీటీని గాని లేక చిహ్నమును గాని తగిలించుకోడు. పవిత్రతను సూచించు కాషాయరంగు దుస్తులను రాక్షసకృత్యముగా ఏవిధముగా అగుడు పట్టింపబడినవో భారత దేశంలో మనం గమనించవచ్చు, లేదా అవివేకమైన మత సంబంధ ముద్రాధారణ అనేది మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు.

మానవుడు దివ్యత్వము చెందడానికి బాగా నియమబద్ధమైన, సమత్వస్థితి కల్గినమనస్సు వుండడమనేది ప్రప్రథమంగా అవసరము. ఆ స్థితిలో వ్యక్తి యొక్క

జీవనము విశ్వజీవనముతో ఒకటిగా వుంటుంది. దైవ సిద్ధాంతము అనేది వ్యక్తి జీవితములోనికి దిగివచ్చినందువల్ల, ఆ తేజస్సు మానవకోటిని దైవసాంబ్రాజ్యము లోనికి పురోగమించడానికి సహాయపడుతుంది. తేజస్సు యొక్క లక్షణము అంధకారమును తొలగించడమే. ఏప్పుడయితే అపవిత్రములన్ని తొలగింపబడునో, తేజస్సు అనేది వర్ణరహితమైన తన సహజ లక్షణాన్ని పొందుతుంది. ఈ వర్ణరహితమనగా అంధకారమని కొన్ని మార్లు పొరబాటు బడవచ్చు, అయితే, అవరోధముల వల్ల ఏర్పడే అంధకారమునకున్నూ, అపవిత్రములైన వాటివల్ల మిఱుమిట్లు కొలుపు ప్రకాశమునకున్నూ, స్వచ్ఛమైన వర్ణరహితమైన తేజస్సునకున్నూ చాల బేధముంది.

నిష్కళంకమైన తొలి స్పంధన యొక్క స్థితిని పొందిన వ్యక్తికి, ఆలోచన(చింతన) యను దాని యొక్క శక్తి సామర్థ్యములు బాగా తెలుసు. అందువల్ల చింతనాశక్తిని చాలా సార్థకముగ వుపయోగిస్తాడు, సర్వఉనికికి మూలశక్తి ఏవిధముగా అంతర్గర్భితమైన కారణముగా వున్నదో అతనికి తెలుసు. వాస్తవములో సత్యమను దానికిని, మూల సంకల్పమను దానికిని మధ్య ఎట్టి వ్యత్యాసము అతనికి కనిపించదు. ఆ విధముగా అతని యొక్క సమస్త చర్యలు మూలస్థానము నుండి సత్యపరిధిలోనికి దిగివచ్చి, ఈ తాత్కాలిక ఉనికికి సన్నిహితంగా వుండే కారణపరిధియగు ఆధ్యాత్మిక రంగములోనికి ప్రవేశిస్తాయి. అలాంటప్పుడు, అతని ఆలోచన, వాక్కు, చర్య భగవదిచ్ఛకు పూర్తి అనుగుణంగా వుంటాయి. అతని కార్యములన్ని భగవంతుని కార్యము యొక్క భాగమై వుంటాయి. అతని వాక్కులన్ని గూడా ఋషి వాక్కులుగానే వుంటాయి. అతని సంకల్పాలన్ని గూడా మూల స్పంధనలకు అన్యముకావు, క్లుప్తంగా చెప్పాలంటే అతను దైవసాంబ్రాజ్యములో జీవిస్తూ వున్నాడు. ఎల్లప్పుడు తేజో మండలముతో ఎడతెగని సంబంధము గల్గియుండే అట్టి వ్యక్తులు, ఆ తేజో ప్రాంతము యొక్క ప్రాబల్యాన్ని ఈ ప్రపంచానికి తీసుకొని వస్తారు.

ఆ ధ్యాత్మికంగా మహోన్నత స్థాయినందుకొన్నట్టి వ్యక్తులకు మానవ కోటిని దివ్యమైన ఉనికి గల స్థితులను చేరుకోడానికి సహాయము చేయడమనేదే వారి ప్రధాన కర్తవ్యమై వుంటుంది. మాలిన్యాన్ని తొలగించడము, మరియు భగవంతునివైపు ఆకర్షింపబడునట్లు చేయడము అను రెండు క్రియలతో కూడుకొని వుంటుంది. ఈ రెండు క్రియలను గుఱించి విశదీకరించితే, సాధారణ చదువరులు గందరగోళపడి,

పొందికగా వుండే ఏకత్వంలోని భిన్నత్వాన్ని గుఱించిన తేడాలను వుహించడానికి చాల కష్టతరమవుతుంది. శిరస్సు, గుండె, కడుపు మానవ శరీరములో వివిధ స్థాయిలలో వున్నప్పటికిని, వాటి ప్రాముఖ్యతలో ఒక దాని కంటే మరొకదాని ప్రాముఖ్యత తక్కువగాదు. అంతిమ తత్వముతో అవి సంబంధము కల్గియున్నందున వాటంతటవే సహజంగా నియమబద్ధంగా ఒక దాని మేలు కొరకు మరొకటి పని చేస్తూ వుంటాయి. ఏ లక్ష్యము కొరకు అవి పని చేస్తున్నవో వాటికి తెలియకపోయినప్పటికి, వాస్తవములో అత్యవసరమగు కార్య సిద్ధికే పని జేస్తున్నాయి.

మానవునిలోని పశువును లొంగదీయుటకున్నూ, మరియు మానవునిలో నిద్రిస్తూ వుండే సౌందర్యాన్ని మేల్కొలుపుటకున్నూ ఎడతెగక అనుసరించు కార్యక్రమములే దివ్యత్వము చెందిన జీవనానికి రూపము. అట్టి రూపముతో ఎవనికైనా సంబంధము ఏర్పడినప్పుడు తన ఆత్మ యొక్క పరిమళాన్ని గుఱించిన అనుభవము ప్రారంభమవుతుంది. రహస్యమైన ఎఱుక గల్గిన తన మూల స్థితిలో మునిగిపోతాడు. తన స్వగృహము వైపుకు తరలిపోదామనే అంతర్గతమైన కోరిక తనలోనే స్పష్టమవడము మొదలవుతుంది. తన యొక్క జీవనము దివ్యత్వము చెందడము ప్రారంభమవుతుంది. ఈ దివ్యత్వమనేది అంటు వ్యాధి స్వభావము కల్గినట్టిది.

మానవుని కృషి యంతయూ ఉన్నత స్థాయిలకు చెందిన ఉనికిని పొందాలనేదే. ప్రాచీన భారత దేశమునకు ఈ విధంగా ఉన్నత స్థాయిలకు సంబంధించిన సిద్ధాంతము బాగా తెలుసు. ఆధ్యాత్మిక పరిణామమనేది జీవశాస్త్ర స్థాయికి సంక్షిప్త పరచాలని యోచించడమే గాక ప్రయత్నము గూడా చేసారు. అయితే, జీవశాస్త్ర సిద్ధాంతానికి వుండే ప్రబలమైన లక్షణాలు, వారి యొక్క గొప్పపరిశోధనను విఫలము గావించింది. మానవుని లోని దివ్య తేజస్సును బహిర్గతము చేయడానికి గాని, లేక మానవునిలో నిలబెట్టడానికిగాని అవసరమగు శిష్టాచారాలు జీవ శాస్త్రరీత్యా నిలబెట్ట లేక పోయినాయి. ఇందుకు కారణమేమంటే, జీవపరిణామమనేది, జంతు పరిణామానికి సహాయము చేస్తే, నిర్దిష్టమైన పద్ధతులనేవి జంతువును లొంగ దీయడానికి అవసరములై యుంటున్నాయి. దివ్య రూపాలను నిలుపుకోడానికి అవసరమగు ఆధ్యాత్మిక శిష్టాచారములకును, జీవశాస్త్రమునకు అవసరమైన పద్ధతులకును మధ్య వుండే పెనగులాటలో కులము, మతములు మరియు

వ్యక్తిగతంగా విధులు అనగా వర్ణాశ్రమ ధర్మాలనేవి దిగజారిపోయి దాదాపు అంతరించి పోయినాయి. నాలుగు జాతుల యొక్క హక్కులు కఠినరూపాలు దాల్చగా, ఆశ్రమ ధర్మాల సిద్ధాంతాలు గాలికి కొట్టుకొని పోయినాయి. ఆచరణ అనేది అంతరించిపోయి, సిద్ధాంతాలు మాత్రం జడరూపంలో బాగా ఘనీభవించి వికారమైన రూపంలో నిలబడి వున్నాయి.

పరిణామ సిద్ధాంతమనే దానిని ఆధారం చేసుకొని, భారత దేశంలోని ఒక గొప్ప యోగి అతిమానసిక శక్తిని మానవోద్ధరణకు గాను ఈ భూమి మీదికి తీసుకొని రావలెనని, ఈ శతాబ్ద పూర్వార్థ భాగంలో ప్రయత్నం చేసాడు కాని, దురదృష్టవశాత్తు అతని లక్ష్యము నెరవేరడానికి తగినంత ఆయుష్యు ఆయనకు లేక పోయింది. సహజమార్గంలో మానవుడిని దివ్యత్వము చేయడానికి గాను మూలప్రజ్ఞ మాత్రమే పొరబాటు లేకుండా పని చేస్తుందని గ్రహించినందువల్ల, దానినే ఉపయోగ పెట్టబడుతుంది. మరియు అంతిమశక్తిని, లేక ప్రజ్ఞానమును, లేక మూలమును ప్రాణాహుతి జేయుట ద్వారా దివ్య జీవనరూపాన్ని దాలుస్తుంది.

దివ్యత్వము చెందిన జీవనమనేది, దైవసామ్రాజ్యములో జరిగే ఒక మహత్తర కార్యక్రమం. అవగాహనకు ఇదే స్థూలంగా హృదయ ప్రాంత మందు వుద్భవించే నిర్మలమైన ప్రేమ. మూల శక్తి యొక్క ప్రతిబింబమే అది. ఈ పవిత్ర ప్రేమ యొక్క శక్తికి, ఇతర ఏ శక్తి గూడా తక్కువేగాక మరియు జడముగూడ. వేదాంత, మత, మరి యితరసంబంధమైన గ్రంధాలలో జ్ఞానాన్ని గుఱించిన గొప్పదనాన్ని చెప్పబడింది. కొంత మంది కర్మయోగాన్ని గుఱించి పొగిడి, మరికొందరు భక్తి యోగాన్ని గుఱించి చెప్పారు. ఈ కర్మ భక్తి జ్ఞానాలనన్నిటిని బహుసుందరంగా సమన్వయం చేయడానికి, శ్రీ అరవిందులు ప్రయత్నం చేసారు. సహజమార్గములో ఈ మూడు కూడా హృదయ ప్రాంతమునుండి ఉద్భవించే పవిత్ర ప్రేమ యొక్క మహత్తర చలన శక్తి క్రింద వ్యవహరించే స్థూలక్రియలే. మరియు, ఈ ప్రేమ అనేది దివ్యత్వము చెందిన జీవనానికి ఆధారభూతమైన మూల శక్తి యొక్క స్థూల ప్రతిబింబమే.

మూలకారణమగు "దాని"ప్రాణాహుతిచే ప్రసరింపజేయుటవల్ల దివ్య జీవనానికి అవసరమైన శిష్టాచారములు స్వతఃగ ఈ సహజమార్గ పద్ధతిలో చేరి వుంటాయి. ఈ కారణమువల్లనే ఇంతవరకు అనుసరింపబడిన యితరదైవీక అన్వేషణా పద్ధతులలోవలె క్రిందబడడము, దిగజారుడు, మొదలయిన వక్రగతులు

ఈ పద్ధతిలో ఏర్పడడానికి ఆస్పదము ఏమాత్రము లేదు. ఏ పద్ధతిలోనైనా అనుచరులు నియమాలను పటిష్టంగా అనుసరించకపోవడమే దిగజారడానికి ప్రథమ కార్ణమని ఆచూకి తీయవచ్చు. ఈ పటిష్టత సళ్ళుబారడానికి గల కారణమేమంటే ఈ నియమాలన్ని బాహ్యామైన నియమాలు కావడంవల్లనే. మానవకోటి దివ్యజీవనమువైపు పరిణామంచెందడానికి, అనుచరుల జీవితములో అవసరమగు శిష్టాచారములను స్వతఃగా ప్రవేశపెట్ట గల్గునట్టి మార్గసాధనా పద్ధతితో ఎంతైనా అవసరముంది. సహజమార్గ పద్ధతి ఈనాటి అవసరాన్ని, మరియు మానవ హృదయము, ఆత్మల యొక్క శాశ్వత అవసరాన్ని తీరుస్తుంది. దివ్య జీవనాన్ని పొందాలనే కోరిక గల్గిన వారికి దైవాన్ని మళ్ళించే ఆస్పదాన్ని సహజమార్గమను పేరుతో కనిపెట్టబడిన విశిష్టమైన ఆధ్యాత్మిక సాధనా పద్ధతికి ధన్యవాదాలు. ఏ స్త్రీగాని, పురుషుడుగాని దివ్యజీవన రూపముతో సంబంధము కలుగ జేసుకొనుటకు ఇష్టపడి, సంబంధము ఏర్పరచుకొంటే, ప్రతివారి జీవనము వెంటనే దివ్యత్వము చెందగలదు. ఈ అవకాశము యొక్క విశిష్టత ఏమంటే అనేక జన్మలు ఎత్తవలసిన అవసరముగాని, యుగాలతరబడి వేచియుండు అవసరముగాని లేకుండా ఒకని జీవితకాలములోనే ఇది సిద్ధింపగలదు. మరియు ఎంతో కాలానికి భవిష్యత్తులో మనోకల్పితమైనదాని కొరకుగాని, లేక అతిమానసమైన దాని రాక కొరకుగాని ఎవరేగాని ఎదురు చూడాల్సిన అగత్యము లేదు. ఆవిధముగా ఎదురుచూడవలెనంటే తన భౌతిక రూపమును మరియు శరీరాన్ని శాశ్వతంగా వుండేట్లు చేయాల్సివస్తుంది. అంటే, అది మళ్ళీ మరొక అపహాస్యమైన అపద్ధపు పరిస్థితికి దారి తీస్తుంది.

ఈ నాటి ప్రకృతి శాస్త్రవివరణ ప్రకారము అనేకములగువాటి యొక్క కలయిక ఎక్కువ అగుటయే జీవపరిణామమునకు ప్రధాన లక్షణమని తెలుస్తున్నది. అనేకములగువాటిని ఇంకా వృద్ధి చేసుకొందామనే తలంపు గాకుండా, వీటినన్నింటిని తొలగించుకొని సాధ్యమైనంత సామాన్య స్థితిని పొందాలనేదే మానవుని యొక్క సహజకోరిక. ఈ సామాన్యత అనేది దివ్యజీవన రూపంలోనే సంపూర్ణంగా పొంద బడుతుంది. హృదయంలోని అన్ని సంస్కారాలు పూర్తిగా తొలగింపబడుతాయి. హృదయ గ్రంధి పూర్తిగా విడివడుతుంది. సహజమార్గములో సంస్కారాన్ని వృద్ధి చేసుకొందామనే తలంపుగూడా మొదలంట పెకళింపబడుతుంది. అంతిమ సామ్యమనబడు మూల కేంద్ర ప్రాంత మందు మానవుడు జీవించడము మొదలవుతుంది. ఈ పొందినట్టి స్థాయిని మాటలచే వర్ణింప వీలులేదు.

కేంద్రము, లేక మూల స్థానము యొక్క పరిపూర్ణ కిరణమే ఈ దివ్యత్వము చెందిన జీవనరూపము. జీవనము యొక్క సమస్త చర్యలు, కదలికలు మూల స్థితి యొక్క మెరుపులే. ప్రతికదలిక గూడా మూలమును చూపునట్టిదై, దైవశోభను గుర్తుచేస్తుంది. సమస్త ప్రతిబంధకాలు అంతర్ధానమైపోతాయి. దైవీకము యొక్క ఉద్దేశ్యము మానవునిలో సంపూర్ణంగా నెఱవేరి, మానవ జీవనము అంతిమ లక్ష్యమును పొందును.

బాధలు, కష్టాలు, ప్రతికూల శక్తులు, సంపూర్ణంగా లేకుండా వుండడమనేది ప్రకృతి విరుద్ధము, మరియు అసంభవము. అయితే దివ్యత్వము చెందిన జీవనములో అవి క్రొత్త వెలుగును స్వీకరిస్తాయి. ప్రతి కూల శక్తులను ఎదుర్కొని వశపరచుకోడానికి, మరియు బాధలు కష్టాలనే వాటిని సహించడానికే గాక, ఆనందపడడానికి గూడా సరియైన వైఖరి దానంతకు అదే అభివృద్ధి చెందుతుంది. అవన్ని గూడా పరిష్కరించాల్సిన సమస్యలుగా గాక, అవి, చర్య ప్రతిచర్యల యొక్క పర్యవసానములేనని గమనించ బడుతాయి. మోసపోవడానికి ఏ మాత్రము అవకావము లేకుండా దైవనాటకము బాగా స్పష్టంగా గోచరిస్తుంది. దృగ్గోచరమగు ఈ సమస్తమునకు వెనుకవుండే వాడు సర్వసమర్థుడని పూర్తిగా తెలుసుకొంటాడు. చేస్తూవుండే కృషియంతా గూడా సగము తెలిసి, సగము తెలియనిదిగా గాకుండా, భగవంతుని సామ్రాజ్యమగు అనంతములోనికి ఇంకా వ్యాపకం చెందు ఉద్దేశ్యముతో కూడినదై వుంటుంది.

ఇదంతా కూడా సహజమార్గము యొక్క కేవలము ప్రతిజ్ఞయే కాకుండా, అతి త్వరలో పొందదగు స్థితియే. ఈ రాజయోగ అభ్యాసము చేబట్టిన వారందరికి ఈ విషయం బాగా తెలుసు. మరియు, సామర్థ్యమున్న వారు ఇంకనూ పరిశోధనలు చేస్తున్నారు. ఈ సాధనను చేబట్టి వారికి వారే గమనించవలసినదని నేను చదువరులనందరిని యిందు మూలముగా ఆహ్వానిస్తున్నాను.

# అనుబంధము

## సహజమార్గ అభ్యాసులు ధ్యానము చేయు విధానము

### ఉదయము - ధ్యానము

పూజకై ప్రత్యేకించబడిన స్థలములో ఒకే ఆసనమునకూర్చుండి, శారీరక, మానసిక శుభ్రతలను కలిగి, నిత్యము, నిర్ణీత సమయమునందు సూర్యోదయమునకు ముందే ఒక గంటకాలము ధ్యానము చేయుము.

హృదయములో దివ్యతేజస్సు కలదను భావము కల్గి, మనస్సుపై ఒత్తిడిలేకుండా, సహజముగా ధ్యానము చేయుము. అక్కడ తేజస్సు కనబడనిచో లెక్కచేయకుము. అది ఒక ఊహగా ధ్యానము ప్రారంభింపుము. ఏకాగ్రతకై ప్రయత్నించక సహజపద్ధతిలో ఒకే ఆసనమున కూర్చుండి మనస్సును హృదయము వైపు మరల్చుము. ఆసమయమున వచ్చు ఆలోచనలను ఆహ్వానించకయే వచ్చిన అతిధులుగా భావించి, వాటిని గమనించక, దృష్టిని ఏకైక లక్ష్యముపై నిలుపుము.

### సాయంకాలము - అంతఃశుద్ధీకరణ క్రియ

నీ ఆధ్యాత్మిక ప్రగతికి ప్రతిబంధకములైన మాలిన్యములు, జడత్వము, తామసము, సంస్కారములు మొదలగునవి నీలోని ప్రత్యణువునుండి, ఆవిరిరూపములో నీ శరీరము వెనుక భాగము నుండి బయటికి పోవుచున్నవి అను సంకల్పముతో సాయంకాలము అరగంట కూర్చుండుము. నీవు విడువదలచిన వాటిని గుఱించి ధ్యానమున తలచకుము. సరళముగా వాటిని తుడిచివేయుము.

### ప్రార్థన

ప్రభూ! నీవే మానవ జీవనమునకు లక్ష్యము.
మాకోరికలు మాఆత్మోన్నతికి ప్రతిబంధకములై యున్నవి.
నీవే మా ఏకైక స్వామివి మరియు ఇష్టదైవము.
నీ సహాయములేనిదే నిన్ను పొందుట అసంభవము.

రాత్రి నిదురించుటకు ముందు వినమ్రభావముతో పై ప్రార్థన ఒకటి రెండు సార్లు మనస్సులోనే ఉచ్చరించి దాని యందుగల భావము పై ధ్యానము చేయుచు, దాని యందే లీనమై నిదురించుము.

# సహజమార్గ

## దశ నియమములు

1. ప్రొద్దు పొడవక ముందే నిద్రలెమ్ము. నిర్ణీత సమయమున సూర్యోదయమునకు ముందయినచో మంచి. ఒకే ఆసనమున కూర్చొని ప్రార్థన, పూజాదికములను కావింపుము. మానసిక శారీరక పారిశుద్ధ్యమును ప్రత్యేకముగా పాటింపుము.
2. ప్రేమ, భక్తి పూర్వకమైన హృదయముతో ఆధ్యాత్మికోన్నతి కొఱకు ప్రార్థన జరిపి, పూజ నారంభింపుము.
3. భగవంతునితో సంపూర్ణఐక్యము పొందుటయే నీ గమ్యముగా నిర్ణయించుకొనుము. దానిని సాధించునంత వఱకు విశ్రమింపకుము.
4. ప్రకృతితో సారూప్యము పొందుటకు నిష్కపటముగాను, నిరాడంబరముగాను ఉండుము.
5. సత్యసంధత కలిగి యుండుము. దుఃఖములను దివ్యమైన దీవెనలుగా భావించి, అవి నీ మేలు కొఱకే కలుగుచున్నవని కృతజ్ఞతాభావముతో నుండుము.
6. అందఱిని సోదరులుగా భావించి, అట్లే వారి నాదరింపుము.
7. ఇతరులు కీడు చేసినచో ప్రతీకారబుద్ధి పూనకుము. దానిని దివ్యబహూకృతిగా కృతజ్ఞతతో స్వీకరింపుము.
8. ఋజువర్తనతోడను, భక్తిభావముతోడను ఆర్జించిన దానితో తృప్తిచెంది, నిరంతర దివ్యభావములతో దాని నారగింపుము.
9. ఇతరులలో భక్తి ప్రేమభావముల మొలకెత్తించునట్లుగా నీ జీవనమును మలచుకొనుము.
10. పడుకొనబోవు సమయమున, దైవసాన్నిధ్య భావనతో, నీ వొనర్చిన తప్పులగూర్చి పరితప్తుఁడవు కమ్ము. వాటిని మఱి చేయనవి వినమ్ర భావముతో భగవంతుని క్షమాపణ కోరుము.